రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్‌లో వర్ష బీభత్సం
నిమ్మకు నీరెత్తినట్లుగా కేంద్రం తీరు 07
రామమందిర విరాళాల కేసు... ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా



సంపుటి 09, సంచిక: 219 | గురువారం | 09-07-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




2027 నీట్–యుజి

## ఇక 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష'

ప్రకటించిన కేంద్రం

ఆరు రోజులపాటు 1,000కి పైగా కేంద్రాలలో నిర్వహణ

**న్యూఢిల్లీ :** నీట్–యుజి (2026) పరీక్ష నిర్వహణ సమయంలో చోటు చేసుకున్న పేపర్‌లీక్, అవినీతి, అవతవకలు, తప్పిదాలను సరిదిద్దుకునే చర్యలు ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం. ఈ పరిణామాలు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో తీవ్రస్థాయి నిరసన ఉధృతం అయ్యే వరకూ దారితీసిన నేపథ్యంలో కేంద్రం ఈ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. 2027 నీట్–యుజి పరీక్షను పెన్ను, పేపర్ ఆధారితంగా కాకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)గా నిర్వహిస్తామని కేంద్రం ప్రకటించింది. నీట్ యుజిని పెన్ను, పేపర్ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలా? వద్దా? అనే విషయంపై విద్యా, ఆరోగ్య మంత్రిత్వ శాఖల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా కూలంకషమైన చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించనున్న వైద్య ప్రవేశ పరీక్ష నీట్–యుజి 2027 కనీసం ఆరు రోజుల పాటు 1,000కి పైగా కేంద్రాలలో జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలియజేశాయి. నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)–యుజి అనేది దేశంలోనే అతిపెద్ద అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష. ఈ కీలకమైన ప్రవేశ పరీక్షకు తరువాయి 8లో

హరిత ఆర్థిక వ్యవస్థకు

# సహకారం అందించండి

- హైదరాబాద్‌లో మల్టీ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటును పరిశీలించండి
- కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో సిఎం రేవంత్ రెడ్డి భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, ఇదే తరహాలో కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి హైదరాబాద్‌లో మల్టీ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇండియాలో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌కు సూచించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని సిఎం కోరారు. తెలంగాణను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందని సిఎం వెల్లడించారు. ఇండియాలో కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెనడాతెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు రావాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలుగా సహకరిస్తుందని క్రిస్ కూటర్, హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా పర్యటనకు ఆహ్వానించారు. రానున్న నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి ఇంధన రంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరో స్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణలో చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, తరువాయి 8లో

# మళ్లీ యుద్ధం



## కాల్పుల విరమణ రద్దుచేసినట్లు ట్రంప్ ప్రకటన



- హోర్ముజ్‌లో పరస్పర దాడులతో బాంబులమోత
- 60 ఐఆర్‌జిసి పడవలు సహా 85 లక్ష్యాలపై సెంట్‌కామ్ గగనతల దాడులు
- కువైట్, బ్రహ్రైన్‌లలో ఐఆర్‌జిసి ప్రతిదాడి ఎనిమిది మంది ఇరాన్ సైనికుల మృతి

**అంకారా/దుబాయ్ :** కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ యుద్ధ భేరీ మోగించారు. హోర్ముజ్ జలసంధి మరోసారి గగనతల డ్రోన్‌దాడులు,బాంబుల మోతలతో ప్రతిధ్వనించింది. జలసంధిలో ఐఆర్‌జిసికి చెందిన 60 పడవలపై బాంబులు కురిపించడంతో సహా దక్షిణ ఇరాన్‌లో మొత్తం 85 లక్ష్యాలపై గగనతల దాడులతో విధ్వంసం సృష్టించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతం వెంబడి ఉన్న అనేక నిఘా–పర్యవేక్షణ కేంద్రాలపై అమెరికా సెంట్‌కామ్ దాడులు చేసింది. ఇరాన్‌లో ఏకైక పౌర అణు విద్యుత్ కేంద్రం ఉన్న బుషెర్ రాష్ట్రంలో వరుస బాంబు పేలుళ్ళు సంభవించాయి. ఇది ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ద్వీప సమీపంలోనే ఉంది. దీంతో రెచ్చిపోయిన ఇరాన్ సైనిక దళం కువైట్,బహ్రైన్‌లలో ఉన్న అమెరికా స్థావరాలపై భారీ ఎత్తున దాడులు చేశాయి. అమెరికా ఎంక్యూ–9 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. కువైట్ ఆతిథ్యం స్థావరంలో 13,500 మంది అమెరికా సైనికులు ఉన్నారు. ఈ తాజా యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిలో వేలాదిమంది నావికులు స్తంభించిపోయారు. హోర్ముజ్‌లో భద్రత లేకపోవడంతో నాలుగు వాణిజ్య చమురు ట్యాంకర్లు జలసంధిని దాటి మహాసముద్రంలో ప్రవేశించలేక తిరిగి వెనక్కి వెళ్ళిపోయాయి. ఇస్లామాబాద్ ఎంఓయు ఒప్పందం ప్రకారం ఇరాన్ చమురు ఎగుమతులపై తాత్కాలికంగా ఆంక్షలు ఎత్తివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ట్రంప్ రద్దుచేశారు. అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర డ్రోన్ దాడులు కొనసాగాయి.నైరుతీ ఇరాన్‌లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు చెందిన ఎనిమిది మంది అమెరికా దాడిలో మరణించినట్లు ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. దీంతో నిర్ణీత ప్రకారం ఈ వారం చివరిలో తరువాయి 8లో

### ఇరాన్‌ను నాశనం చేసే సత్తా మాకే ఉంది

అమరుడైన ఇరాన్ ఇస్లాం విప్లవ నాయకుడు అయెతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంతిమయాత్ర ఒకవైపు కొనసాగుతున్న సమయంలో, మంగళవారం ట్రంప్ ఆక్సియోస్ న్యూస్‌తో మాట్లాడుతూ, వాళ్ళు తుది ఒప్పందానికి రాకపోతే ''మా పని పూర్తిచేస్తాం'' ఒక్క దెబ్బతో ఇరాన్‌ను నాశనం చేయగల సత్తా మాకు ఉంది, కానీ చర్చలు జరపడానికి ఎవరూ మిగలరనే ఉద్దేశంతో మేం మంచివాళ్ళం కాబట్టి దాడులు చేయడం ఆపేశాం' అని చేసిన హెచ్చరిక తర్వాత హోర్ముజ్ జలసంధిలో ఖతార్,సౌదీఅరేబియాలతో సహా మూడు వాణిజ్య చమురు ట్యాంకర్లపై డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ట్యాంకర్లు ధ్వంసమై సముద్రంలోనే స్తంభించిపోయాయి.

## చట్టాలకు ఆర్‌ఎస్‌ఎస్ అతీతం కాకూడదు 02

– సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్య

# బెంగాల్‌లో అరాచకం

- మైనర్ బాలికపై హత్యాచారం
- టిఎంసి నిరసన ర్యాలీ, బిజెపి దాడి
- ముందస్తు ప్రణాళికతో విధ్వంసం : మమతా బెనర్జీ ఆరోపణ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో రాజకీయ అలజడి చెలరేగింది. టిఎంసిలో చీలికలు వచ్చాయి. రాష్ట్రంలో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. తాజాగా బరుయిపూర్‌లో 11 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య ఘటనకు చోటు చేసుకుంది. ఘటనను నిరసిస్తూ బుధవారం మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. బిజెపి టిఎంసి యువజన విభాగం కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. కలకత్తా హైకోర్టు అనుమతితో టిఎంసి యువజన కార్యకర్తలు నిర్వహించిన ఈ ర్యాలీని బిజెపి కార్యకర్తలు పదేపదే అడ్డుకున్నారు. వారు దొంగ అంటూ నినాదాలు చేయడమే కాకుండా, హజ్రా రోడ్డు మీదుగా సాగుతున్న ర్యాలీ మార్గంలో మానవ అడ్డుగోడలను ఏర్పాటు చేయడానికి కూడా ప్రయత్నించారు. దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్ ఫారీ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో, ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు పిడిగుద్దులతో కొట్టుకున్నారు. గొడవ పడుతున్న వారిని చెదరగొట్టడానికి భద్రతా దళాలు జోక్యం చేసుకుని లాఠీచార్జ్ చేశాయి. బరుయిపూర్ ఘటనపై నిరసన ర్యాలీ నిర్వహించే హక్కు టిఎంసికి లేదని ఆందోళనకారులైన బిజెపి కార్యకర్తలు వాదించారు. టిఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ సుమారు మూడు కిలోమీటర్ల మార్గం పొడవునా వివిధ దశల్లో కొనసాగిన ఈ ఘర్షణలు, మాజీ ముఖ్యమంత్రి నివాసానికి సమీపంలో ఉన్న హజ్రా క్రాసింగ్ వద్ద ముగింపు దశలో తీవ్రరూపం దాల్చాయి. పరిస్థితి అదుపు తప్పకుండా చూసేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిఎంసి కార్యకర్తలపై జరిగిన దాడిని మమతా బెనర్జీ ఖండిస్తూ, బిజెపి ముందస్తు ప్రణాళికతో కూడిన విధ్వంసానికి పాల్పడిందని, పురుషులు, మహిళలని తేడా లేకుండా దాడి చేసిందని మండిపడ్డారు. దాడి సమయంలో నగర పోలీసులు మూగ జీవులుగా ఉండిపోయారని ఆరోపించారు. హరీష్ ఛటర్జీ వీధిలోని తన ఇంటి ముందు గుమిగూడిన ఉద్వేగభరితమైన గుంపును చెదరగొట్టడానికి మమతా బెనర్జీ ప్రయత్నించారు. 'ఈ ర్యాలీని నిర్వహించడానికి తరువాయి 12లో

నన్ను మూడు నెలలు ఇరిగేషన్

# మంత్రిని చేయండి

నీళ్లు ఎలా రావో చూస్తా

- కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లి వరకు నీళ్లు తీసుకొస్తా
- లేనిపక్షంలో రాజకీయాల నుంచి తప్పుకుంటా
- బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత హరీశ్‌రావు సవాల్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రిగా తనకు మూడు నెలలు అవకాశమిస్తే, నీళ్లు ఎలా రావో చూస్తానని, కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లి వరకు నీళ్లు తీసుకొస్తానని,నీళ్లు తీసుకురాలేకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు సవాల్ విసిరారు. ఈ మూడు నెలల పాటు తనకు జీతం, కారు, ఫ్యూన్, ఫ్యాన్ ఏమీ వద్దని, తనకు పదవులు ఏం కొత్త కాదని,13 ఏళ్లు మంత్రిగా పని చేశానని స్పష్టం చేశారు. నీటి పారుదల విషయంలో చర్చకు కెసిఆర్ రావాల్సిన అవసరం లేదని,తాము సరిపోతామని,శాసనసభ సమావేశాలను ఎప్పుడు నిర్వహించిన తాము చర్చకు సిద్ధమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'కాళేశ్వరం ప్రాజెక్ట్' వివరాలపైన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తమ్మిడిహట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు ఒప్పంద పత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి బయటపెడితే తాను రాజీనామా చేస్తానని, లేదంటే సిఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెప్పినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తమ్మిడిహట్టి నిర్మిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని, ఈ రెండున్న రేళ్ల కాలంలో ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ డిఎన్‌ఎలోనే అవినీతి ఉందన్నారు. తమ నివేదికను దృష్టిలో పెట్టుకునే మేడిగడ్డ బ్యారేజీని నిర్మించినట్టు రిటైర్డ్ ఇంజనీర్ల తరువాయి 8లో

తాడిచెర్ల

# కొత్తదేమీ కాదు

పాత దానికే అనుమతి

సింగరేణిపై ప్రేమ ఉంటే గోదావరి లోయ బ్లాకులన్నీ కేటాయించాలి

ప్రైవేట్ వారికి ఇచ్చిన బ్లాకులను వెనక్కి తీసుకుని సింగరేణికి ఇవ్వాలి

ఆధారాలతో సహా కేంద్రం తీరును ఎండగట్టిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల–2 కోల్ బ్లాక్ కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను మరుగున పరిచి, తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణికి 2013లో కేటాయించిన తాడిచర్ల–2 బ్లాక్‌ను మళ్లీ సింగరేణికి కేటాయిస్తున్నట్టు కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడాన్ని ఆయన ఖండించారు. ఇప్పటికే కేటాయించిన తాడిచర్ల–2 బ్లాక్‌కు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మంజూరు చేసింది కేవలం లీజు మాత్రమేనని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. 2013లో కేటాయించిన తాడిచర్ల–2 బ్లాక్‌ను ఇప్పటివరకు లీజు ఇవ్వకుండా కేంద్రం జాప్యం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దీనిపై కేంద్రానికి లేఖలు రాస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ కృషి వల్లనే కేంద్రం లీజుకు అనుమతి ఇచ్చిందని అన్నారు. హైదరాబాద్ ప్రజా భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తాడిచర్ల–2 బ్లాక్, సింగరేణికి మంజూరు చేయాల్సిన బ్లాకులపై ఆధార పత్రాలతో సహా తరువాయి 8లో



జంతర్‌మంతర్‌లో సిజెపి చేపట్టిన నిరసనకు సంఘీభావంగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష 11వ రోజుకు చేరింది. ఆయన బరువు 7 కిలోలు తగ్గగా, ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. 07

విద్యార్థుల ఆగ్రహానికి గురైన ప్రభుత్వానికి మనుగడ ఉండదు 03

క్యూబాలో అమెరికా

# జాతి నిర్మూలన చర్యలు

- ఇంధన ఆంక్షలు, నౌకా దిగ్బంధం యుద్ధంతో సమానం
- ఐ.రా.స జనరల్ అసెంబ్లీలో క్యూబా మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్
- ఈ దురాగతాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్
- ప్రచారం కోసం నింద మాపై వేస్తున్నారు : అమెరికా బుకాయింపు



**హవానా:** క్యూబాలో దారుణమైన,అసాధారణ ఆంక్షల ద్వారా అమెరికా జాతి నిర్మూలనకు పాల్పడుతోందని క్యూబా విదేశాంగమంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో జరిగిన చర్చలో అమెరికా దురాగతాలను ఆయన ప్రపంచం ముందుకు తెచ్చారు. అమెరికా విధించిన ఏకపక్ష చమురు ఆంక్షలు, ట్రంప్ ప్రభుత్వ నౌకా దిగ్బంధనం యుద్ధం చేయడంతో సమానమని విమర్శించారు. ఈ విషయాలను తీవ్రంగా ఖండించి ఐక్యరాజ్యసమితి ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రపంచ వేదికపై డిమాండ్ చేశారు. ఐతే ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి మైక్ వాల్జ్ సహా ఇతర అమెరికా ప్రతినిధులు ఈ వాదనను తిరస్కరించారు. ఇదంతా ప్రచారంకోసమే చేస్తున్నారని,క్యూబాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మానవతా సంక్షోభానికి తమను బాధ్యుల్ని చేస్తూ, నింద తమపై వేసి తప్పులు కప్పిపుచ్చుకునే చర్యలకు పాల్పడుతున్నారని ప్రత్యారోపణలు చేశారు. క్యూబాలో నెలకొన్న ఇంధన, విద్యుత్ సంక్షోభంపై జనరల్ అసెంబ్లీ చర్చల్లో ఆ దేశం తన వాదనలను, జరుగుతున్న అన్యాయాన్ని బలంగా వినిపించింది. సమస్యను ప్రపంచ వేదిక ముందు పెట్టి తరువాయి 12లో

# నీట మునిగి విద్యార్థి మృతి

- ఫొటోలు దిగుతుండగా నీటిలో పడిపోయిన వైభవ్ కుమార్
- ములుగు జిల్లా మాసాలోద్ది జలపాతంలో విషాదం

ప్రజాపక్షం/ములుగు

ములుగు జిల్లా వాజేడు మండలం దూలాపురం శివారులోని మాసాలోద్ది జలపాతంలో బుధవారం విషాద ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లాకు చెందిన 18 ఏళ్ల బిటెక్ తొలి సంవత్సరం విద్యార్థి యాద వైభవ్ కుమార్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వైభవ్ కుమార్ తన ఆరుగురు స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చాడు. వరంగల్‌లోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించిన అనంతరం బొగత తరువాయి 12లో



## నగరాలను ముంచుతున్న 'వైఫల్యం'!

వర్షాకాలం రాగానే దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాలు ఒకే విధమైన దృశ్యాలను ఆవిష్కరించడం షరామామూలే. కొద్ది గంటలపాటు కురిసిన వర్షానికే రహదారులు నదుల్లా మారిపోతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సి వస్తోంది. వాహనాలు కొట్టుకుపోతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వ్యాపారాలు స్తంభిస్తున్నాయి. పాఠశాలలు, కార్యాలయాలు మూతపడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఇదే కథ. పరిష్కారాల విషయంలో మాత్రం పెద్దగా మార్పు లేదు. ప్రకృతిని నిందించడం సులభమే. కానీ వాస్తవానికి నగరాలను ముంచేది వర్షం కాదు, మన నిర్లక్ష్యం, అవినీతి, ప్రణాళికా రాహిత్యమే అనడం తప్పుకాదు. నగరాలను మన వైఫల్యమే ముంచెత్తుతున్నది! నిజానికి ప్రకృతి తన పని తాను చేస్తుంది. వర్షాలు కురుస్తాయి. నదులు ప్రవహిస్తాయి. తుపానులు వస్తాయి. ఇవన్నీ భూమి సహజ వ్యవస్థలో భాగం. వాతావరణ మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు మరింత పెరిగిన మాట నిజమే. కానీ అదే పరిమాణంలో వర్షం గతంలో కురిసినప్పు డు ఇంత విపత్తు ఎందుకు సంభవించేది కాదు? ఈ ప్రశ్నకు సమాధానం ప్రకృతిలో కాదు, మన అభివృద్ధి నమూనాలో దొరుకుతుంది. ఒకప్పుడు ప్రతి నగరంలో చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు సహజమైన నీటి మార్గాలుగా ఉండేవి. వర్షపు నీరు వాటి ద్వారా సులభంగా బయటకు వెళ్లేది. భూ గర్భ జలాలు కూడా సమృద్ధిగా ఉండేవి. కానీ జనాభా పెరుగుదల, రియల్ ఎస్టేట్ వ్యాపారం, రాజకీయ ఒత్తిళ్లు కలిసి ఈ సహజ వ్యవస్థను పూర్తి గా దెబ్బతీశాయి. చెరువులు క్రమంగా మాయమయ్యాయి. వాటి స్థానంలో అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, పరిశ్రమలు, నివాస కాలనీలు వెలిశాయి. వాగులు కాంక్రీటు గోడల మధ్య బందీలయ్యాయి. కాలువలు చెత్తతో నిండిపోయాయి. నీరు ప్రవహించే మార్గాలనే మనం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన తర్వాత, వర్షపు నీరు తన దారిని వెతుక్కుంటూ ఇళ్లలోకి, రోడ్లపైకి రావడం సహజమే. ముంబయి లేదా ఢిల్లీ... కోల్‌కతా లేదా చెన్నై..మన హైదరాబాద్... దేశంలోని దాదాపు ప్రతి మహానగరం ఇదే సమస్యను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు వందలాది చెరువులతో ప్రసిద్ధి చెందిన నగరాలు ఇప్పుడు వాటిలో చాలా భాగాన్ని కోల్పోయాయి. వర్షం పడితే నీరు నిలిచిపోవడానికి ప్రధాన కారణం చెరువుల మధ్య ఉండే అనుసంధాన గొలుసు కాలువలు అదృశ్యం కావడమే. చెరువు నిండిన నీరు మరో చెరువుకు వెళ్లే మార్గం లేకపోవడంతో, మొత్తం నీరు నివాస ప్రాంతాల్లోకి ప్రవహిస్తోంది. మరో ప్రధాన కారణం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం. నగరాల విస్తీర్ణం వేగంగా పెరుగుతున్నప్పటికీ, మురుగు కాలువలు, వర్షపు నీటి కాలువలు మాత్రం దశాబ్దాల క్రితం రూపొందించిన సామర్థ్యంతోనే కొనసాగుతున్నాయి. చాలా చోట్ల మురుగు నీటి కాలువలనే వర్షపు నీటి పారుదల కోసం కూడా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోతోంది.

అభివృద్ధి పేరుతో కొత్త రోడ్లు నిర్మిస్తున్నాం. ఫ్లైఓవర్లు వేస్తున్నాం. మెట్రో మార్గాలు నిర్మిస్తున్నాం. కానీ భూమి అడుగున ఉండాల్సిన డ్రైనేజీ వ్యవస్థపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. ప్రజలకు కనిపించని పనులపై ఖర్చు చేయడానికి పాలకులు పెద్దగా ఆసక్తి చూపరు. ఎందుకంటే వాటితో రాజకీయ ప్రచారం సాధ్యం కాదు. ఫలితంగా కనిపించే అభివృద్ధి పెరుగుతోంది. కనిపించని మౌలిక సదుపాయాలు క్షీణిస్తున్నాయి. ఈ సమస్యకు మరొక మూల కారణం అంతులేని అవినీతి. నగర ప్రణాళిక నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు ఇవ్వడం, చెరువుల ఆక్రమణలను చూసీ చూడనట్లు వదిలేయడం, నాణ్యత లేని డ్రైనేజీ పనులను ఆమోదించడం, కాలువల శుభ్రత పేరిట ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా వాస్తవంగా పనులు జరగకపోవడం వంటి అంశా లు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ప్రజల భద్రత కంటే లంచాలు, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తే నగరాలు వరదల బారిన పడటం తప్పదు. ప్రతి విపత్తు తర్వాత విచారణ కమిటీలు ఏర్పడతాయి. నివేదికలు వస్తాయి. సిఫార్సులు అందుతాయి. కానీ అవి ఫైళ్లకే పరిమితమవుతున్నాయి. వచ్చే ఏడాది మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది.

ప్రతి భారీ వర్షం తర్వాత నష్టపరిహారం ప్రకటించడం కంటే, ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నగరంలోని అన్ని చెరువులు, వాగులు, కాలువలను డిజిటల్ మ్యాపింగ్ చేసి వాటిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలి. వర్షపు నీటి కోసం ప్రత్యేక స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. ప్రతి నిర్మాణానికి ఇంకుడు గుంటలు తప్పనిసరి చేయాలి. నిర్మాణ అనుమతుల్లో నీటి ప్రవాహ మార్గాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులను పరిరక్షించే చట్టాలను కఠినంగా అమలు చేయాలి. అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి వర్షాకాలానికి ముందు కాలువల శుభ్రతను స్వతంత్ర సంస్థల ద్వారా పరిశీలించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సమర్థంగా వినియోగించుకోవచ్చు. ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత వరద అంచనా నమూనాల ద్వారా ప్రమాద ప్రాంతాలను ముందుగానే గుర్తించవచ్చు. ప్రజలకు మొబైల్ హెచ్చరికలు పంపించడం, అత్యవసర స్పందన బృందాలను సిద్ధంగా ఉంచడం, వరద ముంపు మ్యాపులను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రకృతిని మనం ఆపలేం. వర్షాన్ని నిలిపివేయలేం. తుపానులను రద్దు చేయలేం. కానీ వాటి వల్ల కలిగే నష్టాన్ని మాత్రం ఖచ్చితంగా తగ్గించగలం. దానికి అవసరమైంది రాజకీయ సంకల్పం, అవినీతి రహిత పరిపాలన, శాస్త్రీయ నగర ప్రణాళిక, చట్టాల కఠిన అమలు, ప్రజల బాధ్యతాయుత భాగస్వామ్యం.

ప్రతి సంవత్సరం వరదలను విధిలిఖితంగా అంగీకరించడం కాకుండా, వాటి మూల కారణాలను నిర్మూలించే దిశగా అడుగులు వేయాలి. లేకపోతే ప్రతి వర్షాకాలం మన అభివృద్ధి వైఫల్యానికి అద్దం పట్టే కాలంగా మిగిలిపోతుంది. నగరాలను ముంచేది ఆకాశం నుంచి కురిసే వర్షం కాదు. భూమిపై మనం చేసిన తప్పిదాలే. వాటిని సరిదిద్దగలిగితే వర్షం శాపం కాదు. జీవనాధారమవుతుంది. ●



## దేశ ప్రతిష్ఠను మసకబారుస్తోంది

**రామాలయ విరాళాల చోరీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సనాతన ధర్మ అనుచరులను, ముఖ్యంగా విరాళాలు ఇచ్చిన వారిని ఆగ్రహానికి గురిచేశాయి. విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను బిజెపి మసకబారుస్తోంది.'అయోధ్య ఆలయానికి వచ్చిన కానుకలు, విరాళాలు, చందాల చోరీకి సంబంధించిన వార్త ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. బిజెపి, దాని అనుబంధ సంస్థల వల్ల కలిగిన అపఖ్యాతి కారణంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న సనాతన ధర్మ అనుచరులు సిగ్గుపడుతున్నారు. వారిలో చాలామంది ఆలయానికి విరాళాలు లేదా వ్యక్తిగత చందాలు సమర్పించినందున వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.బిజెపిలోని మతవిరుద్ధ శక్తుల చర్యల కారణంగా దేశం తన ప్రతిష్టను కోల్పోతోంది. ఈ వివాదం కారణంగా పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతింటోంది.**

- సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు
అఖిలేష్ యాదవ్

## ఆమె నిష్క్రమించింది

ఆడజన్మ శాపమే కామాంధుల తాపానికి అమాయకపు ఆడపిల్లలు ముక్కుపచ్చలారని జీవితాలు పదమూడేళ్ళకే ఊరకుక్కల చేతిలో బలవుతున్నాయి. ఎన్ని కళలు కన్నదో ఆ తల్లి కొంగుచాటున దాచి వెన్నెల వెలుగులో పెంచిందేమో తండ్రి భుజాలపై పాదముద్రలు ఇంకా చెరిగి ఉండవేమో.... గుండెలు పగిలిపోయుంటాయ్..!

రక్తపు మరకల నడుమ కన్నపేగు రేపటి జీవితం శునకాల తొక్కిసలాటలో చితికిపోయి కళలు చెరిగి చిత్రపటంలో నిలిచిన చిన్నారి చట్టాలు చుట్టాలుగా మారిపోయాయా..! వీధి కుక్కలు ఎక్కువగా తిరిగితేనే ఊరుకోరే మరెలా వదిలేస్తున్నారు నడిరోడ్లపై....ఇలాంటి మదంపట్టిన తిరుగుబోతుల్ని. ఇంకెన్నాళ్లురా చూడాలి ఈ దారుణాల్ని, ఇంకెంతమంది ఆడపిల్లల్ని బలితీసుకుంటారు. ఇంతేనా ఇలా చూస్తూ కుమిలిపోవడమేనా కన్నవారు. మరో మార్గం ఏమి లేదా? మార్చలేరా చట్టాల్ని? అన్యాయంగా అపురూపంగా పెంచుకున్న పుత్తడి బొమ్మల్ని కోల్పోయి కుమిలిపోవడమేనా?

నెలసరి వస్తేనే మూడు రోజులు ఆ నరకం భరించలేక, విలవిలలాడిపోతూ అమ్మకి వందసార్లు ఆ నొప్పిని గుర్తుచేస్తారు ఆడపిల్లలు. అలాంటిది ఐదు రోజులు ఆ చిన్ని తల్లి ఎలా భరించిందో ముప్పదిరెండు మందిని. తలచుకుంటే కంట నీరు ఆగడం లేదు. గుండె సంద్రమైపోతుంది. ఎంత వెక్కి ఏడ్చినా పోయిన ప్రాణం తిరిగిరాదు. వాళ్లకు ఎలాంటి శిక్ష వేసినా ఆమె జీవం పోసుకొని భువిపై నడువలేదు. మమ్మల్ని ఎవరు ఏమి చెయ్యలేరు అనేది ఇలాంటి నీచుల ధైర్యమా? లేక ఏం చేసినా శిక్ష ఉండదు అని వాళ్ళ అభిప్రాయమా? మేమే గొప్పోళ్ళం అని వాళ్ళ ఆలోచనా? ఇవన్నీ కాకుండా మగాళ్ళమనే బలుపా?

ఒక విధంగా ఆలోచిస్తే మగవారిలో చాలా ఉన్నతమైన ధోరణి కలిగిన వాళ్ళు వున్నారు. కుటుంబంపట్ల బాధ్యతతో వ్యవహరించేవాళ్ళు సమాజంలో వున్నారు. ఇలాంటి వికృత చేష్టలు కలిగి జీవితాల్ని మింగేసే నీచులు ఉండడం వల్ల మంచివాళ్లపై వున్న అభిప్రాయం మాసిపోతుంది. మగవాళ్ళు అంటేనే భయం పేరుకుపోతుంది. నేటి ఆడపిల్లలు భవిష్యత్‌లో సుదూర ప్రాంతాలలో తమ జీవితాన్ని ఊహించుకోవడం ఊహగానే మిగిలిపోతుందేమో అనిపిస్తుంది. అయినా నాకొక సందేహం ఇంత చేసినా శిక్షలు ఎందుకు విధించ డం లేదు. వెంటనే చంపిపారేయకుండా సోది ఇంటరాగేషన్ అంటూ కాలయాపన ఎందుకు చేస్తున్నారు? సమాజం ఒప్పుకుంటుంది కదా! భారతీయ శిక్షాస్మృతి ప్రకారం చంపడం సరియైనది కాదా. చంపబడడం మాత్రం మంచిదా.. ఇలానే చూస్తూపోతే మన దేశంలో భవిష్యత్‌లో మగపిల్లలకు సరిపడా ఆడపిల్లల శాతం ఉండదు. ఆడపిల్లలు కావాలంటే కొట్టుకు చావాలి. ఒక్కసారి ఆలోచించండి. నీచపు ఆలోచనలు కలిగిన చోట ఎంత మంచితనం వెతికినా దొరకదు. పైగా ఆ జంతువు ఒక్కరిని బలి తీసుకొని ఊరుకోదు. అవకాశం ఇస్తే మరొకళ్ళను వేటాడి తినేందుకు చూస్తుంది. ఇప్పటికైనా ఆలోచించి శిక్షలు అమలు చేయండి.

**వాసి జ్యోత్స్న**, 9866843005

## ఫ్యాషన్ టెక్నాలజీతో సాంస్కృతిక సమైక్యత

ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి. ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే) పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది.

**ఫ్యాషన్ టెక్నాలజీ – ఫ్యాషన్ డిజైనర్స్:**

ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్న ది.

ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్నకాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం–2026 ఇతివృత్తంగా ఫ్యాషన్ ద్వారా ఐక్యత (యునిటీ త్రూ ఫ్యాషన్) అనే అంశాన్ని తీసుకొని, ఈ వేదికగా మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహిస్తూ మన దేశ ఐక్యత సాధనకు కృషి జరుగుతోంది.

ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడం శుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

**(09 జులై అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం సందర్భంగా)**

# చట్టాలకు ఆర్ఎస్ఎస్ అతీతం కాకూడదు



డి.రాజా

ఆర్ఎస్ఎస్ – బిజెపి నాయకుడు రామ్ మాధవ్ ఇటీవల ఆర్ఎస్ఎస్‌ను సమర్థిస్తూ, అది భారతీయ చట్టాల పరిధిలో బహిరంగంగా పనిచేసే, పూర్తిగా చట్టబద్ధమైన, పారదర్శకమైన సంస్థగా చిత్రించే ప్రయత్నం చేసేలా వ్యాఖ్యలు చేశారు. అలాచేసే క్రమంలో ఆయన చరిత్రను తమకు అనుకూలమైన అంశాలకే పేర్కొంటూ, భారత ప్రభుత్వంతో ఆర్ఎస్ఎస్‌కు ఉన్న సంబంధానికి సంబంధించిన అత్యంత కీలకమైన వాస్తవాలను విస్మరించారు. ఫలితంగా ఇది ఒక చారిత్రక వివరణగా కాకుండా, సంస్థ ప్రతిష్ఠను కాపాడుకునే లేదా దానిపై ఉన్న మచ్చలను తొలగించుకునే ఒక రాజకీయ ప్రయత్నంగా మాత్రమే మిగిలిపోయింది.

ఆర్ఎస్ఎస్ 1949లో స్వచ్ఛందంగా ఒక లిఖితపూర్వక నిబంధనావళిని స్వీకరించిందని, అప్పటి నుండి చట్టబద్ధంగా గుర్తింపు పొందిన సంస్థగా పనిచేస్తోందని మాధవ్ తన వ్యాసంలో ప్రధానంగా పేర్కొన్నారు. కానీ చారిత్రక వాస్తవాలు మాత్రం భిన్నమైన కథ చెబుతున్నాయి. దాని నిబంధనావళి ప్రజాస్వామ్య సూత్రాలు, ప్రజా జవాబుదారీతనానికి స్వచ్ఛందంగా కట్టుబడి ఉన్న ఒక సంస్థ చేపట్టిన చర్యలా ఉండదు. మహాత్మాగాంధీ హత్య, 1948 ఫిబ్రవరిలో ఆర్ఎస్ఎస్‌పై విధించిన నిషేధం తర్వాత, ఆ సంస్థ నాయకత్వానికి, భారత ప్రభుత్వానికి మధ్య జరిగిన సుదీర్ఘ సంఘర్షణ ఫలితంగా అది జరిగింది.

నెహ్రూ–పటేల్ నాయకత్వంతో ఎం.ఎస్. గోల్వాల్కర్ బేరసారాల్లో భాగంగానే ఆర్ఎస్ఎస్ నిబంధనావళి రూపుదిద్దుకుంది. ఆర్ఎస్ఎస్ అంతర్గతంగా సహజసిద్ధంగా పరిణామం చెందిన పత్రం కాదది. దీనిని ప్రధానంగా కాంగ్రెస్ నాయకుడు డి.పి. మిశ్రా రూపొందించారు. నెహ్రూ–పటేల్ ద్వయం దీనిని 'గురు' (గోల్వాల్కర్)పై దాదాపు బలవంతంగా రుద్దారు. ఆర్ఎస్ఎస్ వర్గాలు చర్చించేందుకు ఇష్టపడని ఇబ్బందికరమైన వాస్తవం ఇది. దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలంటే, నాటి పరిస్థితులను పరిశీలించాల్సి ఉంటుంది.

1925లో స్థాపించినప్పటి నుంచి ఆర్ఎస్ఎస్ ఎటువంటి నిబంధనావళి లేకుండానే కార్యకలాపాలు సాగించింది. దాని నిర్మాణం, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ, అంతర్గత పనితీరు అస్పష్టంగా ఉండేవి. ఇది యాదృచ్ఛికంగా జరిగిన విషయం కాదు. ఆ సంస్థ పనితీరులోనే గోప్యత అంతర్భాగంగా ఉండేది. ఆరంభం నుండే, తన సంస్థాగత నిర్మాణం, రాజకీయ కార్యకలాపాలతో ఉన్న సంబంధం విషయంలో ఆర్ఎస్ఎస్ అస్పష్టతను కొనసాగించింది. కేవలం నోటి మాటగా చెప్పిన హామీలతో ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని ఎత్తివేయడానికి భారత ప్రభు త్వం సిద్ధంగా లేదు. సంస్థ లక్ష్యాలు, నిర్మాణం, పనితీరు విధానాలను నిర్వచించే లిఖితపూర్వక నిబంధనావళి ఉండాలని అది డిమాండ్ చేసింది. గోల్వాల్కర్ దీనిని పదేపదే వ్యతిరేకించారు.

చర్చలు జరుగుతున్న సమయంలో కూడా ఆయన ఆర్ఎస్ఎస్‌కు ప్రత్యేక లక్షణమైన 'ద్వంద్వ నాలుక' విధానాన్ని కొనసాగించారు. నిషేధాన్ని ఎత్తివేయడానికి సంబంధించిన షరతులపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతూనే, మరోవైపు బయటి నుండి ఒత్తిడిని పెంచేందుకు కూడా ఆయన ప్రయత్నించారు. నిషేధానికి వ్యతిరేకంగా ప్రజా ఆందోళనను ప్రోత్సహిస్తూ, ఆయన ఆర్ఎస్ఎస్ నాయకుడు బాలాసాహెబ్ దేవరస్‌కు రహస్య సమాచారాలు పంపడానికి ప్రయత్నించాడు. ఈ సమాచారాలను అడ్డగించడం సర్దార్ పటేల్‌కు సహనానికి తుది పరీక్షగా మారింది. గోల్వాల్కర్ నిజాయితీతో చర్చలు జరపడం లేదని ఆయనకు అర్థమైంది.

ఈ సందర్భం చాలా కీలకమైనది, ఎందుకంటే రామ్ మాధవ్ నిబంధనావళి తుది ఆమోదాన్ని ఒక స్నేహపూర్వక, పరస్పర అంగీకార ప్రక్రియగా చిత్రీకరించారు. చారిత్రక ఆధారాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. జవాబుదారీతనం, పారదర్శకతను పదేపదే ప్రతిఘటించిన ఒక సంస్థపై భారత ప్రభుత్వం నిరంతర ఒత్తిడి తీసుకువచ్చిన కారణంగానే ఇది సాధ్యమైంది.

ఆ కాలంలోని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రభుత్వ అసహనం స్పష్టంగా కనిపిస్తుంది. గోల్వాల్కర్ పదేపదే తన వైఖరిని మార్చుకున్న తర్వాత, సర్దార్ పటేల్ నేతృత్వంలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆయనకు రాసిన లేఖలో ఈ విధంగా ఉంది. ''ఆర్ఎస్ఎస్ ముసాయిదా నిబంధనావళి పట్ల మేము తీసుకున్న నిర్మాణాత్మక వైఖరిని మీరు అభినందిస్తారని భారత ప్రభుత్వం ఆశించింది. కానీ మీరు ఆ వైఖరిని తప్పుగా అర్థం చేసుకున్నారని గానీ, లేదా గతంలో మాదిరిగానే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను అవే అవాంఛనీయ మార్గాల్లో కొనసాగించడానికి వీలు కల్పిస్తాయనే ఆశతో మీ నిబంధనావళిలో అభ్యంతరకరమైన అంశాలకు ఉద్దేశపూర్వకంగా కట్టుబడి ఉన్నారని గానీ మాకు అనిపిస్తోంది. (1949, 24 మే, గోల్వాల్కర్, ధీరేంద్ర కె. ఝా, పేజీ– 258లో పేర్కొనబడింది) ఒక సహకార సంస్థతో సౌహార్దయుత సంభాషణలో నిమగ్నమైన ప్రభుత్వం మాట్లాడే భాష ఇది ఎంతమాత్రం కాదు. ఇది ఆర్ఎస్ఎస్ ఉద్దేశాలు, పనితీరు పట్ల ప్రగాఢమైన అపనమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.

'వ్యక్తుల సమూహం' వంటి సాంకేతిక పదబంధాలను ఉపయోగించడం ద్వారా పారదర్శకతకు సంబంధించిన సమకాలీన ఆందోళనలను నీరుగార్చేందుకు సైతం ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తుంది. ఇటువంటి పదబంధాలు విషయాలను బహిర్గతం చేయడం కంటే, ఎక్కువ అస్పష్టతను కలిగిస్తాయి. పన్ను చట్టం కింద ఆర్ఎస్ఎస్ ఒక చట్టపరమైన శ్రేణిగా గుర్తించబడగలదా లేదా అనేది ఇక్కడ సమస్య కాదు. ప్రజా వ్యవహారాలపై అపారమైన ప్రభావాన్ని చూపే ఒక సంస్థ, దానితో పోల్చదగిన సంస్థల నుండి ఆశించే స్థాయి పారదర్శకత నుండి మినహాయింపు పొందాలా వద్దా అన్నదే ఇక్కడ అసలు సమస్య.

బ్రిటిష్ పాలనలో కూడా తమ సంస్థ రిజిస్టర్ చేసుకోలేదని ఆర్ఎస్ఎస్, దాని మద్దతుదారులు తరచుగా వాదిస్తుంటారు. ఈ వాదన తప్పుదోవ పట్టించేది. ఎన్నికల, రాజకీయ లక్ష్యాలను అనుసరించే సంస్థలు స్వతంత్ర ఎన్నికల సంఘం పరిధిలో పనిచేయలేదు. ఎందుకంటే స్వాతంత్ర్యానికి ముందు అటువంటి వ్యవస్థ ఉనికిలో లేదు. భారతదేశం ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా మారిన తర్వాతే అసలు ప్రశ్న తలెత్తింది. సరిగ్గా అదే సమయంలో, ఆర్ఎస్ఎస్ వ్యూహాత్మక అస్పష్టతను ప్రదర్శించింది. అది తనను తాను ఒక సాంస్కృతిక సంస్థగా ప్రదర్శించుకుంటూనే, అదే సమయంలో స్పష్టమైన రాజకీయ లక్ష్యాలతో కూడిన ఆశయాలను అనుసరించింది. ఈ ద్వంద్వ స్వభావమే ఆర్ఎస్ఎస్ పథకం మూలంలో ఉంది.

జవాబుదారీతనంపై ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా ఈ సంస్థ తాము సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటుంది. అయినప్పటికీ, దాని సైద్ధాంతిక ప్రభావం రాజకీయ సంస్థలు, ప్రభుత్వ విధానాలు, ఎన్నికల సమీకరణలోకి లోతుగా విస్తరించి ఉంది. అది రాజకీయాలకు దూరంగా ఉన్నామని చెప్పుకుంటుంది, కానీ దాని సభ్యులు మాత్రం ప్రభుత్వంలో ఉన్నత పదవులను అధిష్టించి ఉంటారు. ఈ ద్వంద్వ వైఖరి దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది.

కేవలం ఆర్ఎస్ఎస్ స్వీయ వివరణను మాత్రమే అంగీకరిస్తే, దాని అసలు స్వభావాన్ని అర్థం చేసుకోవడం కష్టం. దాని మూలంలో, అది మెజారిటీ మతాన్ని వక్రీకరించిన, అత్యంత సంకుచితమైన వ్యాఖ్యానాన్ని ముసుగుగా ధరించి, యూనిఫాం ధరించి చేసే కవాతులు, పరేడ్‌గ్రౌండ్ కార్యకలాపాలు, కఠినమైన క్రమశిక్షణ చుట్టూ వ్యవస్థీకరించబడిన ఒక ప్రైవేట్ మిలీషియా. దాని నిర్మాణం, పద్ధతులు నాజీ షుట్జ్‌స్టాఫెల్ (ఎస్ఎస్) వంటి పారామిలిటరీ సంస్థలతో మాత్రమే పోల్చదగినవి.

ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలు సాధారణంగా, రాజకీయ సిద్ధాంతకర్తలు వర్ణించినట్లుగా, చట్టబద్ధమైన బలప్రయోగంపై గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంటాయి. పర్యవసానంగా, అధికారిక సాయుధ కార్యకలాపాల పరిధికి దిగువన పనిచేసే ప్రైవేట్ మిలీషియాలను నియంత్రించడానికి ప్రత్యేకంగా రూపొందించిన చట్టపరమైన యంత్రాంగాలతో అవి సన్నద్ధంగా ఉండవు. ఇది ఒక అస్పష్టతను సృష్టిస్తుంది. దీనిని ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు చారిత్రాత్మకంగా తమకు అనుకూలంగా మలుచుకున్నాయి.



అలాంటి సంస్థ ప్రభుత్వ అధికారానికి నేరుగా దగ్గరైనప్పుడు, దాని పర్యవసానాలు మరింత తీవ్రమవుతాయి. నేడు, ఈ ప్రైవేట్ మిలీషియాకు చెందిన ఒక స్వీయప్రకటిత సభ్యుడు ప్రధానమంత్రి పదవిలో ఉన్నారు. ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, జనబాహుళ్య చర్చలపై ఆర్ఎస్ఎస్ అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. అదే సమయంలో, దానికి విస్తారమైన ఆర్థిక వనరులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ఆ వనరుల పరిమాణం గురించి ప్రజలకు చాలా తక్కువగా తెలుసు.

దీనికి ఒక ఉదాహరణ ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం. దీనిని అనేక కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించినట్లు సమాచారం. అయినప్పటికీ, అపారదర్శకత విషయంలో ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక ప్రాధాన్యతకు అనుగుణంగా, అలాంటి ఆస్తులు తరచుగా ఆర్ఎస్ఎస్ పేరు మీద నేరుగా కాకుండా ఇతర సంస్థలు, అనుబంధ సంస్థల ద్వారా నిర్వహించబడతాయి.

ఈ సంస్థాగత విభజన ఒక రాజకీయ ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది. ఇది జవాబుదారీతనం నుంచి తప్పించుకుంటూనే, ప్రభావాన్ని చూపడానికి ఆర్ఎస్ఎస్‌కు వీలు కల్పిస్తుంది. అర్థవంతమైన ప్రజా పరిశీలన లేకుండా వనరులను పోగేయవచ్చు. అధికారిక దూరాన్ని పాటిస్తూనే కార్యకలాపాలను సమన్వయం చేయవచ్చు. క్లిష్టమైన ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా బాధ్యతనుంచి తప్పించుకోవచ్చు. ఇలాంటి అపారదర్శకత పరిణామాలు కేవలం పరిపాలనాపరమైనవి మాత్రమే కాదు. వాటికి చారిత్రక ప్రాముఖ్యత ఉంది.

పారదర్శకత లేకపోవడం, ప్రజలకు అందుబాటులో ఉండే పత్రాలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా సంస్థాగత అస్పష్టతను పెంచడం వంటివి, ఆధునిక భారత చరిత్రలోని అత్యంత ఘోరమైన హింసాత్మక ఘటనలు, అల్లర్లు, మత సమీకరణల నుండి ఆర్ఎస్ఎస్ పదేపదే తనను తాను దూరంగా ఉంటున్నట్లు చూపేలా వీలు కల్పించాయి. ఈ ఆందోళన కేవలం సమకాలీనమైనది కాదు. గాంధీ హత్య జరిగిన వెంటనే భారత ప్రభుత్వమే దీనిని స్పష్టంగా పేర్కొంది. 1948 ఫిబ్రవరి 4న ఆర్ఎస్ఎస్‌ను చట్టవిరుద్ధమైన సంఘంగా ప్రకటిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనలో, '...సంఘ్ కార్యకలాపాలచే ప్రోత్సహించబడి, ప్రేరేపించబడిన హింసా సంస్కృతి ఎందరో బాధితులను బలిగొంది. ఈ విధంగా బలి అయిన వారిలో చివరిగా, అత్యంత విలువైన వారు గాంధీజీయే' అని నిస్సందేహంగా పేర్కొంది. ఈ చరిత్రను కేవలం ఎంపిక చేసిన స్మృతులు, చట్టపరమైన సాంకేతిక అంశాలతో తుడిచిపెట్టలేము.

*భారత రాజ్యాంగం, దాని లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రం పట్ల ఆర్ఎస్ఎస్‌కు ఉన్న ధిక్కారం ఇవ్వాల్టిది కాదు, యాధృచ్ఛికమైనది కూడా కాదు. అది దాని సైద్ధాంతిక పునాదులలోనే పాతుకుపోయింది. దేశ విభజన, దానితో పాటు చెలరేగిన భారీ స్థాయి మత హింసల తరుణంలో, మత శక్తులు భారతదేశాన్ని ఒక మత రాజ్యంగా, హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని ప్రయత్నించాయి. గణతంత్ర స్థాపకులు ఈ ఒత్తిడిని గట్టిగా ప్రతిఘటించి, అందరికీ సమాన పౌరసత్వాన్ని హామీ ఇచ్చే సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయ మార్గాన్ని ఎరుకతోనే ఎంచుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఒక స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు: ''ఒకవేళ హిందూ రాజ్యం వాస్తవరూపం దాల్చితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అతిపెద్ద విపత్తు అవుతుంది. ఎట్టి పరిస్థితులలోనూ హిందూ రాజ్యాన్ని నిరోధించాలి'' అని ఆయన హెచ్చరించారు. ఈ రాజ్యాంగ ఆదర్శాలతో ఆర్ఎస్ఎస్ ఎన్నడూ సర్దుబాటు చేసుకోలేదు. రాజ్యాంగ విలువలు, జాతీయ పతాకం, గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య స్వభావం పట్ల దాని వ్యతిరేకతను రాజకీయంగా ప్రయోజనకరంగా ఉన్నంతవరకు దాచిపెట్టింది. నేడు, బిజెపి ప్రభుత్వ హయాంలో ఆ చిరకాల సైద్ధాంతిక పథకం.. ప్రభుత్వ విధానం, సంస్థాగత ఆచరణ ద్వారా అంతకంతకూ ఎక్కువగా వ్యక్తమవుతోంది.*

భారత రాజ్యాంగం, దాని లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రం పట్ల ఆర్ఎస్ఎస్‌కు ఉన్న ధిక్కారం ఇవ్వాల్టిది కాదు, యాదృచ్ఛికమైనది కూడా కాదు. అది దాని సైద్ధాంతిక పునాదులలోనే పాతుకుపోయింది. దేశ విభజన, దానితో పాటు చెలరేగిన భారీస్థాయి మత హింసల తరుణంలో, మత శక్తులు భారతదేశాన్ని ఒక మత రాజ్యంగా, హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని ప్రయత్నించాయి. గణతంత్ర స్థాపకులు ఈ ఒత్తిడిని గట్టిగా ప్రతిఘటించి, అందరికీ సమాన పౌరసత్వాన్ని హామీ ఇచ్చే సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయ మార్గాన్ని ఎరుకతోనే ఎంచుకున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఒక స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు: ''ఒకవేళ హిందూ రాజ్యం వాస్తవరూపం దాల్చితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అతిపెద్ద విపత్తు అవుతుంది. ఎట్టి పరిస్థితులలోనూ హిందూ రాజ్యాన్ని నిరోధించాలి'' అని ఆయన హెచ్చరించారు. ఈ రాజ్యాంగ ఆదర్శాలతో ఆర్ఎస్ఎస్ ఎన్నడూ సర్దుబాటు చేసుకోలేదు. రాజ్యాంగ విలువలు, జాతీయ పతాకం, గణతంత్ర లౌకిక ప్రజాస్వామ్య స్వభావం పట్ల దాని వ్యతిరేకతను రాజకీయంగా ప్రయోజనకరంగా ఉన్నంతవరకు దాచిపెట్టింది. నేడు, బిజెపి ప్రభుత్వ హయాంలో ఆ చిరకాల సైద్ధాంతిక పథకం.. ప్రభుత్వ విధానం, సంస్థాగత ఆచరణ ద్వారా అంతకంతకూ ఎక్కువగా వ్యక్తమవుతోంది.

నేడు భారతదేశం ముందు ఉన్న అసలు ప్రశ్న, ఆర్ఎస్ఎస్ తనను తాను వర్ణించుకోవడానికి అనువైన చట్టపరమైన శ్రేణిని కనుగొనగలదా లేదా అనేది కాదు. ఇంతటి అపారమైన సైద్ధాంతిక, రాజకీయ, ఆర్థిక శక్తిని కలిగి ఉన్న ఒక సంస్థ, అర్థవంతమైన పారదర్శకత లేకుండా తన కార్యకలాపాలను కొనసాగించవచ్చునా అన్నదే అసలు ప్రశ్న. రాజకీయ పార్టీలు తమ ఆర్థిక వివరాలను వెల్లడించాల్సి వస్తున్నప్పుడు, స్వచ్ఛంద సంస్థలు, మతపరమైన ట్రస్టులు రికార్డులను నిర్వహించాల్సి వస్తున్నప్పుడు, కంపెనీలు ఆడిట్ చేసిన ఖాతాలను సమర్పించాల్సి వస్తున్నప్పుడు, ప్రభుత్వ సంస్థలు నియంత్రణ పర్యవేక్షణలో పనిచేయాలని ఆశిస్తున్నప్పుడు, అటువంటి ప్రమాణాల నుండి ఆర్ఎస్ఎస్‌కు మినహాయింపు ఇవ్వడానికి ప్రజాస్వామ్యబద్ధమైన సమర్థన ఏదీ లేదు. దేశ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుతామని చెప్పుకునే ఒక సంస్థ, అదే సమయంలో ప్రజల పరిశీలన నుంచి మినహాయింపును కోరకూడదు.

ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం, రాజ్యాంగబద్ధమైన పాలన ప్రయోజనాల దృష్ట్యా, ఆర్ఎస్ఎస్‌ను సరైన చట్టపరమైన పరిధిలోకి తీసుకురావాలి. ఆర్ఎస్ఎస్‌కు, దాని విభజనవాద విధానాలకు, ద్వంద్వ వైఖరికి వ్యతిరేకంగా జరిగే పోరాటం సైద్ధాంతికంగా పటిష్టమైనదిగా, అందరినీ కలుపుకొనిపోయేదిగా ఉండాలి. ఆర్ఎస్ఎస్ ఆర్థిక లావాదేవీలను బహిరంగంగా వెల్లడించాలి. దాని సంస్థాగత నిర్మాణం పారదర్శకంగా ఉండాలి. దాని అనుబంధ సంస్థలు నిశిత పరిశీలనకు లోబడి ఉండాలి. అది ప్రభావితం చేయాలనుకుంటున్న పౌరులకు దాని నిధుల మూలాలు తెలియాలి. ప్రజాస్వామ్యం సంస్థలకు భయపడదు. అది గోప్యతకు భయపడుతుంది. ఆధునిక భారతదేశంలో ఆర్ఎస్ఎస్ వలె రహస్యాన్ని ఒక పాలనా సూత్రంగా పాటిస్తూ నిలకడగా ఎదిగిన సంస్థలు చాలా తక్కువ. దీనికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది.

# విద్యార్థుల ఆగ్రహానికి గురైన ప్రభుత్వానికి మనుగడ ఉండదు

- రూ.7 వేల కోట్ల ఫీజు బకాయిలను చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందా?
- విద్యను సామాజిక బాధ్యతగా కాకుండా వ్యాపారంగా చూస్తున్న ప్రభుత్వాలు
- విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థుల ఆగ్రహానికి గురైన ప్రభుత్వానికి మనుగడ ఉండదని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం ఇకపై కుంటిసాకులు చెప్పకుండా వెంటనే బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య– భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ'పై అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, బిఆర్‌ఎస్ ఎంఎస్‌సిలు ఎస్.మధుసూదనచారి, ఎల్.రమణ, టిజెఎస్ నాయకులు నిజ్జన రమేష్ పాల్గొన్నారు.

### విద్యను వ్యాపారంగా చూస్తున్న ప్రభుత్వాలు

సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ విద్యను ప్రభుత్వాలు సామాజిక బాధ్యతగా కాకుండా వ్యాపారంగా చూస్తున్నాయని నెల్లికంటి సత్యం విమర్శించారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువులు మానేసి సంప్రదాయ వృత్తుల వైపు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన కేటాయింపులు లేకపోవడం, ఇంకా విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.7 వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించలేని పరిస్థితిలో ఉందా అని ఆయన ప్రశ్నించారు. యువత, విద్యార్థుల అసంతృప్తిని ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దని హెచ్చరిస్తూ, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం, గృహ స్థలాల సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులు వంటి అనేక ప్రజా సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వం మిగిలిన పాలనాకాలంలో ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో బిసి సంఘాలు, వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జరుగుతున్న ఉద్యమానికి సిపిఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని, శాసనమండలి సభ్యునిగా ఉద్యమానికి అండగా నిలుస్తానని నెల్లికంటి సత్యం తెలిపారు. బిసి విద్యార్థి సంఘం జాతీయ జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిసి జెఎసి నేతలు గుజ్జ కృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, శ్యామ్ కుర్మా, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ బ్యాంక్ భారతదేశంలో మొదటి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ అని ప్రకటిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఖజానా ఖాళీ అనడం వారి దివాల కోరుతనానికి నిదర్శనమన్నారు.

బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్రానికి మూడు ట్రిలియన్ల ఆదాయం రా వాలంటే మానవ వనరుల అభివృద్ధి జరగాలని, అది జరగాలంటే ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి స్వశక్తితో ఎదగాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను అమ లు చేయాలన్నారు. మధుసూదనచారి, ఎల్.రమ ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని పదేపదే చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి తన మూడు రాష్ట్ర బడ్జెట్‌లలో ఎవరెవరికి ఎంత ఇచ్చా రో, ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం

- హద్దులు మీరితే సామాజిక మాధ్యమమూ ప్రమాదమే
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/భద్రాచలం : మారిన, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీడియాకు స్వయం నియంత్రణ అవసరమని వేగంగా సమాచారాన్ని చేరవేసే క్రమంలో పొరపాట్లకు ఎలాంటి ఆస్కారాన్ని ఇవ్వరాదని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వార్తల్లో వేగం, వ్యక్తిత్వ హననానికి దారితీయ కూడదని ఆయన సూచించారు. సోషల్ మీడియా సమాజంపై ప్రభావం అనే అంశంపై టియుడబ్ల్యుజె, ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అక్షయ ఫంక్షన్ హాల్లో బుధవారం సెమినార్ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మీడియా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, సమాచారం పాఠకునికి అత్యంత వేగంగా చేరే విధంగా ఇంటర్ నెట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. టెలీప్రింటర్, టెలిగ్రాఫ్, ఫాక్స్ స్థాయి నుండి సాంకేతికత క్రమంగా పెరుగుతూ వచ్చిందని తెలిపారు. దీనికితోడు ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తర్వాత సమాచారం నిమిషాల వ్యవధిలో ప్రజలకు చేరుకుందన్నారు. ఆ ఒరవడి నుండి ఇప్పుడు సామాజిక మాధ్యమాలు మరింత వేగంగా సమాచారాన్ని అందిస్తున్నాయన్నారు. ప్రింట్ మీడియాకు సంబంధించి వివిధ స్థాయిల్లో వార్తలను పరిశీలించి ఆతర్వాత తుదిరూపం ఇవ్వడం జరుగుతుందని, ఎలక్ట్రానిక్ మీడియాలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. సామాజిక మాధ్యమంలో ఇది లేకపోవడంతో కొన్ని విపత్కర పరిస్థితులకు దారితీస్తుందన్నారు. వ్యక్తులుగా సామాజిక మాధ్యమాలను నిర్వర్తించడం తమ అభిప్రాయాలను వెల్లడించే క్రమంలో తమ అభిప్రాయాలను అనుమానాలను ఆలోచనలను ఇతరులపై రుద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. అందుకే సామాజిక మాధ్యమాలకు సంబంధించి స్వీయ నియంత్రణ పాటించాలని, ప్రెస్ కౌన్సిల్‌ఆఫ్ ఇండియాలో ప్రస్తుతానికి ఎలక్ట్రానిక్ మీడియా కూడా లేదని ఆయన తెలిపారు. మీడియా సమాజోన్నతి, అభివృద్ధి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. అనంతరం నూతన కమిటీల సన్మాన కార్యక్రమాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సెమినార్‌లో ఐజేయు సెక్రెటరీ జనరల్ సోమసుందర్, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు డా.తెల్లం వెంకట్రావు, యూనియన్ నాయకులు మాటేటి వేణుగోపాల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు బివి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి జునుమాల రమేష్, జిల్లా, డివిజన్, పట్టణ కమిటీల బాధ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## హరీశ్‌రావు కాంగ్రెస్‌లో చేరితే మూడు నెలల మంత్రిత్వంపై సిఎం ఆలోచిస్తారు

కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు తనకు అప్పగించాలని బిఆర్‌ఎస్ నేత టి.హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరితేనే మూడు నెలల మంత్రిత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆలోచిస్తారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జగ్గారెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'పదేళ్లు అధికారంలో ఉండి, మూడేళ్లు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసింది హరీశ్‌రావే. ఇప్పుడు మూడు నెలలు శాఖ ఇవ్వాలని అడగడం పిల్లలాటలా ఉంది' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, ప్రణాళిక, నిర్మాణం అంతా బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, ప్రాజెక్టులో లోపాలకు కూడా అప్పటి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. 'సాధారణంగా పూరిగుడిసె కట్టే వ్యక్తికైనా ఎంత లోతు గొయ్యి తీయాలో తెలుసు. అలాంటిది వేల కోట్ల ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పులను ఇప్పుడు ఇతరులపై నెట్టడం సరి కాదు' అని విమర్శించారు. హరీశ్‌రావుకు నిజంగానే మూడు నెలలు మంత్రిగా పనిచేయాలనే ఆసక్తి ఉంటే ముందుగా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుని పార్టీలో చేరాలని, ఆ తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు. గోదావరి వరద నీటిపై కూడా జగ్గారెడ్డి స్పందిస్తూ, ఖమ్మం మునిగిపోయే పరిస్థితులు తీసుకొచ్చే సూచనలు చేయకుండా ప్రజలకు మేలు జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హరీశ్‌రావుకు సూచించారు. ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయ విమర్శల కోసం అనవసర వ్యాఖ్యలు చేయవద్దని అన్నారు. అలాగే బిఆర్‌ఎస్ నాయకుల విమర్శలకు స్పందిస్తూ, కెసిఆర్ రాజకీయ ప్రస్థానం, టిడిపి నుంచి వచ్చిన నేపథ్యాన్ని గుర్తు చేస్తూ పలు రాజకీయ వ్యాఖ్యలు చేశారు.

## పదేళ్లలోనే సంపన్న రాష్ట్రాలలో తెలంగాణ

ప్రజాపక్షం/హైదరాబాద్: తలసరి ఆదాయంలో 'ఎగువ మధ్యఆదాయ కేటగిరీ' మైలురాయిని సాధించిన భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటిగా నిలిచిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ, కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని కెటిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4.19 లక్షల (5,407 అమెరికన్ డాలర్లు) తలసరి ఆదాయంతో తెలంగాణ రాష్ట్రాన్ని 'ఎగువ మధ్యఆదాయ' ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించిందని, ఇది కెసిఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు విశేష విజయమన్నారు. తెలంగాణ ఆర్థిక పరివర్తనను ప్రపంచ బ్యాంకు కూడా ధృవీకరించడం కేవలం ఒక గణాంక విజయం మాత్రమే కాదని, కెసిఆర్ దార్శనికత, నిబద్ధత, పాలనా నమూనాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని అన్నారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా సుదీర్ఘకాలం పాటు అనుకూలతలు ఉన్న ఇతర రాష్ట్రాల తరహా కాకుండా, దార్శనిక నాయకత్వం, సాహసోపేతమైన సంస్కరణలు, వినూత్న పాలన ద్వారానే తెలంగాణ ఈ మైలురాయిని చేరుకుందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో తమ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీసిన రాష్ట్రంగా చిత్రీకరించడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే మానుకోవాలని కెటిఆర్ హితవు పలికారు.



అమెరికా పర్యటన ముగించుకుని బుధవారం హైదరాబాద్ చేరుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో, నాగోల్ బండ్లగూడ గిరిప్రసాద్ భవన్‌లో పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, నవచేతన విజ్ఞాన సమితి, ప్రజాపక్షం సిబ్బంది

## ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమం ప్రజా కేంద్రిత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రి వివేక్ ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేశారు. పార్టీ నాయకులతో కలిసి అర్జీలను స్వీకరించిన మంత్రి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి అర్జీని ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా, సకాలంలో పరిష్కరించేలా అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు రేషన్ కార్డు కీలకమని చెప్పారు. ప్రతి వారం నిర్వహిస్తున్న 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశముంటుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 120 వినతిపత్రాలు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించిన మంత్రి, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీ.శే. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయ న నివాసంలో వైఎస్ఆర్ చిత్రపటానికి సిఎం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపి రఘువీర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి ఆయన అందించిన సేవలు, ప్రజా సంక్షేమానికి చూపిన మార్గం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వైఎస్ఆర్ ప్రజల కోసం చేసిన సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సిఎం పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రజలకు గొప్ప స్ఫూర్తినిచ్చిన మహానాయకుడని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడం సాధ్యమేనని దేశానికి నిరూపించిన నాయకుడు వైఎస్ఆ ర్ అని, అందుకే ప్రతి రైతు ఆయనను స్మరించుకుంటారని మంత్రి చెప్పారు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని అందించిన ఘనత కూడా ఆయనదేనని కొనియాడారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు కూడా వైఎస్ఆర్ దూరదృష్టికి నిదర్శనమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.

## మంత్రి కొండా సురేఖది అవగాహనా రాహిత్యం

అభివృద్ధి మరిచి వివాదాలతో కాలయాపన : ఎమ్మెల్యే కడియం



ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంత్రి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన కడియం శ్రీహరి, ప్రజా సమస్యలను విస్మరించి అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని విమర్శించారు. బుధవారం హనుమకొండలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ కొంతమంది అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం వివాదాలతో వార్తల్లో ఉండాలని ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పక్కనపెట్టి ఇలాంటి అంశాలపై సమయం వృథా చేయడం బాధాకరమని పేర్కొన్నారు. వరంగల్‌లోని ఎంజిఎం ఆస్పత్రిలో ఇప్పటికీ శాశ్వత సూపరింటెండెంట్ లేకపోవడం, నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడటం వంటి కీలక సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కడియం శ్రీహరి సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టడం పాలకుల బాధ్యత అని అన్నారు. అధికారులను కలవడంపై వచ్చిన విమర్శలను కూడా ఆయన ఖండించారు. "అధికారులు నా దగ్గరకు వస్తే దాన్ని సమీక్ష అంటారు. నేను అధికారుల దగ్గరకు వెళ్తే మాత్రం సమీక్ష కాదంటారు. దీనిపై కనీస అవగాహన కూడా లేదా?" అంటూ ప్రశ్నించారు. తాను అధికారులను కలిసింది ఎలాంటి సమీక్ష నిర్వహించడానికి కాదని, తన నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, సంబంధిత పనులపై చర్చించేందుకేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులను కలవడం తన బాధ్యతేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడకూడదని చెప్పే మంత్రిని నేను మొదటిసారి చూస్తున్నాను" అంటూ కడియం శ్రీహరి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రజల ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, వ్యక్తిగత విమర్శల కంటే అభివృద్ధి అంశాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

## మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

4,070 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు

తల్లిదండ్రులు, సంరక్షకులకు రవాణా శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్: మైనర్లకు (18 ఏళ్ల లోపు) వాహనాలు నడిపేందుకు అనుమతిస్తే తల్లిదండ్రులు, సంరక్షకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రవాణా శాఖ హెచ్చరించింది. మోటారు వాహనాల చట్టం1988 లోని సెక్షన్ 199ఎ (2019 సవరణ) ప్రకారం మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన యజమాని లేదా సంరక్షకుడినే నేరస్తుడిగా పరిగణించి శిక్షిస్తారని తెలిపింది. అదే విధంగా నేరానికి ఉపయోగించిన వాహనం రిజిస్ట్రేషన్‌ను 12 నెలల పాటు రద్దు చేస్తారని, సంబంధిత మైనర్‌కు 25 ఏళ్ల వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో మైనర్లకు వాహనాలు నడిపేందుకు అనుమతించిన కేసుల్లో రాష్ట్రవ్యాప్తంగా 4,070 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు రవాణా శాఖ వెల్లడించింది. నిబంధనల అమలులో ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తోందో ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని పేర్కొంది. పిల్లలతో పాటు రోడ్డు వినియోగదారుల భద్రత దృష్ట్యా మైనర్ల చేతికి వాహనాల తాళాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులు, సంరక్షకులకు రవాణా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ నిబంధనల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా చెకింగ్ అధికారులను నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించినట్లు తెలిపింది.



## ఆర్‌టిసిని నష్టాల నుంచి లాభాల బాట పట్టించిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే

నాగర్‌కర్నూల్‌లో రూ.12 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌కు మంత్రులు జూపల్లి, పొన్నం శంకుస్థాపన



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఆర్‌టిసిని నష్టాల నుంచి లాభాల బాట పట్టించిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని, అభివృద్ధిలో నాగర్‌కర్నూల్ జిల్లా మరో చారిత్రక అడుగు వేసిందని, 365వ బస్టాండ్‌గా నాగర్‌కర్నూల్‌కు ప్రత్యేక గుర్తింపు వస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు అన్నారు. పట్టణంలోని బస్ డిపో సమీపంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం , ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసేలా రూపుదిద్దుకోనున్న నూతన బస్టాండు నిర్మాణ పనులకు, రాష్ట్ర ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్‌సి డా.సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు శంకుస్థాపన చేశారు. ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతోందని ఒకప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్‌టిసి నేడు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ లాభాల బాటలో పరుగులు పెడుతోందని మంత్రి చెప్పారు.నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూ చుకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధిపను లు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళా లక్ష్మి పథకం అమలుతో మహిళలు చేసిన పొదుపు అంతర్జాతీయ స్థాయిలో కూడా చెప్పుకోదగ్గ విజయమన్నారు.అనంతరం నాగర్‌కర్నూల్ నుండి వయా తూడుకుర్తి నుండి వనపర్తికి ప్రయాణించే బస్సును రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలెక్టర్, జెండా ఊపి ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అరుణారెడ్డి, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ సునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మలిదశ ఉద్యమంలో విద్యార్థులదే కీలకపాత్ర

రాజకీయాలకు అతీతంగా

నిజమైన ఉద్యమకారుల గుర్తింపు: కె.కేశవరావు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థులు, మేధావులు కీలక పాత్ర పోషించారని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె.కేశవరావు అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా కమిటీ పారదర్శకంగా తుది నివేదిక రూపొందిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి కార్యాచరణ రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశాలు మూడో రోజుకు చేరుకున్నాయి. సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులు, అధ్యాపక ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. జెఎన్‌టియుహెచ్, తెలంగాణ యూనివర్సిటీ (నిజామాబాద్), మహాత్మా గాంధీ యూనివర్సిటీ (నల్గొండ), పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన మలిదశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ఉద్యమకారులను రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా గుర్తించాలని కోరారు. కేవలం గుర్తింపు కార్డులు జారీ చేయడం కాకుండా, ఉద్యమంలో నష్టపోయిన కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించేలా సమగ్ర సంక్షేమ చర్యలు చేపట్టాలని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కె. కేశవరావు మాట్లాడుతూ వివిధ వర్సిటీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, వాటిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీమత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం
వెంకటాపురం గ్రామం, వలిగొండ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ.
Cell: 9885152595, 9381824284. Email: eo.matsyagiritemple@gmail.com
సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన – మూడవ సారి Date: 08.07.2026
సదరు దేవస్థానములో 2026-27 సంవత్సరమునకు గాను (1 సంవత్సర కాలమునకు) 1. వాహనపూజా సామాగ్రి అమ్ముకోనుహక్కు, 2. వాహనముల టోల్ గేట్ (మేకలబండ వద్ద) వసూలు చేసుకొనుహక్కు, 3. కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు, 4. పూలు, పూలదండలు అమ్ముకొను హక్కు నిమిత్తం తేది: 17.07.2026 రోజున మధ్యాహ్నం 12:00 గం.లకు దేవస్థాన ప్రాంగణంలో సీల్డ్ టెండర్ కం బహిరంగవేలం నిర్వహించడానికి నిర్ణయించడమైనది. పాల్గొనదలచిన వారు టెండర్ షెడ్యులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.
శ్రీస్వామి వారి సేవలో ......
సం/- కార్యనిర్వాహణాధికారి, కే.వెంకటయ్య గ్రేడ్-1,
DIPR R.O. No. : 5735-PP/CL/ADVT/2026-27, Date: 08-07-2026 సెల్: 9885152595

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్.
టెండర్ నోటీసు ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
NIT No. 10/EE/CMC/CIR-48/2026-27 తేది: 07.07.2026
టెండర్ నం. 10/EE/CMC/CIR-48/2026-27, (ఐటమ్ నం. 01), తేదీ: 07.07.2026 ప్రకారం రూ. 48.50 లక్షల అంచనా వ్యయంతో కూడిన (01) పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో బిడ్ల విక్రయం 09.07.2026 ఉదయం 11:30 గంటల నుండి ప్రారంభమవుతుంది. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ: 16.07.2026 ఉదయం 11:30 గంటలు; బిడ్ల సమర్పణ సమయానికి ఒక గంట ముందుగా బిడ్ల విక్రయం ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48,
DIPR R.O. No. : 5761-PP/CL/ADVT/2026-27, Date: 08-07-2026 ఎస్ఎల్‌పి జోన్: సిఎంసి

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బహదూర్‌పురా సర్కిల్-12, రాజేంద్రనగర్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 10/EE-21/RJNRZ/GHMC/2026-27 తేది: 08.07.2026
పని పేరు: 2026 సంవత్సరానికిగాను జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ జోన్, బహదూర్‌పురా సర్కిల్-21లో 03 పనులు, అంచనా విలువ: రూ.16.02 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 08.07.2026 మ.3:00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 13.07.2026 మ.3:00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ టి.వెంకట శేషయ్య, ఇఇ-21, సర్కిల్-21 రాజేంద్రనగర్ జోన్, ఫూల్‌బాగ్, చంద్రాయణగుట్ట, హైదరాబాద్. ఫోన్ నెం. 9492067578. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బహదూర్‌పురా సర్కిల్-21, రాజేంద్రనగర్ జోన్,
DIPR R.O. No. : 5709-PP/CL/ADVT/2026-27, Date: 08-07-2026 జిహెచ్‌ఎంసి.

## శ్రీచేతన్ శౌర్యకు అఖిల భారత ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో స్వర్ణ, రజతాలు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జూన్ 29 నుండి జూలై 7 వరకు బెంగుళూరులో నిర్వహించిన అఖిల భారత సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లాకు చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ఎస్ఎస్ కాన్సెప్ట్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సామల శ్రీచేతన్ శౌర్య అద్భుత ప్రతిభ కనబరిచి అండర్15 బాలుర డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం, బాలుర సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ విజయంతో సెప్టెంబర్ నెలలో చైనాలోని చెంగ్డూ నగరంలో జరగనున్న ఆసియన్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నాడు. ప్రస్తుతం శ్రీచేతన్ శౌర్య ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ బషీర్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. గతంలో శ్రీధర్ కోచ్, రమేష్ కోచ్, తిరుపతి దినేష్ కోచ్‌ల వద్ద శిక్షణ పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.రమేష్ వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రమేష్ కుమార్, కార్యదర్శి డాక్టర్ పి. రమేష్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు శ్రీచేతన్ శౌర్యను ఘనంగా అభినందించారు.

## ప్రజలలో నమ్మకాన్ని కలిగించాలి




సిపి శ్వేత

**ప్రజాపక్షం/జనగామ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని భరోసాని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం వెస్ట్ జోన్ పరిధిలోని స్టేషన్‌ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం సమందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు డీసీపీ రాజమహేంద్ర నాయక్ పూలమొక్కను అందజేశారు. స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించడంతోపాటు, స్టేషన్ పరిధిలో గ్రామాల స్థితిగతులు, నిర్వహణను ఇన్‌స్పెక్టర్ వేణును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్నామని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. రాత్రి సమయాలలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే స్పందించాలని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. కమిషనర్ వెంట వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీంశర్మ, ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్ఐ మనీషా ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, కార్మికులకు పెరుగుతున్న నిత్యవసర సరుకులకు అనుగుణంగా కనీసం 26 వేల వేతనాలు ఇవ్వాలని ఏఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని 100 పడకలఅస్పత్రి ముందు ఏఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖ్యాతరాజు సతీష్ మాట్లాడుతూ, ప్రభుత్వఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కనీసం 26,000 ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులు సంవత్సరం పాటు పనిచేస్తే ఒక నెల వేతనంతో కూడిన బోనస్ ఇవ్వాలని ఆయన కోరారు. ఇంతే కాకుండా పండుగ అర్జిత సెలవులు పి.ఎఫ్ ఈ.ఎస్.ఐ సీనియర్ శానిటేషన్ కార్మికులకు పేషెంట్ కేర్ ప్రమోషన్లు ఇవ్వాలని, కార్మికులకు యూనిఫామ్స్ ఇచ్చి నెల నెల వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ ఇతరత్రా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 9న హైదరాబాద్ కోటిలోని డిఎంఈ కార్యాలయాన్ని ముట్టడించడానికి కార్మికులు వెనుకాడబోరని రాష్ట్ర ప్రభుత్వాన్ని సతీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులు సంపత్, రాకేష్, సురేష్ తో పాటు మిగతా కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్రం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్




**ప్రజాపక్షం/వరంగల్ :** శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వమని ఏఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపురమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని సికెఎం హస్పటల్‌లో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ధర్నా బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు ఆలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్డీఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల క్రింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోదీకి కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం తెలియదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకుబ్, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దడిగెల సంధ్యారాణి, రాష్ట్ర సమితి సభ్యురాలు బిసా లావణ్య, గడల రమేష్, సక్కుబాయి సులోచన ,బిందు, ఎలిషా, పద్మ, స్వప్న, కమలాకర్, శ్రీశైలం, త్రివేణి, కళ్యాణి, వహీద్, మల్లికార్జున్, రవీందర్, దేవి, వి లక్ష్మి , ఎస్ లక్ష్మి , రాము, జ్యోతి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రెసిడెన్షియల్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

నేడు గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండ :** గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఈ నెల 9వ తేదీన (గురువారం) జిల్లా పర్యటన సందర్భంగా హనుమకొండలోని పెద్దమ్మగడ్డలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల కాలేజి ఆఫ్ ఏక్సిలెన్స్ సందర్శించనున్న నేపథ్యంలో కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జాయింట్ కలెక్టర్ కె.రవితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలోని మౌలిక వసతులు, కిచెన్ షెడ్, ప్లే గ్రౌండ్, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను సందర్శించి డిజిటల్ విద్యా విధానంలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారితో ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని కిచెన్, స్టోర్‌రూమును పరిశీలించి, విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యమైన, తాజా కూరగాయలు, ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని అధికారులకు సూచించారు. వంటశాల, నిల్వ గదుల్లో పరిశుభ్రత (హైజీన్) ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు పోషకాహారం, సురక్షితమైన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గవర్నర్ పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సత్వరమే పూర్తి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ నందనూరి పద్మినితో పాటు సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్, ఆర్డీవో వెంకటేష్, ట్రైనీ కలెక్టర్ రోహిత్, జీడబ్ల్యూఎంసీ అధికారులు సీఎంహెచ్ ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్, కళాశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్**

నెలవారీ తనిఖీల్లో భాగంగా హనుమకొండలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్‌ను పరిశీలించిన ఆర్‌డిఓ



**ప్రజాపక్షం/ములుగు:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను ఎన్నికల నమోదు అధికారి, ఆర్డిఓ కృష్ణవేణి బుధవారం పరిశీలించారు. మండలంలోని చల్వాయి, కర్లపల్లి, లక్ష్మీ పురం గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆమె ఎన్యూమరేషన్ ఫారాల సేకరణతో పాటు బిఎల్ఓ యాప్‌లో డిజిటలైజేషన్ పురోగతిని తనిఖీ చేశారు. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించి, బిఎల్ఓ యాప్‌లో త్వరితగతిన నమోదు పూర్తి చేయాలని బిఎల్ఓలకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దారు సృజన్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు నితీష్, ఎన్నికల సిబ్బంది, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత




పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజాపక్షం/దామెర :** పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాబోయే దేశ పౌరులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రైవేటు మోజు వద్దు అని, ప్రభుత్వ పాఠశాలలో చదివించండని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి విద్యా రంగానికి పెద్దపీట వేశారని అన్నారు ప్రైవేటు పాఠశాలల్లో అరకొర చదువులతో చదువు చెపుతున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాల కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగిందని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో విద్యార్థులు ఆరోగ్యంతో పాటు మేధస్సు పెరుగుతున్నదని పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని ప్రైవేటు మోజు వద్దు అని, ప్రభుత్వ పాఠశాలలో చదవించాలని,మీ పిల్లలు కూడా కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారని, తల్లిదండ్రులారా ఒకసారి ఆలోచించాలని,ప్రైవేటు మోజులో పడి వేలు ఖర్చు పెడుతున్నారన్నారు. ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం, ఇప్పుడు అల్పాహారం కూడా అందిస్తుందని విద్యార్థులకు కావలసిన మినరల్స్ విటమిన్స్ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుతుందని తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఎమ్మెల్యే కోరారు.

## ఆధునిక వైద్యంతో గ్రామీణులకు కొత్త భరోసా



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వైద్యులు దైవ సమానులు ప్రాణం పోయే దశలో ఆపద నుండి కాపాడేవాడు దేవుడు. అదే పని చేసే వైద్యుడు కూడా దైవంతో సమానం రోగి నొప్పిని తన నొప్పిగా భావించి, రాత్రింబవళ్లు సేవ చేసే వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది. స్టెతస్కోప్ పట్టిన ప్రతి చేతిలోనూ మానవత్వం ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొత్తూరు అరవింద్‌కు చెందిన అరవింద్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై హాస్పిటల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి లాంటి ప్రాంతంలో సేవా భావంతో వైద్య సేవలు చేయాలని, వైద్యం అంటే వ్యాపారం కాదు. సేవ. డబ్బు కోసం కాదు, ప్రాణం కోసం చేసే వృత్తి. పేదవాడు వచ్చినా, ధనవంతుడు వచ్చినా ఒకేలా చూడాలని సేవ భావంతో పనిచేసే ప్రజల మన్ననలు పొందేలా ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్లు పని చేయాలని సూచించారు. ఇంకా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లిలో ఇలాంటి వైద్య సేవలు మరిన్ని రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, సౌకర్యాలను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/రాయపర్తి :** మహిళా సంఘాలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని కేశపురం, కొలనుపల్లి, కాట్రపల్లి, కిష్టాపురం, మొరిపిరాల, కొత్తూరు, బందనపల్లి, రాయపర్తి గ్రామాల్లో 10లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు ఎంఎల్‌సి శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ సత్యతో కలిసి కొబ్బరికాయలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ యశస్విని రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారానే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం కొత్తూరు గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్, ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సిరికొండ కృష్ణ రెడ్డి, బిల్లా సుధీర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రావు, సమ్మయ్య నాయక్, సర్పంచ్‌లు గుజే సుధాకర్, రాపాక పద్మ, కొండం రంగారెడ్డి, పెద్దగాని నాగరాజు, కందికట్ల స్వప్న, భూక్య అక్రి, గారె సహేంద్ర, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు జాటోత్ హమ్యానాయక్, ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సిరికొండ కృష్ణరెడిడ, బిల్లా సుధీర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రావు, సమ్మయ్య నాయక్, సర్పంచ్‌లు గుజే సుధాకర్, రాపాక పద్మ, కొండం రంగారెడ్డి, పెద్దగాని నాగరాజు, కందికట్ల స్వప్న, భూక్య అక్రి, గారే సహేంద్ర, కొడగాని రమేష్, గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ అభిమాని నిరంజన్ కన్నుమూత




సంతాపం తెలిపిన పవన్ కళ్యాణ్, సోనూసూద్

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** ఎపి డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆత్మీయ వీరాభిమాని హనుమకొండ హనుమాన్‌నగర్‌కు చెందిన పొనుగంటి నిరంజన్ (17) బుధవారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. గత కొంతకాలంగా అరుదైన జన్యు సంబంధిత (న్యూరో మస్క్యులర్) వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో కన్నుమూశారు. నిరంజన్ మృతితో హనుమకొండలోని హనుమాన్ నగర్ తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. నిరంజన్ మృతితో తల్లిదండ్రులు శోక సముద్రంలో మునిగిపోయారు. పలు పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు హనుమాన్‌నగర్‌లోని నిరంజన్ ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. జూన్ 17న జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ నిరంజన్ నివాసానికి స్వయంగా వెళ్లి పరామర్శించిన సంగతి తెలిసిందే. మంచానికే పరిమితమైన నిరంజన్ పక్కన కూర్చుని, అతడిని ఆత్మీయంగా హత్తుకుని పవన్ కళ్యాణ్ ధైర్యం చెప్పారు. అయితే, ఆ తీపి జ్ఞాపకాలు జరిగి రోజులైనా గడవకముందే నిరంజన్ ఈ లోకాన్ని విడిచి వెళ్లడం అటు కుటుంబ సభ్యులను, పవన్ అభిమానులను తీవ్రంగా కలచివేసింది. కాగా నిరంజన్ అంత్యక్రియలను బుధవారం హనుమకొండలో నిర్వహించారు.

**నిరంజన్ మృతి కలచివేసింది: పవన్ కళ్యాణ్**

హనుమకొండకు చెందిన నిరంజన్ మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. కొద్ది రోజుల క్రితం నిరంజన్ ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా తన మదిలో సజీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో పోరాడుతూ తన కోసం ఎదురుచూసిన నిరంజన్ చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు.

**కుటుంబానికి సోనూసూద్ పరామర్శ**

హనుమకొండకు చెందిన నిరంజన్ కుటుంబ సభ్యులతో ప్రముఖ సినీ నటుడు, సామాజిక సేవకుడు సోనూ సూద్ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. నిరంజన్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించిన ఆయన, అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు సోనూసూద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**సిపిఐ నాయకుల నివాళి**

పొనుగోటి నిరంజన్ భౌతిక కాయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ఎ స్టాలిన్, బత్తిని సదానందం, నాయకులు గుంటి రాజేందర్, పూజారి అమృతయ్య, కోడేపాక బాబు, కేతపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/జనగామ :** గ్రామ పంచాయితీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శగ్రామాలుగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గ్రామ పంచాయితి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డీఆర్డీవో భాస్కర్, డీపీవో వెంకట్ రెడ్డి, ఈజేఎస్ పీడీ సూరి, సర్పంచ్‌లు, పంచాయితి కార్యదర్శులు పాల్గొన్నారు.



## మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నెక్కొండ :** ఆగస్టు 4, 5 తేదీల్లో నెక్కొండ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఎఐటియుసి వరంగల్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షుడు పనస ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, కార్మిక హక్కుల పరిరక్షణ, సంఘ బలోపేతమే మహాసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని అన్ని అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ గూంపెల్లి మునీశ్వరుడు, జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి యాకూబ్, కార్యదర్శి గోవర్ధన్ మియాపురం, హమాలీ కార్మిక సంఘం నాయకులు యాట యాకయ్య, రాజు, సుదర్శన్ పాల్గొన్నారు.

## 'సర్' పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలు




సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని, దీనిని బట్టబయలు చేసి బిజెపిని ఎండగట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య తీవ్రంగా విమర్శించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని పెరమండ్ల జగన్నాథ భవనంలో నిర్వహించిన సిపిఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. సాగర్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోమయ్య సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుణగంటి రాజన్న, అలవాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, ఆకుల రాజు, కుంట ఉపేందర్, జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ పాల్గొన్నారు.

## హైలెవల్ వంతెనను ప్రారంభించాలి



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్

**ప్రజాపక్షం/గార్ల :** తొంబై తొమ్మిది శాతం పూర్తి అయిన బుద్ధారం హైలెవల్ వంతెనను వెంటనే ప్రారంభించాలని, ధ్వంసం అయిన బుద్ధారం రోడ్లను వెంటనే పున: నిర్మించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేసారు. బుధవారం బుద్ధారం హైలెవల్ వంతెన పనులను, వంతెన నిర్మాణం వలన ధ్వంసమైన రోడ్లను సిపిఐ మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లడుతూ గత మూడు ఏళ్లుగా నిర్మిస్తున్న బుద్ధారం హైలెవల్ వంతెన తొంబై తొమ్మిది శాతం పూర్తియినప్పటికి అరకొర పనులను బూచిగా చూపి, వంతెనను ప్రారంభించకుండా గుత్తేదారు నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసారు. వంతెన నిర్మాన సమయంలో బుద్ధారం రహదారులు అన్ని పూర్తిగా ధ్వంసం అవడం వలన గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్ల ధ్వంసానికి పూర్తి బాధ్యత వహిస్తు సదరు గుత్తేదారు రోడ్లను పున: నిర్మించాలని డిమాండ్ చేసారు. బుద్ధారం రోడ్లను వెంటనే పున: నిర్మాణం చేయకుండా అలసత్వం వహించినా, మరో పదిరోజులలో వంతెన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో వంతెన వద్ద భారీ నిరసన ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మండల నాయకులు భూక్య హరి,దరావత్ వీరన్న, అన్నం శ్రీనివాసరావు, జి.భీముడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి కుంటల నిర్మాణానికి వంద శాతం రాయితీ: ఏడిఏ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలు నిర్మించుకునేందుకు సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీ కల్పిస్తుందని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని హర్యాతండా, కోయచలక, కోటపాడు పలు గ్రామాల్లో నీటి కుంటల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీటి కుంటలను నిర్మించుకోవడం వల్ల ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పడతాయన్నారు. భూ గర్భ జలాల నీటి మట్టం కూడా పెరుగుతుందని తద్వారా బోర్లు, బావులలో నీటి లభ్యత పెరుగుతుందన్నారు. ఈ నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ పథకం క్రింద వంద శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. వీటిని చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## 10న రైతు ఆశీర్వాద సభ

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 10న చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా తదితరులు మాట్లాడుతూ గత నెల 30న జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల కారణంగా వాయిదాపడిందన్నారు. మధిర నియోజక వర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురంలో వాయిదా పడిన రైతు ఆశీర్వాద సభను ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొంటారని తెలిపారు. ఈ రైతు ఆశీర్వాద సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులు, కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలాజీ నాయక్, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయికుమార్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, తూములూరి లక్ష్మి నర్సింహారావు, కిలారు అనిల్‌కుమార్, కొట్టే రాజశేఖర్, శ్రీనివాస్ యాదవ్, ఫరీద్ ఖాద్రి, కిరణ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు గ్రామ ప్రభుత్వ చౌక ధరల దుకాణంలో తూనికలు, కొలతల అధికారులు వినియోగదారులకు అందుతున్న తూనికలపై బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికారిని శ్రీలత ఆధ్వర్యంలో చేపట్టారు. రెండు కాంటాలను ఏర్పాటు చేయడంతో పాటు తూకంలో కిలోకు పైగా తేడా రావడాన్ని గమనించారు. చట్టబద్ధ ప్రమాణాలకు అనుగుణంగా లేవని నిర్ధారించి వివరాలు సేకరించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం తూనికలు, కొలతల చట్టం ప్రకారం కేసునమోదు చేశారు. విచారణ అనంతరం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనతో అన్ని రేషన్ దుకాణాల్లో తూనీకల వ్యవహారంపై అధికారులు మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

విశ్రాంత ఉద్యోగి బేదంశెట్టి శ్రీనివాస్



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** తాను చివరగా పనిచేసి రిటైర్డ్ అయిన మహాదేవపురం ఉన్నత పాఠశాల చిన్నారులకు నోట్ బుక్స్, పెన్నులు, మిఠాయిలు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాధు సమాధానం, గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావుల చేతుల మీదుగా విశ్రాంత ఉద్యోగి బేదంశెట్టి శ్రీనివాస్(బాబా) ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం సాధు సమాధానం మాట్లాడుతూ పదవీవిరమణ పొంది తన స్వగ్రామం ఒంగోలు వెళ్లినప్పటికీ మహాదేవపురం చిన్నారులపై ఉన్న అభిమానంతో వారికి నోట్ బుక్స్ పెన్నులు అందించడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అనంతరం ధాత బేదంశెట్టి శ్రీనివాస్, పాఠశాల వి ద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువతరం అంతా సేవాభావాన్ని కలిగి ఉండాలని, స్వార్థాన్ని వీడి మదర్ థె రిస్సా, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల అడుగుజాడల్లో నడుస్తూ సేవా భావంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేదంశెట్టి శ్రీనివాస్ కుమారులు, బేదంశెట్టి సాయికృష్ణ, వినీత్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూసేకరణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ములకలపల్లి:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ పనులను కలెక్టర్ అంకిత్ బుధవారం ములకలపల్లి గ్రామంలో పరిశీలించారు. భూసేకరణ సర్వేలో జ్యాపం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 160 ఎకరాల్లో ఇప్పటి వరకు 22 ఎకరాల సర్వే పూర్తయిందని అధికారులు వివరించగా, మిగిలిన సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. భూ యజమానుల వివరాలు, బోర్లు, సాగులో ఉన్న పంటలు, ఆయిల్ పామ్ తోటలు, ఇతర శాశ్వత ఆస్తులను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ స్వాతి బిందు, ఇరిగేషన్, సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతు మేళాకు సర్వం సిద్ధం

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన, ప్రదర్శన

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

పనులు పరిశీలించిన కలెక్టర్ దివాకర టిఎస్





**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని మండలం జగన్నాథపురం (మత్కేపల్లి) క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు మేళాకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రదర్శనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి జగన్నాథపురంలోని కార్యక్రమ ప్రాంగణాన్ని కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. రైతు మేళా స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజన శాలలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రజల రాకపోకల మార్గాలు, తాగు నీటి సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, విద్యుత్, సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు విజ్ఞానం, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఒకే వేదికపై పరిచయం చేయాలనే లక్ష్యంతో రైతు మేళాను నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖ, పాల ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునీక సాగు విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కేవలం ప్రదర్శనలు మాత్రమే కాకుండా ఆధునీక వ్యవసాయ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ, విలువ ఆధారిత వ్యవసాయంపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై కొత్త సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. 10న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు రైతులు, ప్రజలు లక్షలాదిగా హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని పోలీస్ శాఖాధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాలు, అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అగ్నిమాపక బృందాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేసేలా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి సభకు వచ్చే వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ట్రాఫిక్ రూట్ మ్యాపులను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిరంతర అధ్యయనం, ప్రజాపోరాటంతోనే ప్రత్యామ్నాయం

పెరుగుతున్న ప్రైవేటీకరణ ప్రమాదం

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరతర అధ్యయనం, అలుపెరగని ప్రజా పోరాటాలతోనే ప్రత్యామ్నాయం సాధ్యమవుతుందని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భద్రాచలంలో జరుగుతున్న సిపిఐ రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం ఆయన 'సిపిఐ ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిగమించే మార్గాలు' అనే అంశాన్ని బోధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి తరం కమ్యూనిస్టు నాయకులు కమ్యూనిజాన్ని అధ్యయనం చేసి దేశ పరిస్థితులకు అన్వయించారని ఆయన తెలిపారు. పాలనలో వస్తున్న మార్పులు తగ్గిన ప్రజా సంబంధాలు ప్రజల ఆలోచనా విధానంతో కమ్యూనిస్టు పార్టీలు కొత్త సవాళ్లను ఎదుర్కుంటున్నాయన్నారు. సరళీకరణ ప్రైవేటీకరణ ప్రపంచీకరణ తర్వాత ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. అది క్రమేపీ ఇప్పుడు హక్కుల హననానికి సంఘాల నిషేదానికి దారితీస్తుందన్నారు. ఇదే సమయంలో దేశ సంపద కొందరి చేతుల్లోనే పోగుపడుతోందని ఆయన తెలిపారు. బిజెపి అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రైవేటీ కరిస్తోందని, భవిష్యత్‌లో ప్రభుత్వ రంగం లేకపోతే ఉద్యోగ ఉపాధి కల్పనా రంగాలకు రిజర్వేషన్లకు పెనుముంపు రానుందని ఆయన చెప్పారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడం ద్వారా ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించవచ్చని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో 'భారతీయ చరిత్ర, సంసృ్కతి– ఆర్ఎస్ఎస్ వక్రీకరణ' అనే అంశాన్ని డి. సోమసుందర్, పార్టీ కార్యక్రమం అనే అంశాన్ని యుగల్ రాయలు, మతం మతోన్మాదం, కేంద్ర ప్రభుత్వం మతోన్మాద ఎజెండా అనే అంశాన్ని ఎస్ వేణుగోపాల్ బోధించారు. ఈ శిక్షణా తరగతులకు జమ్ముల జితేందర్ రెడ్డి ప్రిన్సిపాల్, కల్లూరి వెంకటేశ్వర్లు వైస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి?

సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం నగరంలోని దానవాయిగూడెంకు చెందిన విశ్రాంత ఉద్యోగి బలుసు బాబూరావు(68) నగరంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందడం తీవ్ర విషాదానికి దారి తీసింది. గాల్‌బ్లాడర్‌లో రాళ్ల సమస్యతో చికిత్స కోసం మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన బాబూరావు, శస్త్రచికిత్సకు ముందు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రోగికి అవసరానికి మించిన మోతాదులో మత్తుమందు ఇవ్వడం వల్లే పరిస్థితి విషమించి గుండెపోటు వచ్చిందని, శస్త్రచికిత్స ప్రారంభం కాకముందే ఆయన ఆరోగ్యం అదుపు తప్పిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున చేరుకొని నిరసన తెలిపారు. రహదారిపై బైఠాయించి ఆందోళనకు ప్రయత్నించగా సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. వైద్యంలో నిర్లక్ష్యం జరిగిందని భావిస్తే లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని, చట్టపరంగా పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తామని పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సూచించారు.

## వైఎస్ఆర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వైఎస్ఆర్ స్ఫూర్తితో తాము ప్రజలకు సేవ చేస్తున్నామని, ఆయన చూపిన బాటలో నడవటం తమకు గర్వంగా ఉందన్నారు. వైఎస్ఆర్ సబ్బండ వర్గాల పక్షపాతి అని అన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి సందర్భంగా బుధవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజల జీవితాల్లో విశేష మార్పును తీసుకొచ్చాయని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి వైఎస్ఆర్ చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు ముత్తారెడ్డి, కొత్తూరు ఉప సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ చంద్రకళ

**ప్రజాపక్షం/వైరా:** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని, వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళను కళాశాల ప్రిన్సిపాల్ నవీనజ్యోతి కోరడంతో బుధవారం కళాశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శిథిలావస్థల్లో ఉన్న భవనాన్ని పరిశీలించి, దీనివలన విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించడానికి కృషి చేస్తానని తెలిపారు. కళాశాలలో గ్రంథాలయం కొరత, కళాశాలలో స్వీపర్, స్కావెంజరు లేకపోవడం వలన కలుగుతున్న ఇబ్బందులను మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి కళాశాల ప్రిన్సిపాల్ తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ము ఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.నవీనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి నేత గోరంట్లను కలిసిన తుమ్మల



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజమండ్రిలో టిడిపి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేసిన రోజుల జ్ఞాపకాలను ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. అనంతరం బుచ్చయ్య చౌదరి మంత్రి తుమ్మలను శాలువాతో సన్మానించారు. మంత్రి రాక సందర్భంగా అక్కడికి చేరుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలతో తుమ్మల ఆత్మీయంగా ముచ్చటించారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

10న విద్యా సంస్థల బంద్

వామపక్ష విద్యార్థి సంఘాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 10న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం ఖమ్మం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను, కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల మీద ఉన్న ప్రేమ ప్రభుత్వ విద్యా సంస్థల మీద లేదన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఎవరికి వారు ఇష్టానుసారంగా వారికి నచ్చినవిధంగా ఫీజులను నిర్ణయించి విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రైవేటు పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చారని స్టేషనరీ, యూనిఫాం, టై, షూ సైతం తమ పాఠశాలలోనే కొనాలని విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారంతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని కోరుతూ 10న జరిగే విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఓవర్‌మ్యాన్ గ్రేడ్-బి ప్రమోషన్లు ఇవ్వాలి

సత్తుపల్లి జిఎంకు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేడర్ స్కీమ్ ప్రకారం అర్హత సాధించిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు (ఒఎంహెచ్) వెంటనే ఓవర్‌మ్యాన్ గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎఐటియుసి సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రాల సుధాకర్ మాట్లాడుతూ 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్లు కేడర్ స్కీమ్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసి ప్రమోషన్‌కు అర్హులైనప్పటికీ, ఓవర్‌మ్యాన్ ఖాళీలు లేవు అనే కారణంతో వారి ప్రమోషన్లను నిలిపివేశారని తెలిపారు. అయితే ప్రమోషన్లు ఇవ్వకుండా వారితోనే ఓవర్‌మ్యాన్ విధులు నిర్వహింపజేయడం వల్ల సంస్థలో ఉన్న వాస్తవ ఖాళీలు బయటపడడం లేదని, దీనివల్ల అర్హులైన ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు దాదాపు మూడు సంవత్సరాలుగా ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేడర్ స్కీమ్ ఉద్దేశ్యానికి విరుద్ధంగా కొనసాగుతున్న ఈ విధానాన్ని వెంటనే సవరించి, అర్హులైన అందరికీ ఓవర్‌మ్యాన్ గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. అలాగే అప్పటి వరకు సీనియర్ మైనింగ్ సర్దార్లతో ఓవర్‌మ్యాన్ విధులు నిర్వహింపజేయకుండా, వారి హోదాకు సంబంధించిన విధులనే అప్పగించాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఉన్న ఓవర్‌మ్యాన్ ఖాళీలను కూడా తక్షణమే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించకపోతే 22వ తేదీ తొలి షిఫ్ట్ నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్లు కంపెనీ జారీ చేసిన ఆఫీస్ ఆర్డర్ ప్రకారం తమ హోదాకు సంబంధించిన మైనింగ్ సర్దార్ విధులు మాత్రమే నిర్వహిస్తారని ఎఐటియుసి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి. సూర్యప్రకాశ్, ఆర్. భరణి, ఎల్. సుశీల్ కుమార్, టి.ఉపేంద్ర చారి, చి. సత్యప్రకాశ్, ఎస్. రాజ్‌కుమార్, ఎస్. రవీందర్, ఉపేంద్ర, అప్పసర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఫారాల సేకరణ వంద శాతం జరగాలి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, పంపిణీ చేసిన ఫారాలు ఓటరుచే పూరించి తిరిగి బిఎల్ఒకు ఇవ్వడం వంద శాతం జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు వివరాలు ఓటరుచే పూర్తి చేసిన తర్వాత తిరిగి బిఎల్‌ఒకు అప్పగించడం కీలకమన్నారు. ఓటరు వివరాలతో పూర్తి చేసిన ఫారాలు బిఎల్ఒ తీసుకున్న తర్వాత అట్టి ఫారాలు డిజిటలైజేషన్ చేస్తారని, వారి పేర్లు మాత్రమే ఓటరు డ్రాఫ్ట్ రోల్‌లో వస్తాయన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందించాలన్నారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.07 శాతం పూర్తయిందని కేవలం 3,744 మంది ఓటర్లకు సంబంధించి అందుబాటులో లేకపోవడం, వివరాలు లభ్యం కాకపోవడంతో పంపిణీ కాలేదన్నారు. ఇప్పటి వరకు 31.57 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటరుచే వివరాలు పూరించిన తర్వాత తీసుకోవడం జరిగిందని డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు క్రియాశీలకంగా ఉండి వివరాల సేకరణలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగ డిటి అన్సారీ, సూపరింటెండెంట్ ఎంఎ రాజు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ క్షేత్రాన్ని పరిశీలించిన ఎఇఒ శశిధర్



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో బుధవారం ఎఇఒశశిధర్ ఆయిల్ పామ్ పంట క్షేత్రాన్ని సందర్శించారు. మైదంబండ గ్రామానికి చెందిన రైతు బియ్యని లింగం తన రెండెకరాల భూమిలో గత నాలుగేళ్లుగా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఈ పంట ప్రస్తుతం మొదటి కోతకు సిద్ధమవడంతో, బుధవారం తొలిసారిగా ఆయిల్ పామ్ గెలలను తెంపడం జరిగింది.ఈ సందర్భంగా ఎఇఒశశిధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్ టన్ను ధర రూ. 23,000 పలుకుతోందని, దీనివల్ల రైతుకు మంచి లాభసాటిగా ఉంటుందని తెలిపారు.

**జీలుగు సాగు పరిశీలన :** అనంతరం ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన రైతులు వరి పొలంలో సాగు చేసిన జీలుగు పంటను ఎఇఒ శశిధర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జీలుగు విత్తనాలు చల్లిన 45 రోజుల తర్వాత ఆ పైరును పొలంలోనే కలియదున్నాలని (మడక కొట్టాలని) సూచించారు.పచ్చిరొట్టె పైర్లుగా జీలుగు,జనుము,పిల్లిపెసర సాగు చేయడం వల్ల భూసారం పెరిగి,పంటలకు ఎంతో మేలైన సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని ఆయన రైతులకు వివరించారు.

## ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం చోరీ



**ప్రజాపక్షం / గంగాధర :** గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. మధురానగర్ గ్రామానికి చెందిన బోడ్ల శ్రీనివాస్ వృత్తిరీత్యా ఎస్‌జిటి ఉపాధ్యాయుడు. పిల్లల విద్య కోసం నెల రోజుల క్రితం కుటుంబంతో కలిసి కరీంనగర్‌కు మకాం మారారు. మధురానగర్‌లోని తన ఇంటి మొదటి అంతస్తును విజయ్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. అయితే బుధవారం ఉదయం 5:59 గంటలకు అద్దెదారు విజయ్ శ్రీనివాస్ కు ఫోన్ చేసి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఇంటికి చేరుకున్న శ్రీనివాస్ ప్రధాన ద్వారం తాళాలు, ఇంట్లోని అల్మారాల తాళాలు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. దుండగులు అల్మారాలో ఉంచిన సుమారు 2 గ్రాముల బంగారు ఉంగరాలను అపహరించారు. అంతేకాకుండా అద్దెవారు విజయ్‌కు చెందిన పల్సర్ బైక్ టిఎస్ 02 ఎఫ్ 1298 బండి కూడా ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ బృందం సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐతెలిపారు. చుట్టుపక్కల సిసిటీవి పుటేజీలను పరిశీలిస్తున్నామని దొంగలను త్వరలోనే పట్టుకుంటామని అన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరం

**ప్రజాపక్షం/జమ్మికుంట :** పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, చైర్మన్ జి.మల్లిఖార్జున్ స్వామిలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా జమ్మికుంట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించ దం ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని తెలిపారు. కౌన్సిలర్ మాచర్ల రాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇల్ల ందుల రమేశ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ కార్యాల య సిబ్బంది, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఎల్ఆర్‌పిలు, ఆర్‌పిలు పాల్గొన్నా రు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: డిఎస్‌పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్య సాధనపై దృష్టి సారించాలని సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి సూచించారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సిరిసిల్ల డిఎస్‌పి నాగేంద్రచారి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, నకిలీ వెబ్‌సైట్లను నమ్మవద్దని సూచించారు.ఒటిపి, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్లు ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్లకు మోక్షం



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వేములవాడ పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. పట్టణంలోని పలు వార్డుల్లో గుంతల మయం గా మారిన రహదారులపై బుధవారం మొరం వేసే పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పట్టణ ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గుంతల కారణంగా ప్రమాదాలు జరగకుండా రహదారులను ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'సర్'

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్





**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు .బుధవారం జగిత్యాల పట్టణంలోని 37 వార్డులోబిఎల్ఒలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగాబిఎల్ఒలు ఓటర్లకు ఫారాల పంపిణీ,వివరాల నమోదు,అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు.ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డిఓ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్,బి.ఎల్.వో లు,పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డును సందర్శించిన జిల్లా కలెక్టర్ పారిశుధ్య నిర్వహణ, డ్రై డే కార్యక్రమాలు,యాంటీ లార్వా చర్యలు, ఫీవర్ సర్వేలు,దోమల నివారణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూజిల్లాలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తిగా అదుపులోకి తీసుకురావాలంటే ప్రతి ఇంటిని పరిశీలించడం అత్యంత అవసరమన్నారు.ఇళ్లలో పాత టైర్లు,కూలర్లు,పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు,నీరు నిల్వ ఉండే పాత్రలు వంటి వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి రోజు డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని,ఫీవర్ సర్వేలను నిరంతరం కొనసాగిస్తూ జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే పరీక్షలకు పంపించాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులనే నివేదికలుగా సమర్పించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు .ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని, "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం – సీజనల్ వ్యాధులను దూరం చేద్దాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు, మైకింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.అలాగే వీధి ఆహార విక్రేతల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రి తగినంత అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్,డిప్యూటీ డిఎమ్&హెచ్ఒ శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి,తదితరులు ఉన్నారు.

## వైఎస్ఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ పరిపాలన

### డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో సంక్షేమ పరిపాలన కొనసాగుందని, రాజశేఖర్ రెడ్డి చూపిన పోరాటపటిమను ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అందిపుచ్చుకోవాలని డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం హాజరై, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య తదితరులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి అతి చిన్న వయసులో శాసనసభకు ఎన్నికై మంత్రిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఈ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎన్నో సేవలు చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి,ఎండి తాజ్, మడుపు మోహన్, కర్ర సత్య ప్రసన్న, బానోతు శ్రావన్ నాయక్, వెన్న రాజమల్లయ్య, సిరాజ్ హుస్సేన్, సురేందర్ రెడ్డి ముదుగంటి,గంట శ్రీనివాస కళ్యాణి, కాంతాల జగన్ రెడ్డి,చర్ల పద్మ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,వంగల విద్యాసాగర్, దిండిగాల మధు,మాదాసు శ్రీనివాస్, కుంభాల రాజు కుమార్,కల్వల రామ్ చందర్,షబానా మహమ్మద్, పోరండ్ల రమేష్,గడప శ్రీనివాస్, మంద మహేష్, శిల్ప, స్వప్నశ్రీ, అందే శంకర్, తోట అంజయ్య, భారీ, మూల కృష్ణారెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, మాలోతు మహాలక్ష్మి, హైమద్, మహమ్మద్ చాంద్, గన్ను మహేందర్ రెడ్డి, హనీఫ్, జొన్నల రమేష్, ముక్క భాస్కర్, సత్తినేని శ్రీకాంత్, విక్టర్, శారద, కట్టెకోల ప్రభాకర్, జ్యోతి రెడ్డి, కాంపల్లి కీర్తి కుమార్, పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆశయ సాధనకు పాటుపడాలి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వేములవాడ ప్రాంతంతో ఎంతో చక్కటి అనుబంధం ఉందన్నారు. నాడు ఆయన చేపట్టిన ప్రజా పథం కార్యక్రమంలో భాగంగా మల్యాల గ్రామంలో 1,737 కోట్లతో ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ హయాంలోనే వరద కాల్వ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగాయని, ఎండీడీ నుండి వేములవాడకు సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కూడా వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయని, మల్లీ కలికోట సూరమ్మ చెరువు, మర్రిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేశామని స్పష్టం చేశారు.

## భూ సేకరణ పనులు వేగవంతం

### పనుల ప్రగతిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) భూ సేకరణ కమిషనర్ కే. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనుల పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్, మానేరు రివర్‌ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనుల పురోగతిపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసిత రైతులు, ప్రజలకు నిబంధనల ప్రకారం తక్షణమే పరిహారం అందించడంతో పాటు పునరావాస చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఎక్కడా జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించి భూ సేకరణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఎలాంటి జాప్యం జరగకుండా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించి, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ, భూ సేకరణ విభాగం ఇన్‌చార్జి ఎస్.డి.సి. స్వామి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ రావు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా పెండింగ్ భూసేకరణ పూర్తి



### ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్ నాయడు సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో రాష్ట్ర ఆర్అండ్ఆర్ కమిషనర్ జిల్లా కలెక్టర్ హైమావతితో కలసి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లాలో భూసేకరణ,ఆర్అండ్ఆర్ పెండింగ్ సమస్యల గురించి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈసందర్భంగా ఆర్ అండ్ కమిషనర్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా జిల్లాలో చేర్యాల, కొమురవెల్లి, కొండపాక, మద్దూరు, దుళ్మిట్ట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు అవసరమైన పెండి ంగ్‌లో ఉన్న భూమిని, గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్‌లో ఉన్నకాల్వల నిర్మాణ భూసేకరణ అధికార యంత్రాంగం త్వరగా చర్యలు తీసుకోవాలని సూ చించారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, సిద్దిపేట,గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇరిగేషన్,రెవెన్యూ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

### గురుకులాల్లో 'మెనూ' ప్రకారం

### భోజనాన్ని అందించాలి: కలెక్టర్

జిల్లాలోని అన్ని గురుకులాల విద్యాలయాల్లో విద్యార్థులకు డైట్ మెనూ పాటిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు.బుధవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామ శివారులో తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలను కలెక్టర్ అకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు ప్రకారం కూరగాయలు వంట సరుకులు కొలత ప్రకారం తీసుకోవాలని భోజన ప్రక్రియను ప్రిన్స్‌పల్ లేదా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.



## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పూర్తి పారదర్శకత

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.బుధవారం ఎన్‌టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రామగుండం నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత విధానంలో ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీలుగా విభజించిందన్నారు.ఇంటి స్థలం ఉండి ఇందిరమ్మ గృహానికి అర్హులైన వారు ఎల్1 జాబితాలో ఉంటారని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సిఫారసు చేసిన ఎల్1 దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా గెజిటెడ్ అధికారులు పరిశీలిస్తారని, అర్హత నిర్ధారణ అనంతరం మున్సిపల్ కమిషనర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు చేరుతాయని తెలిపారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎల్1 జాబితాలోని 449 మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అయితే వారిలో కేవలం 184 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారని తెలిపారు.ధర్మారం ప్రాంతంలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతుండగా, రామగుండం ప్రాంతంలో పురోగతి ఆ శించిన స్థాయిలో లేదన్నారు. మంజూరైన లబ్ధిదారులం తా వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు.నిబంధనల ప్రకారం ఇల్లు మంజూరైన 45 రోజులలోపు నిర్మాణం ప్రారంభించకపోతే మంజూరును రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా విడుదల అవుతున్నాయని, లబ్ధిదారులు నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే దానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.ఇటీవల ప్రజాప్రతినిధుల ద్వారా అందిన 1,312 మంది లబ్ధిదారుల జాబితాలో విచారణ అనంతరం 607 మంది ఎల్1 కేటగిరీలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, హౌసింగ్ పిడి రాజేశ్వర్, తహసీల్దార్ రవీందర్ రావు, కార్పొరేటర్లు,స్థానిక ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై మంత్రి శ్రీధర్ బాబుకు వినతి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటీ,పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి దుండె రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి సంబంధించిన పలు దీర్ఘకాలిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.మచ్చుపెట గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను వివరిస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ మంత్రి శ్రీధర్ బాబుకి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని,ఈ సమస్యలను త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# వర్ష 'బీభత్సం'

- మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్‌లో పోటెత్తిన వరదలు
- పుణెలో కుప్పకూలిన మూడు అంతస్తుల భవనం

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్‌లలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ముంబయిలో గత వారంరోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరదల పోటెత్తాయి. అయితే మధ్యలో ఒక రోజు తెరిపి ఇచ్చినప్పటికీ బుధవారం ఉదయం మళ్లీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. దీంతో లోకల్ రైలు సర్వీసులకు ఆలస్యం కాగా, ఆఫీసులకు వెళ్లే ప్రయాణికులకు అసౌకర్యం కలిగింది. పొరుగున ఉన్న పాల్ఘర్ జిల్లాలోని వసాయి–విరార్ సెక్షన్‌లో, దక్షిణ గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో గుజరాత్ వైపు వెళ్లే దూరప్రాంత రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా పుణె జిల్లాలోని పింప్రిచించ్‌వాడ్‌లో భారీ చెత్త కుప్ప ఒక మూడు అంతస్తుల భవనంపై పడింది. దీంతో ఆ భవనం కూలిపోవడంతో 16 మంది చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నట్లు ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ ఘటన మోషీ ప్రాంతంలో జరిగింది. స్థానిక పురపాలక సంఘం తరపున అక్కడ చెత్తను శుద్ధి చేసే ఒక ప్రైవేట్ సంస్థ, పరిపాలనా కార్యాలయంగా ఆ భవనం ఉపయోగించబడుతోందని ఆయన చెప్పారు. ఈ పరిపాలనా భవనం పర్వతంలా పేరుకుపోయిన పాత చెత్త కుప్ప పక్కనే ఉందని, ప్రాథమికంగా చూస్తే, భారీ వర్షాల కారణంగా చెత్త కుప్ప అస్థిరంగా మారి భవనంపై కూలిపోయినట్లు కనిపిస్తోందని, పింప్రి–చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్ సూర్యవంశీ పేర్కొన్నారు. ఆ ప్రైవేట్ సంస్థకు చెందిన సుమారు 16 మంది ఉద్యోగులు భవనం లోపల ఉండి ఉంటారని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నాయని, ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, ముంబయికి తాగునీటిని సరఫరా చేసే ఏడు జలాశయాలలో ఒకటైన తులసి సరస్సు, దాని పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా అర్ధరాత్రి పూట పొంగిపొర్లడం ప్రారంభించిందని, సమీపంలోని విహార్ సరస్సు పొంగిపొర్లిన కొన్ని గంటల తర్వాత ఇది జరిగిందని పౌర అధికారులు తెలిపారు. పగటిపూట నగరం, శివారు ప్రాంతాలలో అడపాదడపా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ప్రకారం బుధవారం ఉదయం 8 గంటలకు ముగిసిన 48 గంటల వ్యవధిలో ఐలాండ్ సిటీలో సగటున 61.13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా, తూర్పు, పశ్చిమ శివారు ప్రాంతాలలో వరుసగా 86.66 మిల్లీమీటర్లు , 86.90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.





## ఢిల్లీలో పలు ప్రాంతాలు జలమయం

బుధవారం ఢిల్లీలో కురిసిన భారీ వర్షం కారణంగా ఢిల్లీ నగరంలోని పలు ప్రాంతాలు జలమయమై, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అయేత ఉరుములతో కూడిన వర్షాలు, మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ భారత వాతావరణ శాఖ రెడ్, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నగరంలోని ప్రధాన వాతావరణ కేంద్రమైన సఫ్దర్‌జంగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 25.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉదయం 8.30 గంటలకు ముగిసిన గత 24 గంటల్లో ఇక్కడ 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఉదయం కురిసిన వర్షాలకు సదర్ బజార్, నాసిర్‌పూర్, గ్రేటర్ కైలాష్, బదర్‌పూర్, టెలివారా, మహావీర్ బజార్, స్వరూప్ నగర్, కుషక్ రోడ్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల పాదచారులు మోకాళ్ల లోతు నీటిలో నడుస్తూ కనిపించారు. ఢిల్లీలోని రోహిణిలో బుధవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల ఇల్లు కూలిపోవడంతో పలువురు శిథిలాల కింద చిక్కుకున్నారు. పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఇతర అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకోగా, స్థానికులు కూడా గాలింపు, సహాయక చర్యలలో పాల్గొన్నారు. ఈ క్రమంలో శిథిలాల నుంచి ఇద్దరిని బయటకు తీశారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలోనే, రోహిణి సెక్టార్ 16లోని ఒక ఎంసిడి పాఠశాల సమీపంలో సాయంత్రం 4.20 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. అయితే, ఈ ఘటనకు వాతావరణం కూడా ఒక కారణమా అనే విషయాన్ని అధికారులు ఇంకా ధృవీకరించలేదు. సహాయక చర్యల కోసం అగ్నిమాపక శాఖ నాలుగు సహాయక బృందాలను పంపింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు.

## సూరత్‌లో వరదలకు 9 మంది మృతి

గుజరాత్‌లోని సూరత్‌లో గత రెండు రోజులుగా రుతుపవన సంబంధిత సంఘటనలలో తొమ్మిది మంది మరణించారు. భారీ వర్షాల కారణంగా నగరమంతటా పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. సూరత్, తాపి, నర్మదా, ఛోటా ఉదయ్‌పూర్, దాహోద్, అమ్రేలి, భావనగర్‌లోని అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు చురుకుగా ఉండడం కనిపించింది. ఉదయం 6 గంటల నుండి 10 గంటల మధ్య 59 తాలూకాలలో వర్షపాతం నమోదైంది. ఇందులో వల్సాద్ జిల్లాలోని కప్రాడాలో అత్యధికంగా 1.26 అంగుళాలు, ఆ తర్వాత నానాపోంధాలో 1.14 అంగుళాల వర్షపాతం నమోదైంది. కాగా, గుజరాత్ వ్యాప్తంగా 195 తాలూకాలలో వర్షపాతం నమోదు కాగా, ఆరు తాలూకాలలో 10 అంగుళాలకు పైగా వర్షం కురిసింది. ఈ భారీ వర్షాలకు సూరత్ జిల్లా కేంద్ర బిందువుగా మారింది. పల్సానాలో ఏకంగా 18 అంగుళాల వర్షపాతం నమోదు కాగా, ఆ తర్వాతి స్థానంలో కామ్రేజ్‌లో 17 అంగుళాలు నమోదైంది. నవసారిలో 15 అంగుళాలు, సూరత్ నగరంలో 14 అంగుళాలు, కప్రాడాలో 13 అంగుళాలు, జలాల్‌పూర్‌లో 11 అంగుళాల వర్షపాతం నమోదైంది. ఈ అసాధారణ వర్షపాతం తీవ్రతను ఇది స్పష్టం చేస్తోంది.

## పరీక్షల్లో స్కామ్‌లు జరుగుతున్నా...
# నిమ్మకు నీరెత్తినట్లుగా కేంద్రం తీరు

### లక్షలాది విద్యార్థుల కఠోర శ్రమను ఏ మాత్రం లెక్కచయేడం లేదు : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** యుజిసి–నెట్ పరీక్షలోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వరుసగా 'స్కామ్‌లు' జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, లక్షలాది మంది విద్యార్థుల ఏళ్ల తరబడి కఠోర శ్రమను ఆ ప్రభుత్వం ఏమాత్రం విలువ కట్టడం లేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుండి ఎలాంటి జవాబుదారీతనం లేదా ఏదైనా చర్యను ఆశించడం వ్యర్థమని దేశం మొత్తానికి తెలుసని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో విద్యార్థి నాయకులు ఎన్‌టిఎ నిర్వహించిన యుజిసి నెట్ జూన్ 2024 పరీక్షకు సంబంధించి తీవ్రమైన ఆరోపణలు చేశారని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'గత వారం జరిగిన యుజిసి నెట్ పరీక్షకు సంబంధించి వెలుగులోకి వచ్చిన తీవ్రమైన ఆరోపణలు అత్యంత దిగ్భ్రాంతికరమైనవి. నీట్ పేపర్ లీక్ అయిన కొద్ది వారాలకే, యుజిసి నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పిడిఎఫ్ సర్క్యులేట్ అయిందనే వార్తలు ఇప్పుడు వస్తున్నాయి. ఈ పిడిఎఫ్ ప్రశ్నపత్రం రూపకల్పనకు సంబంధించినది. ఇది కేవలం ఎన్‌టిఎ వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుంది. అందులో దాదాపు 90 ప్రశ్నలు అసలైన సోషియాలజీ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలుతున్నాయి' అని ఆయన చెప్పారు. బిహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్‌లలో ఈ ప్రశ్నపత్రం రూ. 2.25 లక్షలకు విక్రయించబడిందని, సిఎస్‌ఐఆర్ నెట్, హెచ్ నెట్, ఎడిఎ వంటి రానున్న పరీక్షలకు కూడా ప్రశ్నపత్రాలను అందించగలమని అదే నెట్‌వర్క్ పేర్కొందని గాంధీ ఆరోపించారు. నీట్, నెట్ పరీక్షలలో వరుసగా స్కామ్‌లు జరుగుతున్నప్పటికీ, మోదీ ప్రభుత్వం కళ్లు మూసుకుని నిశ్చింతగా నిద్రపోతోందని మండిపడ్డారు. ఎందుకంటే, రాత్రింబవళ్లు కష్టపడి చదివే లక్షలాది మంది విద్యార్థుల ఏళ్ల తరబడి శ్రమ వారికి ఏమాత్రం విలువ లేనిదిగా ఉందన్నారు. జాతీయ స్థాయి ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షలను నిర్వహించే ఎన్‌టిఎ నుండి ఈ ఆరోపణలపై తక్షణ స్పందన రాలేదు. ఎలాంటి విచారణ జరగదని, విద్యార్థులకు న్యాయం జరగదని రాహుల్‌గాంధీ అన్నారు. మార్పు కోసం ఉన్న ఏకైక సాధనం మన సామూహిక గళం దేశవ్యాప్తంగా వినిపించే 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం), ఇది భారతదేశంలో విద్యా విప్లవాన్ని తీసుకువస్తుంది అని అన్నారు.

## మరింత క్షీణించిన
# వాంగ్‌చుక్ ఆరోగ్యం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం బుధవారం మరింత క్షీణించింది. ఆయన దీక్ష 11వ రోజుకు చేరగా, సోనమ్ బరువు 7 కిలోలకు పైగా తగ్గినట్లు వైద్యులు తెలిపారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ప్రభుత్వ జవాబుదారీతనం కోరుతూ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) చేపట్టిన నిరసన కార్యక్రమం 19వ రోజుకు చేరుకుంది. కాగా, బుధవారం ఉదయం విడుదలైన ఆరోగ్య బులెటిన్ ప్రకారం వాంగ్‌చుక్ బరువు 59.40 కిలోలకు పడిపోయింది. దీంతో నిరాహార దీక్ష ప్రారంభమైనప్పటి నుండి ఆయన మొత్తం 7 కిలోలకు పైగా బరువు తగ్గినట్లయింది. రక్తపోటు కూర్చున్నప్పుడు 103/68 ఎంఎం హెచ్‌జిగానూ, పడుకున్నప్పుడు 111/73 ఎంఎం హెచ్‌జి గానూ నమోదైంది. ఆయన గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 74 సార్లుగా నమోదైంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయి 75 ఎంజి/ డిఎల్, ఆక్సిజన్ స్థాయి 98 శాతంగా ఉన్నాయి. సోనమ్ శరీరంలో నీటి శాతం సరిగానే ఉందని, మానసికంగా చురుకుగా ఉన్నారని బులెటిన్ పేర్కొంది. పదేపదే జరుగుతున్న పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు విద్యార్థులు, వారి కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేశాయని ఆరోపిస్తూ సిజెపి మంత్రి ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తోంది. అదే విధంగా సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు అనుబంధంగా ఉన్న 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్' (ఐసా) సభ్యులు నేహా, మనీష్, హృషికేష్, దీపక్ కుమార్ వర్మ, అమీన్ నిరసన స్థలంలోని మరో వేదికపై తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు.

## రామమందిర విరాళాల కేసు...
# ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లా

- 'సిట్' ప్రాథమిక నివేదికలో గుర్తింపు
- 40 రోజుల్లో 70 సార్లు నగదు అపహరణ ఘటనలు



**అయోధ్య :** ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామమందిరంలో భక్తులు సమర్పించిన కానుకల చోరీకి సంబంధించిన కేసులో అవినాష్ శుక్లాను ప్రధాన నిందితుడిగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన ప్రాథమిక నివేదిక ద్వారా గుర్తించిందని బుధవారం వర్గాలు తెలిపాయి. దాదాపు 40 రోజుల పాటు ఒక ముఠా కార్యాకలాపాలు సాగించిందని, దాదాపు 70 సార్లు జరిగిన నగదు అపహరణ ఘటనలతో శుక్లాకు సంబంధం ఉందని సిట్ దర్యాప్తు తేలినట్లు వర్గాలు వెల్లడించాయి. చోరీ కేసులో ఏర్పాటైన సిట్ మధ్యంతర నివేదిక సమర్పించగా, సోమవారం 'శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' సమావేశంలో ఆ నివేదికపై చర్చించినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం, ఆలయంలో భక్తుల నగదు కానుకలను లెక్కించే పనిలో ఉన్న శుక్లాపై అత్యంత బలమైన సాక్ష్యాధారాలు లభించడంతో అతన్ని నిందితుల్లో నంబర్ 1గా పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం శుక్లా చుట్టూనే తిరుగుతోందని నివేదిక పేర్కొంది. దీనివల్ల దర్యాప్తు అధికారులు మరో ఐదుగురు నిందితులను గుర్తించారు.

జూన్ 23న ఉత్తరప్రదేశ్ అదనపు ప్రధాన కార్యదర్శి (హోం) సంజయ్ ప్రసాద్‌కు సమర్పించిన తొమ్మిది పేజీల నివేదికలో 30 ఏళ్ల శుక్లానే ఈ దర్యాప్తులో కీలక వ్యక్తిగా పేర్కొన్నారని వర్గాలు తెలిపాయి. సుమారు 40 రోజుల వ్యవధిలో ఆలయ లెక్కింపు గది నుండి జరిగినట్లు భావిస్తున్న దాదాపు 70 చోరీ ఘటనలను సిట్ ప్రాథమికంగా గుర్తించిందని వారు తెలిపారు. సిసిటివి కెమెరా ఫుటేజీని పదేపదే పరిశీలించగా, నగదు లెక్కింపు సమయంలో శుక్లా అనేక సందర్భాల్లో విరాళాల నగదు కట్టలను, విడి నోట్లను బయటకు తీసి దాచిపెట్టడం కనిపించినట్లు ప్రాథమిక నివేదిక ద్వారా తెలిసింది. డబ్బు కదలికలను గుర్తించడానికి, ఇతర వ్యక్తుల పాత్రలను నిర్ధారించడానికి దర్యాప్తు అధికారులు ఈ ఫుటేజీపైనే ఎక్కువగా ఆధారపడ్డారని సమాచారం. శుక్లాకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాలను సిసిటివి ఫుటేజీ, రికవరీ రికార్డులు, బ్యాంక్ ఖాతాల విశ్లేషణ, సాక్షుల వాంగ్మూలాలు ధృవీకరించాయని నివేదిక పేర్కొంది. దీనివల్ల ప్రాథమికంగా నేరంలో ప్రమేయం ఉన్నట్లు తేలిన ఆరుగురు నిందితులలో శుక్లానే మొదటి నిందితుడుగా నిలిచాడు. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేష్ పాండేలు విరాళాల డబ్బును దాచడంలో, బయటకు తీయడంలో శుక్లాకు సహాయపడటం కూడా ఫుటేజీలో కనిపించిందని, అలాగే మనీష్ కుమార్ యాదవ్ లెక్కింపు గదిలో అతనికి సమన్వయకర్తగా వ్యవహరించారని వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు పరిశీలించిన అంశాల ఆధారంగా, ఆరుగురు నిందితుల ప్రమేయం ప్రాథమికంగా నిర్ధారితమైందని సిట్ నిర్ధారణకు వచ్చిందని వర్గాలు పేర్కొన్నాయి. ఈ దర్యాప్తు సీసీటీవీ ఫుటేజీకి మించి విస్తరించింది. అయోధ్య పోలీసులు నిర్వహించిన సోదాల్లో, శుక్లా వద్ద నుంచి రూ. 20.39 లక్షల నగదు, 1,121 డాలర్లు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు, ఒక ఎస్‌యువిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన నిందితులలో నుంచి ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి అని నివేదిక పేర్కొంది. శుక్లాకు తెలిసిన ఆదాయానికి మించి నగదు డిపాజిట్లు, బ్యాంకు లావాదేవీలు జరిగినట్లు కూడా దర్యాప్తు అధికారులు గుర్తించారు. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాలను లెక్కించడానికి నియమించిన సిబ్బంది, కోతల తర్వాత నెలకు రూ. 15,000కు పైగా జీతం తీసుకుంటారని, అయితే అరెస్టుకు ముందు శుక్లా బ్యాంకింగ్ కార్యకలాపాలు అతనికి తెలిసిన ఆదాయం కంటే ఎక్కువగా ఉన్నాయని నివేదిక పేర్కొంది.

### ఒక రోజు కస్టడీకి ముగ్గురు నిందితులు

ఇదిలా ఉండగా, విరాళాల చోరీ ఆరోపణల కేసులో జైలులో ఉన్న ముగ్గురు నిందితులను, తదుపరి విచారణ నిమిత్తం స్థానిక కోర్టు 24 గంటల పాటు పోలీసు కస్టడీకి అనుమతించింది. దీంతో వారిని పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. దర్యాప్తు అధికారి, సర్కిల్ ఆఫీసర్ (అయోధ్య) అశుతోష్ తివారీ బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో జిల్లా జైలు నుండి అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, కరుణేష్ పాండేలను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత వారిని విచారణ కోసం తీసుకెళ్లారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం ప్రత్యేక కోర్టు (అవినీతి నిరోధక) జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ పోలీసు కస్టడీ రిమాండ్ ప్రారంభమైంది. కాగా, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అడ్మినిస్ట్రేటర్, ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానిత సభ్యుని పదవుల నుండి తొలగించబడిన గోపాల్ నాగరగట్టె అలియాస్ గోపాల్ రావు, బుధవారం ఆలయ ప్రాంగణంలోని తన నివాసాన్ని ఖాళీ చేసి కర్సేవక్ పురానికి మారారని ఆలయ వర్గాలు తెలిపాయి.

# చంపత్‌రాయ్‌ని తక్షణమే అరెస్టు చేయాలి

### ట్రస్ట్ సభ్యుల ఎంపికలో జరిగిన తప్పునకు మోదీ బాధ్యత వహించాలి: కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామాలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ట్రస్ట్ సభ్యుల ఎంపికలో జరిగిన తప్పుకు ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరింది. రామమందిరానికి సంబంధించిన ఘనతను తమ ఖాతాలో వేసుకోవడంలో ముందున్న ప్రధాని, ఇప్పుడు విరాళాల చోరీ బాధ్యతను స్వీకరించడానికి ఎందుకు వెనుకాడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. 'ట్రస్ట్‌ను రద్దు చేయండి; అసలైన దోషులను అరెస్టు చేయండి; సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపండి; కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయండి; దేశానికి క్షమాపణ చెప్పండి. మోదీ జీ, మీ మౌనాన్ని వీడండి. అదే కాంగ్రెస్ డిమాండ్' అని రమేశ్ ఎక్స్ వేదికగా హిందీ పోస్ట్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి శక్తిసిన్హ్ గోహిల్ మాట్లాడుతూ, ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను తక్షణమే రద్దు చేసి, దాని స్థానంలో కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలి. ఈ కొత్త ట్రస్ట్ కూర్పును శంకరాచార్యులు, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, నిర్మోహి అఖారా ప్రతినిధులు, వివిధ మత పెద్దలు, సాధువుల సమక్షంలో సామూహికంగా నిర్ణయించాలి' అని గోహిల్ అన్నారు. సాధువులు, మత పెద్దలకు బదులుగా చంపత్ రాయ్ వంటి వ్యక్తులను ట్రస్ట్‌లో చేర్చిన తప్పుకు గాను మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. 'రామమందిర విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రాకముందు రోజువారీ వసూళ్లు రూ. 1618 లక్షలుగా ఉండేవి; అయితే ఈ విషయం బహిర్గతమైన తర్వాత ఆ మొత్తం రోజుకు రూ. 2426 లక్షలకు పెరిగింది' అని ఆయన పేర్కొన్నారు. దీనిని బట్టి అంతకుముందు రోజుకు సుమారు రూ. 10 లక్షలు చోరీ అయ్యాయనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రామమందిరం కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి ప్రతీక అని, దానికి సంబంధించిన ఏ విధమైన ఆర్థిక అక్రమాలను కూడా సహించలేమని ఆయన నొక్కి చెప్పారు.

## ఇండోనేసియన్ అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి ...
# ప్రంబనన్ ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ

- ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ, పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రారంభం
- 'శతాబ్దాల చిరకాల నాగరికత బంధాలకు ఇది ఒక అద్భుత నిదర్శనం' అని మోదీ అభివర్ణన



**యోగ్యకార్తా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ఇండోనేసియన్ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి యోగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించారు.ఈ యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం కోసం చేపట్టిన ఉమ్మడి పరిరక్షణ ప్రాజెక్టను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇద్దరు నాయకులు ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించడం భారత్–ఇండోనేసియాల మధ్య సాంస్కృతిక సంబంధాలను కూడా బలోపేతం చేస్తున్నది. భారత్ సహాయంతో ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ఇరుదేశాలు ఉద్దేశ్య పత్రాన్ని (లెటర్ ఆఫ్ ఇంటెంట్) మార్చుకున్న ఒక రోజు అనంతరం ఈ పర్యటన జరిగింది. 2028 నాటి భారత్–ఇండోనేసియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం చట్రం కింద వాణిజ్యం, భద్రత, అరుదైన ఖనిజాల వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లను కూడా కలుపుకుని సాగే తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం జకార్తాలో అడుగుపెట్టగా ఆయనకు రెడ్‌కార్పెట్ స్వాగతం లభించింది. మంగళవారం జకార్తాలో జరిగిన సంయుక్త పత్రికా సమావేశంలో మోదీ తన ప్రసంగంలో 'ఈ చొరవను భారత్, ఇండోనేసియా దేశాల ప్రజలను శతాబ్దాలుగా అనుసంధానిస్తున్న ఉమ్మడి వారసత్వంలో వేళ్లూనుకున్న చిరకాల నాగరికతా బంధాలకు ఒక అద్భుతమైన నిదర్శనం' అని మోదీ అభివర్ణించారు. వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్రను కలిగిఉన్న పురాతనమైన ప్రంబనన్ ఆలయం, ఇండోనేసియా, అమెరికా దేశాల ఉమ్మడి సాంస్కృతిక వారసత్వానికి కాలాతీత చిహ్నంగా నిలుస్తుందని కూడా అన్నారు. '9వ శతాబ్దంలో నిర్మించబడిన ప్రంబనన్ ఆలయ సముదాయం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, శివుడు లకు అంకితం చేయబడిన ఇండోనేసియాలోని అతి పెద్ద ఆలయ సముదాయం, ఈ ఆలయ సముదాయం భారత్–ఇండోనేసియా మధ్య ఉన్న ఉమ్మడి నాగరిక, సాంస్కృతిక వారసత్వానికి శాశ్వత చిహ్నంగా నిలుస్తుంది' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత పక్షం తరపున ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్‌ఐ) ప్రధాన సంస్థగా వ్యవహరించనున్న ఈ సంయుక్త పరిరక్షణ ప్రాజెక్ట్, యోగ్యకార్తాలోని ప్రతిష్ఠాత్మక ఆలయ సముదాయాన్ని ప్రధాని మోదీ, ఇండోనేసియా ప్రెసిడెంట్ ప్రబోవోలు సందర్శించడం వంటివి, తమ భాగస్వాములతో ద్వైపాక్షిక సంబంధాలను పెంచుకోవడంలో సాంస్కృతిక దౌత్యానికి న్యూఢిల్లీ ఇస్తున్న ప్రాధాన్యతను కూడా ప్రతిబింబిస్తున్నాయి. ప్రంబన్ ఆలయ సముదాయానికి చేరుకున్న ప్రధానమంత్రి మోదీకి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీ ఇండోనేసియా అధ్యక్షుడితో కలిసి ఆ పురాతన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సముదాయంలోని ప్రధాన శిఖరాల నేపథ్యంలో ఉండగా, ఇద్దరు నాయకులూ కరచాలనం చేసుకుని ఫోటో కోసం నిలబడినప్పుడు వారి మధ్య ఆత్మీయత స్పష్టంగా కనిపించింది. 'ప్రెసిడెంట్ ప్రబోవో, నేను ఇరువురం కలిసి ఇండోనేసియా ప్రపంచ వారసత్వ ప్రంబనన్ ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ, పరిరక్షణ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాం' అని ప్రధాని మోదీ తన సందర్శన అనంతరం 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. 'స్నేహితుడు, అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి ఈ ప్రదేశాన్ని సందర్శించడం నాకు ప్రత్యేక సందర్భం అయ్యిందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## ఇస్లాంలోకి మారిన వారికి 'కోటా' ప్రయోజనాలను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పుపై...
# 'సుప్రీం'ను ఆశ్రయించిన తమిళనాడు ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** కేవలం మత మార్పిడి ప్రాతిపదికన మాత్రమే 'ఇస్లాం' స్వీకరించిన వ్యక్తి వెనక బడిన తరగతుల (ముస్లిం) విభాగం కింద రిజర్వేషన్ పొందేందుకు అర్హుడు కాదని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2024 మార్చి 9న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వును రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఈ అప్పీల్‌ను దాఖలు చేశారు. వివాదాస్పదమైన జీవో, వెనకబడిన తరగతులు (బిసి), అత్యంత వెనకబడిన తరగతులు (ఎంబిసి, డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డిఎన్‌సి), లేదా షెడ్యూల్డ్ కులాల(ఎస్‌సి)కు చెందిన వ్యక్తులు తదనంతరం ఇస్లాం మతంలోకి మారినప్పటికీ వారిని బిసి(ముస్లిం)లుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు ఏడు నోటిఫైడ్ ముస్లిం కమ్యూనిటీలలో ఒక దాని కింద కమ్యూనిటీ సర్టిఫికెట్లు పొందేందుకు అనుమతించింది. న్యాయమూర్తులు జస్టిస్ జిఆర్.స్వామినాథన్, జస్టిస్ పిబి.బాలాజీ ద్విసభ్య ధర్మాసనం జీవోను కొట్టివేస్తూ, అది సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు రెండింటి యొక్క కట్టుబడి ఉండాల్సిన న్యాయపరమైన పూర్వ తీర్పులకు విరుద్ధం అని అభిప్రాయపడింది.మతం మారిన వ్యక్తిని కేవలం ముస్లింగా మాత్రమే పరిగణించవచ్చని, కేవలం మతం మారినంత మాత్రాన రిజర్వేషన్ ప్రయోజనాల కోసం ఏదైనా నిర్దిష్టంగా ప్రకటించబడిన వెనకబడిన ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తిగా వర్గీకరించలేమని హైకోర్టు పేర్కొంది. 2015లో హిందూ మతం నుండి ముస్లిం మతానికి మారిన సమీర్ అహ్మద్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ తీర్పు వెలువడింది.ఈ మత మార్పిడిని 2016లో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెలియజేశారు. అతను తదనంతరం ఇస్లామిక్ ఆచారాల ప్రకారం వివాహం చేసుకుని, రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు తాను 'ముస్లిం లెబ్బై' వర్గానికి చెందినవాడినని ధృవీకరణపత్రం పొందాడు. తహసీల్దార్ అతని దరఖాస్తును తిరస్కరించడంతో సమీర్ అహ్మద్ హైకోర్టును ఆశ్రయించాడు.


केनरा बैंक Canara Bank - Syndicate
**సూర్యాపేట, ఎం.జి. రోడ్ శాఖ**
హోటల్ బాలాజి గ్రాండ్ సందు ఎదుట, సూర్యాపేట, ఎం.జి.రోడ్, సూర్యాపేట జిల్లా-508213

**ఇ-వేలం అమ్మకం ప్రకటన**

వేలం జరిగే తేదీ & సమయం: 24-07-2026 ఉ॥ 11.30 గం.ల నుంచి మ. 12.30 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి దానికి 5 నిముషాల వంతున నిరవధిక పొడిగింపుతో) ఇఎండి జమ చేయుటకు గల ఆఖరి తేదీ: 23-07-2026 సా. 5.00 గం.లు

స్థిరాస్తుల అమ్మకానికి ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8(6)లోని అంశాలుతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడింది. దిగువ వివరించిన స్థిరాస్తి అనగా రుణదాతకు తనఖా చేసిన/ ఛార్జిచేసిన దానిని సూర్యాపేట, ఎం.జి.రోడ్ శాఖ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/ భౌతిక స్వాధీనం చేసుకోబడిందనీ, కెనరా బ్యాంకు సూర్యాపేట, ఎం.జి.రోడ్ శాఖకు బకాయియున్న బకాయి మొత్తం రూ. 9,71,904.42 (రూపాయలు తొమ్మిది లక్షల డెబ్బై ఒక్కవేల తొమ్మిది వందల నాలుగు మరియు పైసలు నలభై రెండు మాత్రమే (తేది. 17-12-2025 వరకు గల ఒప్పందం బకాయిలు)లను వసూలు చేయుటకు సదరు స్వాధీనం చేసుకొన్న స్థిరాస్తిని **"ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే"** మరియు **"యాదాస్థితి"** ప్రాతిపదికన తేది. 24-07-2026న అమ్మబడునట్లుగా తెలుపుతూ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

**రుణగ్రస్తుడు/లు పేరు మరియు చిరునామా: శ్రీ సిదార్థ వీర్లాల,** తండ్రి: రాములు, ఇంటి నెం. 3-10-64, రాజీవ్‌నగర్, సూర్యాపేట-508213 (సహ-హామీదారుడు) సుగునమ్మ వీర్లాల, భర్త: చినరాములు, ఇ.నెం. 3-10-64, రాజీవ్‌నగర్, సూర్యాపేట-508213, **గ్యారంటీదారుడు: శ్రీరాములు చెరుకు,** తండ్రి: రోశయ్య, ఇ.నెం. 2-7-74 సీతరాంపురం, సూర్యాపేట-506213 ఆస్తి వివరణ మరియు పూర్తి వివరాలు: ఆస్తి మొత్తం ఇ.నెం. 3-10-64, విస్తీర్ణం 82 చ.గ.లు మరియు ఆర్‌సిసి, ఉన్నచోటు: హరిజనవాడ, రాజీవ్‌నగర్ బర్లపెంట బజార్, సూర్యాపేట పట్టణం మరియు మండలం, సూర్యాపేట జిల్లా, జిల్లా రిజిస్ట్రార్, నల్గొండ మరియు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-15, సూర్యాపేట పరిధిక్రింద, **దీని హద్దులు క్రింది విధంగా: ఉత్తరం:** రాములు కనకయ్య గృహం, **దక్షిణం:** దారి, **తూర్పు:** 8' అ.ల రోడ్, **పడమర:** వీర్లాల రాములు గృహం.

**రిజర్వు ధర: రూ. 4,27,000/– ఎర్నెస్టు మనీ డిపాజిట్ (EMD): రూ. 42,700/–**

బ్యాంకుకు తెల్సీ ఎలాంటి ఎన్‌కంబరెన్స్‌లు లేవు. వేల ఆన్‌లైన్ పోర్టల్: https://banknet.com ద్వారా జరుగును. రిజర్వు ధరలోని 10 శాతం ఇఎండి మొత్తాన్ని మెసర్స్ పిఎస్‌బి అలయెన్స్ ప్రయివేటు (BAANKNET) పోర్టల్‌కు నేరుగా లేదా ఇఎండిని అందులో చలానాద్వారా అనగా సదరు చలానాలో వివరించిన అకౌంటు వివరాలు ప్రకారం ద్వారా NEFT/RTGS ద్వారా జమ చేయవలెను. బిడ్డింగ్ ప్రోసెస్ మాన్యువల్, పాటదారుని రిజిస్ట్రేషన్ మరియు ఇ.ఎం.డి. చెల్లింపులకు ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌సైటు: https://banknet.com/ సంప్రదించండి: 8291220220, ఇమెయిల్: supportbanknet@psballiance.com లలో చూడగలరు. అమ్మకం విపులీకరించిన నియమ నిబంధనలను కెనరాబ్యాంక్ వారి వెబ్‌సైటు (www.canarabank.com) లో ఏర్పాటుచేసిన "ఇ-వేలం" లింకును చూడగలరు. లేదా **బ్రాంచి మేనేజర్, కెనరాబ్యాంకు, సూర్యాపేట, ఎం.జి.రోడ్ శాఖ, ఫోన్ నెం. 7901618271** వారిని ఆఫీసు పనివేళల్లో ఏ పనిరోజులోనైనా సంప్రదించవలెను.

**తేది: 17-06-2026, స్థలం: సూర్యాపేట.** **సం/– అధీకృత అధికారి**

# దాడులతో అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘన తీవ్రపరిణామాలకు అమెరికాదే పూర్తి బాధ్యత

ఇరాన్ హెచ్చరిక




**టెహ్రాన్:** యుద్ధం ముగించేందుకు తాత్కాలిక ఒప్పందం చేసుకున్న అమెరికా నిబంధనలు ఉల్లంఘించి బుధవారం తెల్లవారుజామున తమ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి తీర ప్రాంత నిఘే కేంద్రాలపై దాడులు చేసిందని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ మండిపడింది. ఈ ఉద్రిక్తతల పెరుగుదలవల్ల కలిగే ప్రమాదకరమైన పరిణామాలకు అమెరికా పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరిక చేసింది. శత్రువుకు గల్ఫ్ ప్రాంతంలో ఎవరు సహకరించినా తీవ్రంగా నష్టపోతారని కూడా హెచ్చరిక చేసింది. ఇరాన్‌పై దురాక్రమణ నేరాలకు పాల్పడేందుకు శత్రువుకు ఎలాంటి సహకారం అందించినాగానీ అది నేరంలో భాగం పంచుకున్నట్లేనని స్పష్టం చేసింది. అదేవిధంగా ప్రాంతీయస్థాయిలో, అంతర్జాతీయస్థాయిలో ఐక్యరాజ్యసమితి శాంతి సాధనకు తన బాధ్యతలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేసింది. దాడులు చేయడం ద్వారా అమెరికా ఐక్యరాజ్యసమితి చట్టాలలోని ఆర్టికల్2(4)ను స్పష్టంగా ఉల్లంఘించిందని, దీనికిగాను తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది.కేవలం ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌ను మాత్రమే కాకుండా ఇస్లామాబాద్ ఒప్పందం (ఎంఓయు)లో మొట్టమొదట రాసుకున్న నిబంధనను కూడా అమెరికా ఉల్లంఘించిందని పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ చమురు అమ్మకాలకు అనుమతులు కూడా రద్దు చేయాలన్న నిర్ణయం కూడా ఎంఓయుకు వ్యతిరేకమేనని విమర్శించింది. అంతే కాకుండా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల ఉల్లంఘనలు,ఉగ్రవాద చర్యలు కూడా ఈ ఎంఓయులోని కీలక ప్రాథమిక క్రియాశీల నిబంధనలకు విరుద్ధమని మొత్తంగా చూస్తే అమెరికా ఎలాంటి కట్టుబాట్లు లేకుండా ఒప్పందాన్ని అగౌరవించిందని పేర్కొంది. ఈ ఒప్పందానికి విలువలేకుండా చేసిందని పేర్కొంది.

# ఆపరేషన్ హార్డ్ బాల్: 24 మంది అరెస్టు

## నిజ్జర్ హత్యకేసులో బిష్ణోయ్,గోల్డీబ్రార్‌లపై అమెరికా అభియోగాలు



**వాషింగ్టన్:** భారత్‌ను కేంద్రంగా చేసుకుని అంతర్జాతీయస్థాయిలో మాదక ద్రవ్యాల రవాణా, రాజకీయహత్యలు, నేరాలు చేస్తున్న ముఠాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో 24 మందిని అంతర్జాతీయ చట్టాల అమలు ఆపరేషన్ విభాగం అరెస్టు చేసింది. ఈ కేసులో అమెరికాకు సంబంధించి కాలిఫోర్నియాలో 11 మంది, ఇండియానాలో ఒకరు,జార్జియాలో ఒకరిని అరెస్టు చేశారు. అమెరికా ప్రాసిక్యూటర్లు ఈ విష యం చెప్పారు. ఫెడరల్ అభియోగపత్రాన్ని వా రు బహిర్గతం చేశారు. దీని ప్రకారం కెనడాలో హత్యకు గురైన హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను హత్యచేయమని భారతదేశ జైలులో ఉంటూ బిష్ణోయ్ ఆ దేవించాడు. అతని సహాయకుడు గోల్డీబ్రార్ దా నిని ఆచరించాడు. ఈ కేసులో బిష్ణోయ్, గోల్డీబ్రార్ ఇద్దరిపైనా కూడా అమెరికా ఫెడరల్ అధికారులు అభియోగాలు మోపారని ప్రాసిక్యూట ర్లు చెప్పారు. భారతదేశంలోని జైళ్ళల్లో ఉంటూ నే బిష్ణోయ్ ముఠా అంతర్జాతీయస్థాయిలో కా ర్యకలాపాలు నిర్వహిస్తోందని వారు చెప్పారు. గోల్డీబ్రార్ పరారీలో ఉన్నాడు. అతడి ఆచూకీ చె ప్పినవారికి 50 వేల డాలర్ల బహుమతిని కూడా ప్రకటించారు. అమెరికా, కెనడా, యూరప్‌లకు చెందిన చట్ట అమలు అధికారులు మూడు వేరు వేరు ముఠాలపై ఉమ్మడి సమన్వయంతో నిఘావేశాయి. ''ఆపరేషన్ హార్డ్‌బాల్'' పేరుతో ఈ దా డులు చేశారు. ఈ దాడుల్లో అట్లాంటాకు చెం దిన ఒక ప్రధాన ముఠాను అరెస్టు చేశారు. మా దక ద్రవ్యాల రవాణా, రాజకీయ హత్యలు, దోపిడీలు, కోట్లాది డాలర్ల దోపిడీ లక్ష్యంగా పె ట్టుకున్న నేరముఠాకు చెందిన 37 మందిపై అ మెరికా ప్రాసిక్యూటర్లు అభియోగాలు మో పారు. ఇప్పుడు వీరిలో పదిమంది తప్ప మిగిలినవారంతా చట్టం చేతికి చిక్కారు. తప్పించుకున్న పది మందిలో ఏడుగురు అమెరికాలో, ఇ ద్దరు భారతదేశంలో, మరొకరు యూరప్‌లో దా క్కున్నారని అధికారులు చెప్పారు. సంబంధిత అధికారులు వివిధ ఖండాలలో డజన్లకొద్దీ సెర్చి వారెంట్లను అమలు చేస్తున్న తరుణంలో 1000 కిలో గ్రాముల కొకైన్,ఆయుధాలు,నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ అన్వేషణలో భాగంగా జార్జియాకు చెందిన ఒక ముఠా సభ్యుడుతోపాటు భారత్ కేంద్రంగా పనిచేస్తున్న వ్యవస్థీకృత అంతర్జాతీయ హింసాత్మక నేరముఠాకు చెందిన 24 మందిని ఫెడరల్ అధికారులు అరెస్టు చేశారు.ఈ కేసులో లారెన్స్ బిష్ణోయ్ అనే భారత్‌కు చెందిన 33 ఏళ్ళ నేరగాడు సూత్రధారిగా ఉన్నాడు. ఇతగాడు లాస్‌ఏంజెల్స్‌లోని ప్రత్యర్థి నేర ముఠాల నుండి 520 కిలోగ్రాముల కొకైన్ దొంగిలించాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కెనడా ప్రభుత్వం 2025లో బిష్ణోయ్ ముఠా సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. గోల్డీబ్రార్ అలియాస్ సతీందర్ జీత్ సింగ్, రోహిత్ గోదారా అనే ఇద్దరు నమ్మకస్తులైన అనుచరుల ద్వా రా బిష్ణోయ్ స్మగుల్డ్ సెల్‌ఫోన్లతో తన కార్యకలాపాలను నిర్వహిస్తూ వచ్చాడు.వీరికి ప్రత్యర్థిగా ఉన్న జగ్గూ భగవాన్ పూరియా సంస్థలోని 17 మంది సభ్యులపై కూడా ఫెడరల్ అధికారులు అభియోగపత్రాలు దాఖలు చేశారు.అమెరికా కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌కు చెందిన గుర్లాల్‌సింగ్(22) అనేక ఒక వలస నేరస్థుడు భారతదేశంలో గడచిన జనవరిలో జరిగిన ఒక హత్యకేసులో ఒక అమాయకపు కుటుంబాన్ని నేరస్థులుగా నిలబెట్టడానికి ఒక అత్యంత అవినీతిపరుడైన అధికారిని ఆయుధంగా ఉపయోగించుకున్నాడని కూడా ఈ దర్యాప్తులో బహిర్గతమైంది

# ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా: లీపెన్



**పారిస్:** వచ్చే ఏడాది ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని జనాదరణ పొందిన పచ్చి మితవాద నాయకురాలు, నేషనల్ ర్యాలీపార్టీ అభ్యర్థి మెరైన్ లీపెన్ (58) బుధవారం ప్రకటించారు.

యూరోపియన్ యూనియన్ నిధులను దుర్వినియోగం చేశారన్న కేసులో నేరస్థురాలుగా రుజువైన లీపెన్ కింది కోర్టు తీర్పుపై ''కోర్ట్ ఆఫ్ కాసేషన్'' (సుప్రీంకోర్టు)కు అప్పీలు చేశారు. ఆమెకు వ్యతిరేకంగా కోర్టు ఇచ్చిన తీర్పును ఉన్నతస్థాయస్థానం మంగళవారం సమర్థించింది. లీపెన్ 45 నెలలపాటు ప్రజా కార్యకలాపాల పదవులు నిర్వహించడానికి అనర్హురాలని, ఐతే ప్రజాస్వామ్య స్వేచ్ఛకు అనుగుణంగా ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అనే నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఆమె విచక్షణకే వదిలిపెట్టింది. ఈ తీర్పు వెలువడిన కొద్ది గంటలకే, తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని ధీమాగా ప్రకటన విడుదల చేశారు.

ఐతే ఒక సంవత్సరంపాటు ఆమె ఎలక్ట్రానిక్ ట్యాగ్ (నేరస్తురాలనే చిహ్నం)తో గడపాలని కోర్టు ఆదేశాలను కూడా తన ప్రకటన ద్వారా సమ్మతించినట్లయింది. ఆదేశించింది. ఈ విధంగా ఎలక్ట్రానిక్ ట్యాగ్‌తో గడపాల్సివస్తే తాను ఎన్నికల్లో పోటీ చేసేదిలేదని,ప్రతిసారీ తాను కోర్టు అనుమతి పొందలేనని మొదట ఆమె వాదించారు. ఐతే ఒకవేళ లీపెన్ చివరి నిమిషంలో పోటీనుండి తప్పుకుంటే, ఆమె పెంచిపోషించిన శిష్యుడు జోర్డాన్ బార్డెల్లా (30)కు అధ్యక్ష పదవికి పోటీ చేసే అర్హత,అవకాశం ఖాయంగా లభిస్తుంది ఆయన పేరు ఖరారైతే నెపోలియన్ బోనాపార్టీ తర్వాత ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి అత్యంత పిన్నవయస్కుడైన అభ్యర్థిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. 2022 సంవత్సరం నుండీ నేషనల్ ర్యాలీ పార్టీ అధ్యక్షపదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# హోర్ముజ్‌లో ఇరాన్ కొత్త వ్యవస్థను గుర్తించడంతప్ప మరో మార్గంలేదు

ట్రంప్‌కు ఘాలిబాఫ్ హెచ్చరిక



**టెహ్రాన్:** హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌కు సంబంధించిన యుద్ధానంతర సరికొత్త వ్యవస్థను గుర్తించడం తప్ప అమెరికాకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేదని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్ అన్నారు.ఇరాన్‌కు చెందిన సీనియర్ చట్ట సభ్యుడు ఇబ్రహీం అజీజ్ కూడా ఇదే విషయం చెప్పారు .అమెరికా దాడులు,ఎంఓయుకు ముందుగా హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ చేసిన సర్దుబాట్లను అమెరికా ఉల్లంఘిస్తోందని ఘాలిబాఫ్ విమర్శించారు. హోర్ముజ్‌లో తాము చెప్పినవిధంగానే నౌకలు నడుచుకోవాలని, ఇవన్నీ తమ ప్రాదేశిక జలాలని, ఇక్కడ తమ అధికారమే చెల్లుబాటవుతుందితప్ప అమెరికా పెత్తనం సాగబోదని, యుద్ధానికి ముందునాటి పరిస్థితులు జలసంధిలో ఇప్పుడు లేవని ఘాలిబాఫ్ స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఒమన్‌కు సమీపం నుండి కొత్త జలమార్గాలను ఏర్పాటు చేయాలని అమెరికా ప్రయత్నం చేస్తుండగా ఈ ప్రయత్నాలను ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. దొంగదారుల్లో ప్రయాణించే నౌకలు తిరిగి తిరిగి తమ వద్దరే రావాల్సివస్తుందని, దొంగదారుల్లో వెళితే తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయని, నౌకలు నావిగేషన్‌తప్పి ఒకదానికొకటి ఢీకొట్టుకుంటాయని, మందుపాతరల ప్రమాదం కూడా పొంచి ఉందని ఐఆర్‌జిసి పదే పదే వాణిజ్య నౌకలకు హెచ్చరికలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉన్నంతవరకూ, ఈ జలసంధిని దాటే వరకూ నౌకలు అనివార్యంగా ఇరాన్ ఐఆర్‌జిసితో అనుసంధానంలో ఉండాలని, సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేస్తోంది. జలసంధిలో ఒమన్‌తో కలిసి రుసుములు వసూలు చేయడం ఇరాన్‌కు ఇప్పుడు ప్రధానాంశంగా ఉంది. ఐతే ఈ విషయంలో గల్ఫ్ దేశాలతో కూడా చర్చించాల్సి ఉంది.

జూన్ 17,18 తేదీల్లో అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పదం ప్రకారం, 60 రోజులపాటు జలసంధిలో ఎలాంటి రుసుములూ వసూలు చేయకుండా నౌకల రాకపోకలకు అనుమతులు ఇచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ఇరాన్ పాలకులు చర్చల్లో హామీ ఇచ్చారు. ఈ కీలకమైన జలరవాణామార్గంలో నౌకా రవాణా అనేది ఒక ఎడతెగని సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించడానికి కష్టతరంగా ఉంది. సంక్లిష్టతలతో ముడిపడి ఉంది. ఈ విషయంలో ఇరాన్ చర్చల్లో తన పర్షియన్ తెలివితేటలు,ఎత్తుగడలు ఉపయోగిస్తోందని ట్రంప్,జె.డి.వాన్స్,హెగ్సెత్ తదితరులు పదే పదే విమర్శిస్తున్నారు.

# సైబర్ నేరాలపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

నెల రోజుల్లో 36 మంది అరెస్టు..
బాధితులకు రూ.49 లక్షల రీఫండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉక్కుపాదం మోపింది. జూన్ నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో 14 కీలక సైబర్ నేరాల కేసులను ఛేదించి 36 మంది నిందితులను అరెస్టు చేసింది. అలాగే మోసపోయిన బాధితులకు రూ.48.98 లక్షలకుపైగా రికవరీ చేసి తిరిగి అందించింది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో మోసాలకు పాల్పడుతున్న 280 నకిలీ ప్రొఫైళ్లను గుర్తించి తొలగించడం విశేషం. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ విడుదల చేసిన నెలవారీ నివేదిక ప్రకారం, జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా జూన్ నెలలో 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో 36 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో 22 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ 5 మంది సోషల్ మీడియా మోసాలు, 3 మంది ఉద్యోగాల పేరుతో మోసాలు, 6 మంది మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్ కేసులకు చెందినవారు ఉన్నారు.నిందితుల నుంచి 8 మొబైల్ ఫోన్లు, 6 డెబిట్ కార్డులు, 3 సిమ్ కార్డులు, 2 చెక్‌బుక్కులు, ఒక బ్యాంక్ పాస్‌బుక్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివిధ కేసుల్లో బాధితులు కోల్పోయిన మొత్తాల్లో రూ.48,98, 210ను రికవరీ చేసి తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు.జూన్ నెలలో ట్రేడింగ్ ఫ్రాడ్ డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు, ఉద్యోగాల మోసాలు, డేటింగ్ ఫ్రాడ్, ఎపికె ఫ్రాడ్ నకిలీ కస్టమర్ కేర్ మోసాలు అధికంగా నమోదయ్యాయి. మొత్తం 24 కేసుల్లో రూ.5.08 కోట్లకు పైగా నష్టం వాటిల్లగా, అందులో దాదాపు రూ.49 లక్షలు బాధితులకు రీఫండ్ చేశారు. జోనల్ సైబర్ సెల్స్ పరిధిలో 2,288 ఎన్‌సిఆర్‌పి ఫిర్యాదులు, 287 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 10 మంది నిందితులను అరెస్టు చేసి రూ.1.08 కోట్లకు పైగా బాధితులకు తిరిగి అందించారు.

## ప్రజలకు కీలక హెచ్చరిక

సోషల్ మీడియాలో ఉన్నతాధికారుల పేర్లతో వచ్చే నకిలీ ఖాతాలు, తక్కువ పెట్టుబడితో భారీ లాభాలంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకులు ఎప్పుడూ వాట్సాప్ ద్వారా ఎపికె ఫైళ్లు పంపవని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. అలాగే 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వచ్చే బెదిరింపు కాల్స్ పూర్తిగా నకిలీవని, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని క్రైమ్స్ అదనపు పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసు ప్రజలకు సూచించారు.

# రూ.4.70 కోట్ల 'వాట్సాప్ బాస్' ఫ్రాడ్‌ను ఛేధించిన టిజిసిఎస్‌బి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించి రూ.4.70 కోట్లను కాజేసిన భారీ సైబర్ మోసాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఛేదించింది. ఈ కేసులో మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి లావాదేవీలకు సహకరించిన ఇద్దరు మ్యూల్ అకౌంట్ హోల్డర్లు, ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధిత సంస్థలోని ఉద్యోగిని నిందితులు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పేరుతో, ఆయన ఫొటోతో నకిలీ వాట్సాప్ ఖాతా సృష్టించి అత్యవసర నిధుల బదిలీ పేరుతో నమ్మించారు. ఆ సందేశాలు నిజమని భావించిన ఉద్యోగి నిందితులు సూచించిన బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.4.70 కోట్లు బదిలీ చేశాడు. ఈ ఘటనపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక విశ్లేషణ, బ్యాంకు ఖాతాల పరిశీలన ద్వారా దోసపాటి కృష్ణసాయి (సత్తుపల్లి, ఖమ్మం జిల్లా), మండవల్లి శివ నాగరాజు (కొత్తపేట్, హైదరాబాద్)లను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు సైబర్ మోసగాళ్లకు కమీషన్ కోసం బ్యాంకు ఖాతాలు సమకూర్చి, వాటి నిర్వహణలో కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఇద్దరూ కలిపి సుమారు రూ.4 లక్షల కమీషన్ తీసుకుని పంచుకున్నట్లు గుర్తించారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకోవడంతో పాటు మోసపోయిన మొత్తాన్ని స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు టీజీసీఎస్‌బీ తెలిపింది.

# మంత్రిని చేయండి

(మొదటి పేజీ తరువాయి)

నిపుణుల బృందం జస్టిస్ ఘోష్ కమిటీకి అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. తమ్మిడిహట్టి వద్ద 160 టిఎంసిల నీరు లేదని సిడబ్ల్యుసి తన నివేదికలో పేర్కొందని, మేడిగడ్డ వద్ద 240 టిఎంసిలు వాడుకోవచ్చని స్పష్టం చేసిందన్నారు. అన్ని ప్రయత్నాలూ చేసినా ఫలితం లేకపోవడంతో మేడిగడ్డ బ్యారేజీని నిర్మించామని హరీశ్ రావు పునరుద్ఘాటించారు.

సమ్మక్క బ్యారేజీ చర్చిద్దామా? ....

సమ్మక్క బ్యారేజి వద్ద పుష్కలంగా నీళ్లున్నా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో చెరువులు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమ్మక్క బ్యారేజి వద్ద 76 మీటర్ల ఎత్తులో నీళ్లు ఉన్నాయని, 71 మీటర్ల వద్దనే దేవాదుల మోటార్లు నడపొచ్చని, కానీ మోటార్లు ఆన్ చేయకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నేరపూరిత నిర్ల క్ష్య మని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 నుంచి 80 శాతం చెరువులు ఎండిపోయి ఎడారిలా మారుతున్నాయని, దీనిపైన ఆ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. సమ్మక్క బ్యారేజి అంశంపైన అసెంబ్లీ చర్చిద్దామా? అని అన్నారు. పోలవరం అథారిటీ సిఈఓగా ఉన్నప్పుడు పదిసార్లు డ్యామ్ కొట్టుకపోయి రూ 7 వేల కోట్లు వృథా కావడానికి కారణమైన చంద్రశేఖర్ అయ్యర్, ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఇచ్చారని, పది సార్లు కూలిన పోలవరం వద్దకు ఇప్పటి వరకు ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు పోలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడిగడ్డ వద్ద ఒక పిల్లర్ మత్రమే కృంగిందని, దానికి మరమ్మత్తులు చేపడితే సరిపోతుందని అన్నారు. గోదావరిలో నీళ్లు ఉన్నప్పటికీ ఎత్తకపోవడం నేరపూరిత నిర్లక్ష్యమని హరీశ్ రావు మండిపడ్డారు.

# 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష'

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 25లక్షల మంది అభ్యర్థులు హాజరవుతారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే (జెఇఇ)మాదిరిగానే ఈ పరీక్ష కూడా కనీసం ఆరు రోజులపాటు జరుగుతుంది. పరీక్షా కేంద్రాల వద్ద విశ్వసనీయత, మౌలిక సదుపాయాల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వాటిని ఎంపిక చేస్తారు.అని ఒక మూలం (సోర్స్) తెలిపింది. దీనికి సంబంధించిన వివరణాత్మక ప్రణాళికను ఇంకా ఖరారు చేయాల్సి ఉందని కూడా ఆ మూలం పేర్కొంది. వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రతీ ఏడాది నీట్ (ఎన్ఇఇటి) పరీక్షను నిర్వహిస్తోంది. ఎంబిబిఎస్ కోర్సుల్లో దాదాపు 1,08, 000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంబిబిఎస్ కోర్సుకు అందుబాటులో ఉన్న సీట్లలో దాదాపు 56,000 ప్రభుత్వ ఆసుపత్రులలో, దాదాపు 52,000 ప్రైవేట్ కళాశాలల్లో ఉ న్నాయి. డెంటిస్ట్రీ, ఆయుర్వేద, యునాని, సిద్ధ వంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కూడా నీట్ ఫలితాలను పరిగణనలోనికి తీసుకుంటారు. నీట్ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానానికి మార్చాలనే ఆలోచన కొత్తేమీ కాదు. దీనిపై గతంలో చాలాసార్లు చర్చ జరిగింది. అయితే, పేపర్ లీక్ వివాదం తర్వాతే ఈ సంస్కరణల కోసం ఒత్తిడి పెరిగింది.2024 జూన్‌లో నీట్ పరీక్ష సంస్కరణలు, సిఫారసుల కోసం విద్యా మంత్రిత్వ శాఖ, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది.

# మళ్ళీ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

(జులై 11)న ఇస్లామాబాద్‌లో తలపెట్టిన చర్చలు కూడా అటకెక్కాయి. కానీ టర్కీ నగరం అంకారాలో జరుగుతున్న నాటో 36వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్న ట్రంప్ ఈ కాల్పుల విరమణపై బుధవారం స్పందించారు. ''ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం ముగిసింది, కానీ చర్చలు కొనసాగించడానికి అనుమతిస్తున్నాను, నావరకూ అయితే మాత్రం ఇక అంతా ముగిసింది,వాళ్ళు నీచులు,రోగులు, ఇక వాళ్ళతో వ్యవహారం నడపాల్సిన అవసరం నాకులేదు,ఇంకా చెప్పాలంటే, వాళ్ళకి నాయకత్వం వహిస్తున్నది కూడా రోగులే, నన్నడితే అంతా ముగిసిపోయింది,కానీ ఇరువైపులా మధ్యవర్తుల ద్వారా చర్చలు కొనసాగించవచ్చు,వారు సమయం వృధా చేస్తున్నారని భావిస్తున్నాను,అంతేకాదు, గురువారం తెల్లవారేలోపు మళ్ళీ రెండోసారి కూడా దాడులు చేస్తాం'' అన్నారు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ పిలుపు మేరకు లక్షలమంది ప్రజలు ఖమేనీ అంతిమయాత్రలో పాల్గొంటూ ''ట్రంప్‌ను చంపండి, నెతన్యాహూను చంపండి, వారికి మరణశిక్ష విధించండి'' అంటూ మూడురోజులుగా కొనసాగుతున్న నినాదాలు, బ్యానర్లు ప్రదర్శనలు కూడా ట్రంప్‌కు ఆగ్రహం రప్పించాయి. అమెరికా దాడులు చేయడం ఖచ్చితంగా అవసరమే, ఇది కాల్పుల విరమణ ఉల్లంఘన చర్య అని నాటో అధిపతి మార్క్ రుట్టే కూడా వ్యాఖ్యానించారు. అమెరికా కాల్పుల విరమణ ఒప్పందం ఉలఘించిందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ విమర్శించారు. కాల్పుల విరమణ ముగిసిపోయిందని ట్రంప్ చేసిన ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. చమురు ధరలు భారీ ఎత్తున పెరిగిపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర ఒక్కసారిగా ఆరుశాతం పెరిగి బ్యారెల్‌కు 76.56 డాలర్లకు చేరింది. ట్రంప్ చేసిన ప్రకటనలో భారత్ దేశీయ మార్కెట్లు భారీస్థాయిలో పతనమయ్యాయి. ఎనిమిది లక్షల కోట్ల మేరకు మదుపర్ల సంపద ఆవిరైంది.

అన్ని రంగాలలోనూ యుద్ధం ముగించి శాశ్వత శాంతి నెలకొల్పే ఉద్దేశంతో 14 పేజీల తాత్కాలిక అవగాహన ఒప్పందంపై అమెరికా–ఇరాన్ జూన్ 17,18 తేదీలలో సంతకాల ప్రక్రియ పూర్తిచేశాయి. ఇప్పుడిది మూడునాళ్ళ ముచ్చటగా మారింది. అమరుడైన ఇరాన్ ఇస్లాం విప్లవ నాయకుడు అయొతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంతిమయాత్ర ఒకవైపు కొనసాగుతున్న సమయంలో,మంగళవారం ట్రంప్ ఆక్సియోస్ న్యూస్‌తో మాట్లాడుతూ, వాళ్ళు తుది ఒప్పందానికి రాకపోతే ''మా పని పూర్తిచేస్తాం'' ఒక్క దెబ్బతో ఇరాన్‌ను నాశనం చేయగల సత్తా మాకు ఉంది, కానీ చర్చలు జరపడానికి ఎవరూ మిగలరనే ఉద్దేశంతో మేం మంచివాళ్ళం కాబట్టి దాడులు చేయడం ఆపేశాం' అని చేసిన హెచ్చరిక తర్వాత హోర్ముజ్ జలసంధిలో ఖతార్,సౌదీఅరేబియాలతో సహా మూడు వాణిజ్య చమురు ట్యాంకర్లపై డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ట్యాంకర్లు ధ్వంసమై సముద్రంలోనే స్తంభించిపోయాయి. దీంతో అమెరికా సెంట్‌కామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి బుధవారం తెల్లవారుజామున భారీ దాడులు చేసింది. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని (ఎంఓయు) మీరు ఉల్లంఘించారంటే మీరే ఉల్లంఘించారంటూ రెండు దేశాలు విమర్శలు దాడులు కూడా చేసుకున్నాయి. ఐతే తొలుత మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై చేసిన ప్రొజెక్టైల్ దాడులకు ఇరాన్ ఎలాంటి బాధ్యతా వహించలేదు. మంగళవారం హోర్ముజ్ జలసంధిలో మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై దాడులు చేసినందుకు ప్రతీకారం తీర్చుకున్నామని అమెరికా సెంట్‌కామ్ ప్రకటించగా,ఇరాన్‌నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటుందని ఆ దేశ విదేశీ వ్యవహారాలమంత్రిత్వ శాఖ ప్రతినిధి హెచ్చరిక చేశారు.మరోవైపు ఇరాన్ తమ పౌరులపై దాడులు చేసిందని బహ్రైన్ రక్షణ బలగాలు విమర్శించాయి. బుధవారంతెల్లారేవరకూ జరిగిన ఇరాన్ దాడులను తిప్పికొట్టామని బహ్రైన్ డిఫెన్స్ జనరల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో దాడుల కారణంగా అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ తన ఇజ్రాయెల్ పర్యటన రద్దు చేసుకున్నారు.

# సహకారం అందించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను ఇరువురు చర్చలు జరిపారు. తెలంగాణకెనడా మధ్య పెరుగుతున్న పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన క్రిస్ కూటర్, ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్, హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, సిఐబిసి హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి) ను ప్రారంభించడం వంటి పరిణామాలు తెలంగాణపై కెనడా కంపెనీల నమ్మకం, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాంతోపాటు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్యాపిటల్ సంస్థ సిపిపి ఇన్వెస్ట్‌మెంట్స్ హైదరాబాద్‌కు చెందిన సిటిఆర్ఎల్ఎస్ డేటా సెంటర్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ కెనడియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం తెలంగాణ పెట్టుబడి సామర్థ్యాన్ని మరింత బలపరిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐటి, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన పురోగతిని సిఎం రేవంత్ రెడ్డి క్రిస్ కూటర్ బృందానికి వివరించారు. ముఖ్యంగా ప్రపంచంలోని ఫార్చ్యూన్500 కంపెనీల గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జిసిసిలు) హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నది పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని సిఎం రేవంత్ వివరించారు. నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రెండో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన హైకమిషనర్ క్రిస్ కూటర్, తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులైన యువశక్తి తెలంగాణకు మరింత బలం చేకూరుస్తోందని అన్నారు. సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సిఈఓ బి.అజిత్ రెడ్డి, టిజిఐఐసి ఎండి శశాంక, ఐటి, ఈ అండ్ సి జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులతో భేటీ

ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఆయిల్ పామ్ ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి కల్పించనున్నట్టు గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వివరించారు. ఇందులో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన అభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించడం పట్ల వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో సిఎం రేవంత్ రెడ్డితో గోద్రేజ్ గ్రూపు సంస్థల కార్పొరేట్ వ్యవహారాల ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సిఈఓ సౌగత నియోగి భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్, ఆయిల్ పామ్ సాగు విస్తరణ తదితర అంశాలపై గోద్రేజ్ ప్రతినిధులు సిఎంతో చర్చించారు. రాష్ట్రంలో మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు నివేదికను అందించారు. సీడ్ గార్డెన్ విస్తరణ కోసం అదనంగా మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రాసెసింగ్ యూనిట్ కోసం రాహదారిని విస్తరించాలని వారు సిఎంను కోరారు.

# కొత్తదేమీకాదు

(మొదటి పేజీ తరువాయి)

కూలంకషంగా వివరించారు.

**గిరిజన భూములు ఉన్నందున ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలి**

సింగరేణికి 2010 నుంచి 2012 వరకు కేంద్ర బొగ్గు శాఖకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ నాటి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2013 సెప్టెంబర్ 16న తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించిందని, ఈ బ్లాక్‌లో గిరిజన భూములు ఉన్నందున వాటిని ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలని కేటాయింపు లేఖలో స్పష్టంగా భట్టివిక్రమార్క చెప్పారు. ఈ బ్లాక్‌ల అన్వేషణ, అభివృద్ధి పనులు వేగంగా చేసి వీలైనంత త్వరగా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నాడు కేంద్ర ప్రభుత్వం ఈ కేటాయింపు లేఖలో సింగరేణికి సూచించిందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాను పలుమార్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసినట్లు చెప్పారు. సింగరేణికి మంజూరైన తాడిచర్ల2 బ్లాక్ కు మైనింగ్ లీజు ముందస్తు అనుమతులు ఇవ్వాలని పలుమార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు, ఇల్లందు వంటి సింగరేణి ప్రాంతాలు 1/70 గిరిజన చట్టం పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఇక్కడ గిరిజనులు మాత్రమే భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే మైనింగ్ వంటి కార్యకలాపాలు చేసుకునే హక్కు కలిగి ఉంటాయన్నారు. ఈ విషయాలు చట్టంలో స్పష్టంగా చెప్పబడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇల్లందు సమీపంలోని కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్‌ను, మణుగూరులోని ఓపెన్ కాస్ట్ డిప్ సైడు గనిని వేలం పాటలో పెట్టడం చట్టానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమని విమర్శించారు. గిరిజన చట్టం అమలులో ఉన్న సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు మాత్రమే కేటాయించడం సమంజసమని అన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వ రంగ సంస్థ కనుక.. ఇక్కడ బొగ్గు తవ్వి తీసే అధికారం కేవలం సింగరేణికే ఉంటుందని పలు లేఖల ద్వారా కేంద్రానికి చెప్పామని అన్నారు. ఇప్పుడు కొత్తగా బ్లాకును కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించటం విచారకరమని పేర్కొన్నారు. మైనింగ్ అనుమతులు ఆలస్యం అవ్వటం వలన సింగరేణి సంస్థ ఆ గనిని ప్రారంభించ లేకపోయిందని అన్నారు. ఈ కారణం వల్ల సంస్థకు అపార నష్టం కలిగిందన్నారు. ఇప్పటికైనా మైనింగ్ లీజుకు ముందస్తు అనుమతి ఇవ్వటం మంచి పరిణామం అని అన్నారు.

## గోదావరి లోయ బొగ్గు బ్లాక్‌లన్నీ సింగరేణికి కేటాయించాలి

సింగరేణి సంస్థపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ప్రేమ ఉంటే సింగరేణి విస్తరించిన గోదావరి లోయ ప్రదేశంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిప్యూటీ సిఎం కోరారు. ఈ మేరకు సింగరేణి సంస్థతో పాటు తాము కూడా పలు బొగ్గు బ్లాకుల పేర్లను ప్రస్తావిస్తూ కేంద్ర బొగ్గు శాఖకు చెబుతూ వస్తున్నామని వివరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే ప్రైవేటు వారికి కేటాయించిన కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ అలాగే సత్తుపల్లి ఓపెన్ కాస్ట్3 బ్లాక్ లలో ఇప్పటివరకు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించలేదని, వాటిని తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఆయన కోరారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాక్ లను వేలం పాటలో ఉంచకుండా సింగరేణికి కేటాయించాలని ఆయన చెప్పారు. ఇక్కడ ఉన్న గిరిజన చట్టాలు స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి నేరుగా కేటాయించడం ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి ( జి టు జి) అనే పద్ధతిలో సమంజసంగా ఉంటుందన్నారు. సమావేశంలో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్

ఫిఫా వరల్డ్ కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4–3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4–3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది.

ఫిఫా వరల్డ్కప్లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్లోకి ప్రవేశించలేదు. వరల్డ్ కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ



మ్యాచోచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

# వింబుల్డన్ సెమీఫైనల్లో సినర్, గాఫ్



వింబుల్డన్‌లో టైటిల్ నిలబెట్టుకునే దిశగా సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ ఆ క్రమంలో మరో అడుగు ముందుకేశాడు. పురుషుల సింగిల్స్‌లో ఈ టాప్ సీడ్ ఇటలీ స్టార్ 7–5, 7–6 (7/4), 6–3తో యాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)ను ఓడించి టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ జ్వెరెవ్ 6–4, 7–5, 3–6, 7–6 (8/6)తో జిరి లెహెక (చెక్)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల కోకో గాఫ్ (అమెరికా) 4–6, 6–3, 6–3తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులాను ఓడించి లాస్ట్4కు చేరుకుంది. మరో క్వార్టర్స్లో నవొమి ఒసాకా (జపాన్).. 6–7 (4/7), 46తో కరోలినా ముచోవా (చెక్) చేతిలో ఓడింది. ఈ టోర్నీలో సెమీస్కు చేరడం గాఫ్, ముచోవాకు ఇదే మొదటిసారి కావడం విశేషం

# మూడవ టి–20లో ఇంగ్లండ్ ఘన విజయం

### 125 రన్స్ తేడాతో భారత్ అతి పెద్ద పరాజయం

టి–20 వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత్ చెత్తాటతో నిరాశపరుస్తోంది. ఐర్లాండ్ చేతిలో వైట్వాష్ అయిన తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అడుగు పెట్టిన అయ్యర్ సేన వరుసగా రెండో ఓటమి ఖాతాలో వేసుకుంది. గత పోరులో బౌలింగ్‌లో ఫెయిలైన భారత్ ఈసారి పేలవ బ్యాటింగ్‌తో అతి పెద్ద పరాజయంతో తలదించుకుంది. మంగళవారం రాత్రి జరిగిన మూడో టి–20లో 125రన్స్ తేడాతో ఓడింది. షార్ట్ ఫార్మాట్లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద ఓటమి. 2019లో వెల్లింగ్టన్లో న్యూజిలాండ్ చేతిలో 80 రన్స్ తేడాతో ఓడిన మెన్ ఇన్ బ్లూ ఇప్పుడు



మరింత చెత్త రికార్డు ఖాతాలో వేసుకుంది. ఇంగ్లండ్ ఇచ్చిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 11.4 ఓవర్లలో 76 రన్స్‌కే కుప్పకూలింది. జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) పేస్ ధాటికి టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు అభిషేక్ (10), సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ (13), కెప్టెన్ అయ్యర్ (5), అక్షర్ (10), తిలక్ (3), శివం దూబే (2) పెవిలియన్కు క్యూకట్టడంతో జట్టుకు ఘోర పరాభవం తప్పలేదు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ 20 ఓవర్లకు 201/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), ఆల్రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), జోస్ బట్లర్ (36) మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లలో ప్రిన్స్, హర్షిత్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 20తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టి–20 గురువారం జరుగుతుంది.

## జీవవైవిధ్య పరిశీలనలో
# అనుకోని ఆవిష్కరణ




ఢిల్లీలోని సెంట్రల్ రిడ్జ్ ప్రాంతంలో జీవవైవిధ్యాన్ని అధ్యయనం చేయడానికి వెళ్లిన ఇద్దరు పర్యావరణవేత్తలకు ఊహించని చారిత్రక ఆనవాళ్లు కనిపించాయి. పర్యావరణవేత్తలు ప్రదీప్ కృష్ణన్, చేతన్ అగర్వాల్‌లు ఈ ప్రాంతంలోని మొక్కలు, వృక్ష సంపద, పర్యావరణ పరిస్థితులను తరచూ పరిశీలిస్తూ ఉంటారు. అలాంటి ఒక సాధారణ సందర్శనలో పోలో గ్రౌండ్ సమీపంలో భూమి నుంచి పైకి కనిపిస్తున్న క్వార్ట్జ్ శిలపై అసాధారణమైన చెక్కడాలు వారి దృష్టిని ఆకర్షించాయి. మొదట ఇవి ఏమిటో అర్థం కాకపోయినా, చరిత్రకారుడి సలహా తీసుకున్న తరువాత అవి 'పెట్రోగ్లిఫ్స్' అయి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. పెట్రోగ్లిఫ్స్ అంటే ప్రాచీన కాలంలో రాళ్లపై చెక్కిన బొమ్మలు, గుర్తులు లేదా సంకేతాలను సూచిస్తుంది. ఇవి అప్పటి మానవుల జీవన విధానం, సంస్కృతి, మత విశ్వాసాలు, కళాత్మక అభిరుచులు లేదా సమాచార మార్పిడికి సంబంధించిన విలువైన ఆధారాలుగా పరిగణించబడతాయి.

### ఇంకా తెలియని చరిత్ర..

ఈ శిలపై రెండు రకాల ఆకృతులు కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. ఒక ఆకృతిలో వరుసగా ఏడు లేదా ఎనిమిది చిన్న గుంటల మాదిరిగా కనిపించే గుర్తులు ఉన్నాయి. వీటిని 'క్యూప్యూల్స్' అని పిలుస్తారు. మరో ఆకృతి నిచ్చెన ఆకారంలో ఉండి, రెండు నిచ్చెనలు ఒకదానికొకటి లంబంగా అమర్చినట్లుగా కనిపిస్తోంది. ఇవి ఏదైనా ఆటకు సంబంధించిన బోర్డు అయి ఉండవచ్చని లేదా అలంకార రూపకల్పనలో భాగం కావచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి కేవలం వ్యక్తిగత పరిశీలనలేనని, శాస్త్రీయ నిర్ధారణ కాదని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ చెక్కడాలు కనిపించిన శిల 'క్వార్ట్జ' అనే అత్యంత గట్టి రాతితో ఏర్పడింది. ఈ రాతిపై చెక్కిన గుర్తులు వాతావరణ ప్రభావంతో చెరిగిపోవడానికి చాలా కాలం పడుతుంది. ప్రస్తుతం కనిపిస్తున్న చెక్కడాలు చాలా వరకు అరిగిపోయిన స్థితిలో ఉన్నాయి. అందువల్ల అవి ఎంతో పురాతనమైనవిగా అనిపిస్తున్నప్పటికీ, వాటి వయస్సును కేవలం రూపాన్ని చూసి నిర్ధారించడం సాధ్యం కాదు. సాధారణంగా శిలా చెక్కడాల కాలాన్ని నిర్ణయించడానికి ఇతర చారిత్రక ఆధారాలను ఉపయోగిస్తారు. ఉదాహరణకు, అశోకుని శాసనాలు ఇప్పటికే ఉన్న శిలా చెక్కడాలపై చెక్కబడి ఉంటే, ఆ చెక్కడాలు కనీసం క్రీస్తుపూర్వ మూడో శతాబ్దానికి ముందువేనని చెప్పవచ్చు. కానీ ఢిల్లీలో లభించిన ఈ చెక్కడాలకు అలాంటి పోలికలు లేదా ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. అందువల్ల వాటి కాలాన్ని శాస్త్రీయ పరిశోధన ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది.



### శాస్త్రీయ పరిశోధన అవసరం

పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ఢిల్లీ సెంట్రల్ రిడ్జ్ ప్రాంతం ఆరావళి పర్వత శ్రేణిలో భాగం. ప్రపంచంలోని అత్యంత ప్రాచీన పర్వత శ్రేణుల్లో ఆరావళి ఒకటి. ఈ ప్రాంతంలో ఇలాంటి శిలా చెక్కడాలు కనిపించడం ఆశ్చర్యకరమైన విషయం కాదు. గతంలో కూడా హర్యానా ప్రాంతంలో ఇలాంటి అనేక పెట్రోగ్లిఫ్స్ వెలుగులోకి వచ్చాయి. అయితే ఏ శిలా చెక్కడాన్నైనా వెంటనే వేల సంవత్సరాల నాటిదిగా ప్రకటించడం శాస్త్రీయ పద్ధతి కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాటి వయస్సు, ఉద్దేశం, చారిత్రక ప్రాధాన్యం వంటి అంశాలను నిర్ధారించడానికి సమగ్ర పురావస్తు తవ్వకాలు, శాస్త్రీయ విశ్లేషణలు, భూగర్భ శాస్త్ర పరిశోధనలు, నిపుణుల మధ్య చర్చలు అవసరం. అప్పుడే అవి ఏ కాలానికి చెందినవి, ఎవరు చెక్కారు, ఎందుకు చెక్కారు అనే ప్రశ్నలకు విశ్వసనీయ సమాధానాలు లభిస్తాయి. ఈ ఆవిష్కరణ ప్రస్తుతం పరిశోధకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది ఢిల్లీ ప్రాంత ప్రాచీన చరిత్రకు కొత్త ఆధారంగా మారే అవకాశం కూడా ఉంది. అదే సమయంలో సరైన పరిశోధన పూర్తయ్యే వరకు ఊహాగానాలకు తావివ్వకుండా, ఈ శిలా చెక్కడాలను సంరక్షించడం అత్యంత అవసరం. భవిష్యత్తులో జరగబోయే శాస్త్రీయ అధ్యయనాలు ఈ రహస్యమైన శిలా కళ వెనుక దాగి ఉన్న చరిత్రను వెలుగులోకి తీసుకురావచ్చని పురావస్తు నిపుణులు భావిస్తున్నారు.

### రాజుల చరిత్రకన్నా సమాజ పరిణామాలే కీలకం



చరిత్రను అధ్యయనం చేసే విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు చరిత్ర అంటే రాజులు, యుద్ధాలు, రాజవంశాలు, తేదీలు మాత్రమే అన్న అభిప్రాయం ఉండేది. ఏ రాజు ఎప్పుడు పాలించాడు, ఏ యుద్ధంలో ఎవరు గెలిచారు, ఏ రాజవంశం తర్వాత ఏ రాజవంశం వచ్చింది వంటి అంశాలకే ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే ఆధునిక చరిత్రకారులు చరిత్రను కేవలం పాలకుల కథగా కాకుండా, సమాజం మొత్తం ఎలా మారిందనే దృష్టితో పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాచీన, మధ్యయుగ భారతదేశ చరిత్రను అర్థం చేసుకోవాలంటే సామాజిక–ఆర్థిక మార్పులు, మతపరమైన ఉద్యమాలు, పరిపాలనా వ్యవస్థలు, కళలు, వాస్తుశిల్పం వంటి అంశాలపై దృష్టి పెట్టడం అవసరం. భారతదేశ చరిత్ర అనేది అనేక సంస్కృతుల, మతాల, భాషల, సామాజిక సమూహాల పరస్పర ప్రభావాల సమాహారం. ఈ చరిత్రలో జరిగిన మార్పులు నేటి భారత సమాజ నిర్మాణాన్ని ప్రభావితం చేశాయి. అందువల్ల ప్రాచీన, మధ్యయుగ భారతదేశాన్ని అర్థం చేసుకోవడమంటే కేవలం గతాన్ని తెలుసుకోవడం కాదు; వర్తమాన భారతదేశ మూలాలను తెలుసుకోవడం కూడా.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల
# ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

### ఆగస్టు 6 నుండి 14 వరకు సిపిఐ పాదయాత్ర
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రాలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో గౌతమ్ గోవర్ధన్ అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ బిజెపి సర్కార్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా కార్మిక విధానాలు అమలు చేస్తుందనీ, మతోన్మాదం పేరుతో దేశంలో అలజడి సృష్టిస్తోందన్నారు. రాముడి పేరుతో అయోధ్యలో రామాలయం కట్టి, వందల కోట్ల రూపాయల చందాలు మాయం చేశారని, దోచుకున్న వారిపై ఇంతవరకూ చర్యలు లేవన్నారు. దేశంలో మసీదులు, చర్చిలు ఉండకుండా చేయాలనే లక్ష్యంతో దేశాన్ని హిందూ దేశంగా చూడాలని ఆకాంక్షతో బిజెపి సర్కార్ పని చేస్తుందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వం పేదల పాలిట చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ఆగస్టు 6 నుంచి 14 వరకు పెద్దపల్లి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పాదయాత్ర కార్యక్రమాన్ని సిపిఐ చేపట్టడం జరుగుతుందని, ఈపాదయాత్రను జిల్లావ్యాప్తంగా సిపిఐ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చా రు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, మతోన్మాదం, నిరుద్యోగం, అవినీతి అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సిపిఐ కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, గోశిక మోహన్, కె.కనకరాజు, కోడం స్వామి, మడికొండ ఓదెమ్మ, తాళ్లపల్లి మల్లయ్య, తాళ్లపల్లి లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనే లక్ష్యం

### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గిరిజన హక్కుల సాధనే లక్ష్యమని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ అన్నారు. గిరిజన సమాఖ్య నాగర్‌కర్నూల్ జిల్లా రెండవ మహాసభ కొల్లాపూర్ పట్టణంలోని కెఎల్ఐ గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించారు. సభలో అంజయ్య నాయక్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడిచిన ఆదివాసీ గిరిజనుల పరిస్థితి ఇంకా దుర్భరంగానే ఉందన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు విశాలమైన దృక్పథంతో 1957లో ఆదివాసీ మహాసభ ఆవిర్భవించిందన్నారు. అటవీ హక్కుల చట్టం సాధన కు సమరశీల పోరాటాలు నిర్వహించి ప్రతి గిరిజనుడికి సాగు భూమి కావాలని పోడు భూపోరాటాలు నిర్వహించి పోడు పట్టాలను గిరిజనులకు ఇప్పించడం జరిగిందన్నారు. గిరిజనులకు జీవనాధారంగా ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అటవీ బంజరులను ప్రభుత్వం మిగులు భూములను పంచాలని ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వాలని అర్హులైన ప్రతి గిరిజనులకి రుణాలను అందించాలని గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు విద్య, వైద్యం, విద్యుత్ రహదారులు తాగు నీరు, సాగునీరు సౌకర్యాలు కల్పించాలని అనేక పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం అఖిలభారత ఆదివాసి మహాసభ అని ఆయన గుర్తు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా గిరిజనులకు సంక్షేమ పథకాలు అందక వారు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పోడు భూముల సమస్య అలాగే ఉందన్నారు. గిరిజనులకు ఉపాధి అవకాశాలు లేక ఇంకా దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. వారికి పనికి తగ్గ ప్రతిఫలాన్ని ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరి ఇంకా చేయించుకుంటున్నారు. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలంలో గిరిజనులపై అనేక దాడులు జరిగినాయని, ఆ దాడులపై సిపిఐ ముందుండి దాడులను ఎదుర్కొని వారికి తగు న్యాయం జరగాలని అనేక రకాలుగా పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు., సభలో కొల్లాపూరు మండల కార్యదర్శి తుమ్మల శివుడు, కోడేరు మండల కార్యదర్శి కిరణ్‌కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీ పతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, నాయకులు శివ, యూసుఫ్, జంగల్ శివుడు, గిరిజన సంఘం నాయకులు బర్మల మల్లయ్య, బయన్న, సిద్ధు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ కార్మికులకు రూ.26వేలు కనీస వేతనం

### మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
### ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రుల ఎదుట నిరసనలు




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అత్యవసర విభాగం ఎదుట చేపట్టిన నిరసన ధర్నా కార్యక్రమం బుధవారం 2వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, యూనిఫాం, భద్రతా పరికరాలు, చెల్లింపుతో కూడిన సెలవులు, ఇతర చట్టబద్ధమైన హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు వాణి, పుష్ప, నర్సింహా, సులోచన, సోమనర్సయ్య, కృష్ణవేణి, లలిత, హేమలత, భరతమ్మ, పద్మ, కలమ్మ, నరేష్ సురేఖ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** వేతన సవరణ ఒప్పందం కాలపరిమితి ముగిసి సంవత్సరం అవుతున్నప్పటికీ వేతనాలు పెరగకపోవటంతో అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, భారతి, కవిత, వెంకటేష్, సానిటేషన్, పేషంట్ కేర్,సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రవీణ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంగన్న, సురేష్, మమత, మాధవి, జ్యోతి, ప్రియాంక, శరద్ పాల్గొన్నారు.

**జోగులాంబ గద్వాల్ :** ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు సరైన జీతాలు, ఇఎస్ఐ, పిఎఫ్ ఇవ్వాలని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు రెండవ రోజు కార్మికులు ధర్నా చేశారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పరుశురాముడు, ఉపాధ్యక్షులు లక్ష్మ ణ్, భాష, మతిన్, అంజి, కన్నా, చిట్టెమ్మ, నాగమ్మ, మహేశ్వరి, శేషన్న, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.




**వేములవాడ టౌన్:** వేములవాడ ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బండారి హరీష్, మారవేణి మహేష్, శ్రీనివాస్, నాగరాజు, మౌనిక, మమత, కృష్ణవేణి, శారదా, కళ, రాజేశ్వరి, రాజేష్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి.నగర్ :** ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం వనస్థలిపురంలో జిజిహెచ్ మహేశ్వరం హాస్పిటల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు భాగ్యమ్మ, శ్యామల, దాసరి కిరణ్, జ్యోతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.












## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించేందుకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని అవంతిపురం, అలగడప కేంద్రాలతో పాటు పట్టణంలోని ఈదులగూడ బూత్‌లను సందర్శించి అక్కడ అందుతున్న ప్రజా సేవలపై ఆరా తీశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, చిరునామాల మార్పునకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను దగ్గరుండి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు కూడా పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం మహిళా సమాఖ్య నిరంతర పోరాటం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో మహిళల హక్కుల కోసం జాతీయ మహిళ సమాఖ్య నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళ సమాఖ్య పట్టణ కమిటిని ఎన్నుకున్నారు. పట్టణకమిటి గౌరవ అధ్యక్షురాలుగా చింతకుంట్ల విజయ, సుందరిపద్మ, పట్టణ అధ్యక్షురాలుగా సింగినం పుల్లమ్మ, ఉపాధ్యక్షురాలుగా కుమ్మరికుంట్ల లత, ప్రధాన కార్యదర్శిగా యల్లావుల ఉమా, కోశాధికారిగా అమరబోయిన వీరమ్మ, కార్యవర్గ సభ్యులుగా సోమగాని వెంకటమ్మ, సింగినం కోటమ్మ, ఎస్‌కె పాతిమా, బంటు లింగమ్మ, పచ్చిపాల నర్సమ్మ, పేరం మంగమ్మ, సయ్యద్ జానీబేగం, జెనిగ కృష్ణవేణి, ఎస్‌కె మహబూబి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ మహిళలు సమానత్వం సాధించేంత వరకు మహిళ సమాఖ్య ఉద్యమిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్, నాయకులు సైదులు, ఇందిరాల రామకృష్ణ పాల్గొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్‌లు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీస్ డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడానికి అత్యంత ఉపయోగపడే వేదికలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ 2026లో పాల్గొనేందుకు యాదాద్రి జోన్ పరిధిలోని నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల పోలీసు అధికారులకు,సిబ్బందికి జోనల్ స్థాయి ఎంపిక పోటీలను బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ పోటీల్లో శాస్త్రీయ దర్యాప్తు సహాయక పద్ధతులు,యాంటీ సబోటేజ్ చెక్,కంప్యూటర్ అవేర్‌నెస్,డాగ్ స్క్వాడ్,ఫోటో వీడియోగ్రాఫీ తదితర విభాగాల్లో పోలీసు అధికారులు,సిబ్బంది తమ ప్రతిభను, వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు.ఈపోటీలను ప్రారంభించి మాట్లాడుతూ పోలీస్ డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడానికి అత్యంత ఉపయోగపడే వేదికలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,ఎస్‌బి డిఎస్‌పి మల్లారెడ్డి,ఏఆర్ డిఎస్‌పిలు శ్రీనివాసులు, నరసింహ చారి,ఆర్‌ఐలు సంతోష్,శ్రీను,హరిబాబు,నరసింహ,సూరపు నాయుడు,పోలీస్ ప్రెసిడెంట్ జయరాజు పాల్గొన్నారు.

## మచ్చయ్య ఆశయ సాధనకు కృషి

సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి సత్యానారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** గువ్వ మచ్చయ్య ఆశయ సాధనకు యువత కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూరు మండలంలోని వర్టూరు గ్రామ శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన గువ్వ మచ్చయ్య 8 వ వర్ధంతి సందర్భంగా మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యంతో కలిసి మచ్చయ్య స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచ్చయ్య సిపిఐ పోరాటాలు, పాటలకు ఆకర్షుడై సిపిఐ క్రియాశీల సభ్యత్వం తీసుకుని వర్టూరులో భూమిలేని,ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం మంగళగడ్డ భూమిని గట్టికొప్పుల లింగయ్య, గువ్వ మచ్చయ్య నాయకత్వంలో గుడిసెల పోరాటం చేసి ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన నాయకులని కొనియా డారు.సిపిఐలో అంచెలంచెలుగా ఉమ్మడి యాదగిరి గుట్ట మండలానికి సిపిఐ మండల కార్యవర్గ సభ్యులుగా ఎదిగి ఆరు సంవత్సరాలుగా మండల కార్యవర్గ సభ్యునిగా పని చేస్తూ అనారోగ్యంతో మరణించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, గ్రామ శాఖ కార్యదర్శి సూదగాని వెంకన్న, మండల సమితి సభ్యులు గువ్వ వెంకన్న, నల్ల రాములు, పల్లె శీను,గట్టికొప్పుల శ్రీకాంత్, గువ్వ పుష్ప, గువ్వ జ్ఞానేశ్వర్,గువ్వ సిద్ధులు, ఆడపు రాం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



# కడుపులోనే లింగ వివక్ష!

స్కానింగ్ ముఠా గుట్టురట్టు

నకిరేకల్‌లో అర్ధరాత్రి పోలీసుల మెరుపు దాడి

ముగ్గురు ఆర్ఎంపీలు అరెస్ట్.. ఇద్దరు పరారీ

అల్ట్రాసౌండ్ యంత్రం స్వాధీనం

జైలుకెళ్లినా మారని నైజం...మళ్లీ పాత దందాలోనే ప్రధాన నిందితుడు

వివరాలను వెల్లడించిన డిఎస్‌పి శివరామిరెడ్డి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** చట్టాన్ని ఉల్లంఘించి గుట్టుచప్పుడు కాకుండా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఓ అక్రమ సిండికేట్ గుట్టురట్టయింది. నకిరేకల్ పోలీసులు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సహకారంతో నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులు పట్టుబడగా, మరో ఇద్దరు పరారయ్యారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డిఎస్‌పి కె. శివరామిరెడ్డి ఈ కేసు వివరాలను వెల్లడించారు.జిల్లా వైద్యాధికారులకు అందిన నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఇళ్లపై ప్రత్యేక బృందం ఆకస్మిక దాడి చేసింది.ఆ సమయంలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, అక్కడున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.దీనిలో ప్రధానంగా పట్టుబడిన వారిలో నకిరేకల్‌కు చెందిన ఆర్ఎంపీ బాతుక యాదగిరి(47),సూర్యాపేట మండలం చెందిన జాల జాన(53),కేసారం గ్రామానికి చెందిన జీలుగుల భరత్(36) ఉన్నారు. సోలిపేటకు చెందిన వల్లపు ప్రశాంత్,నల్లగొండకు చెందిన కత్తి కనకాల రెడ్డి పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.ప్రధాన నిందితుడైన బాతుక యాదగిరి గతంలోనూ ఇదే తరహా కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లాడు.అయినా బుద్ధి మార్చుకోకుండా,జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కాన్నింగ్ యంత్రాన్ని సమకూర్చుకుని దందాను మొదలుపెట్టాడని ఆయన తెలిపారు. వివిధ ప్రాంతాల ఆర్ఎంపీలు, మధ్యవర్తులతో ఓ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని,గర్భిణులను ఆకర్షించి రహస్యంగా పరీక్షలు చేస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ కేసులోరూ. లక్షల విలువైన యంత్రం సీజ్ సెట్ చేశారు.పరీక్షలకు ఉపయోగిస్తున్న రూ. లక్షల విలువైన మోడల్ డిజిటల్ అల్ట్రాసౌండ్ ఇమేజింగ్ సిస్టమ్,ప్రోబ్, పవర్ కార్డ్,అల్ట్రాసౌండ్ జెల్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ మేరకు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మెడికల్ యాక్ట్ కింద గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమాలు జరుగుతుంటే ప్రజలు వెంటనే పోలీసులకు లేదా వైద్యాధికారులకు సమాచారం అందించాలని కోరారు. కాగా, పకడ్బందీగా ఈ కేసును ఛేదించిన నకిరేకల్ సీఐ వై హరిబాబు,రాజశేఖర్,ఎస్‌ఐలు వీరబాబు,కృష్ణచారి, సిబ్బంది జనార్ధన్,నాగార్జున, శ్రీనయ్య వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారని ఆయన తెలిపారు.



## పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, గ్రామ రహదారి పనులు, పాఠశాల భవన నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామంలోని రోడ్ల నిర్మాణం పనులను వేగవంతం చేసి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పాఠశాల భవనం,పాఠశాలలో కమ్యూనిటీ సానిటరీ,నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతా రెడ్డి,హౌసింగ్, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తం

'జూనోసిస్ డే' వేడుకల్లో మేయర్, కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** జంతువుల నుండి మనుషులకు,మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.జూనోసిస్ డే సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా పశు వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబిస్, జపనీస్ ఎన్సెఫలైటిస్,బ్రుసెల్లోసిస్,బర్డ్ ఫ్లూ,లెప్టోస్పిరోసిస్,టీనియాసిస్ వంటి జూనోటిక్ వ్యాధులు జంతువుల ద్వారా వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమని,పిచ్చికుక్క కాటు వల్ల ఇది సంక్రమిస్తుందని పేర్కొన్నారు. కుక్కల జనాభా నియంత్రణకు పెంపుడు, వీధి కుక్కలకు జంతు జన నియంత్రణ శస్త్రచికిత్సలు అవసరమన్నారు.ప్రస్తుతం నల్లగొండలో ఎబిసి కేంద్రం పనిచేస్తుండగా,మిర్యాలగూడ,దేవరకొండలోనూ ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అమీర్,అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాహుల్,రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పరిశీలకులు శామ్యూల్ జాన్,జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వి.రమేష్,అసిస్టెంట్ డైరెక్టర్లు,వెటర్నరీ సర్జన్లు, పారా వెటర్నరీ సిబ్బంది,జంతు ప్రేమికులు,పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

**సర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరం**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 15 లక్షల 16 వేల 253 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 15 లక్షల 12 వేల 548 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయగా,ఇప్పటివరకు 99.76 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాలను కూడా త్వరలో పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు.ఇప్పటివరకు సుమారు 33.58 శాతం ఫారాలను తిరిగి స్వీకరించామని, ఇంకా సుమారు 66 శాతం ఫారాలను సేకరించాల్సి ఉందన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం




ఎఐటియుసి జిల్లా 11వ మహాసభలు జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, కార్మిక వ్యతిరేక విధానాల ఉపసంహరణ వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ నెల 19న గుర్రంపోడ్‌లో నిర్వహించనున్న ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభలను కార్మికులు,ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 107 సంవత్సరాలుగా దేశంలోని కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న అతిపెద్ద కార్మిక సంఘం ఎఐటియుసి అని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికుల హక్కులను బలహీనపరుస్తోందని విమర్శించారు.ఈ డిమాండ్ల సాధన కోసం జరిగే జిల్లా మహాసభల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని దేవేందర్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాధుల లెనిన్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎం.నందం,ఎండీ జానీ,సహాయ కార్యదర్శి పెద్ది నాగరాజు, బాసాని వెంకటయ్య, పూల చంద్రమౌళి,సైదులు,వెంకటయ్య, సత్తయ్య, యాదయ్య,శంకరయ్య,నారాయణ,చంద్‌పాషా పాల్గొన్నారు.

# పక్కాగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల సంఖ్య 1200 దాటితే అక్కడ అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి 2 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఆయా ప్రాంతాల్లో కొత్త పోలింగ్ స్టేషన్ అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పేర్ల సవరణ, ప్రదేశాల మార్పు, కొత్త కేంద్రాల ఏర్పాటు అనే మూడు అంశాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

**షెడ్యూల్ ప్రకారం పనులు...** పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించి క్లియర్ కట్ షెడ్యూల్ ఉందన్నారు. జూలై 24న కొత్త కేంద్రాల ప్రతిపాదనలు పంపబడుతాయని కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి లభించిన పిమ్మట, జూలై 31న కొత్త కేంద్రాలతో కూడిన డ్రాఫ్ట్ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సూచనలు, అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. తహశీల్దార్, ఆర్‌డిఓ స్థాయిల్లో జరిగే సమావేశాలకు మండల, నియోజక వర్గ స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరై తమ సూచనలు, అభ్యంతరాలు తెలుపాలని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, వివిధ పార్టీల ప్రతినిధులు సిహెచ్ రాజశ్వేరరావు, కోట గోపి, పి. స్టాలిన్, అజిత్, చల్లమల్ల నరసింహ, సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, రమేష్, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరోసారి భగ్గుమన్న వర్గ విభేదాలు..

రాళ్ళు, కర్రలతో ఇరువర్గాల దాడులు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** తుంగతుర్తి నియోజక వర్గంలోని అర్వపల్లి మండల కేంద్రంలో మరోమారు వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇటీవల నియామకం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎన్నికల్లో తమతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఎమ్మెల్యే మందుల సామేల్ ఏకపక్ష దోరణి వ్యవహరించారని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వర్గీయులు పార్టీ సమావేశాలు నిర్వహించి గాంధీభవన్ వరకు వెళ్లాలని సమావేశం కూడా నిర్వహించుకున్నారు. బుధవారం ఉదయం గాంధీ భవన్‌కు వెళ్లాలనుకున్న ఎంపి వర్గీయులను ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ప్రారంభమైన మాటల యుద్ధం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఒకరిపై ఒకరు రాళ్ళు, కర్రలు విసురుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వర్గాని చెదరగొట్టారు. కొంతమంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారిగా దాడులు జరగడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. జంక్షన్ వద్ద ఉన్న షాపులు వారు భయంతో స్వచ్ఛందంగా బంద్ చేసుకొన్నారు. ఈ దాడిలో ఇరు వర్గాలకు చెందిన రెండు కార్లు ధ్వంసమైయ్యాయి.



## కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం బుధవారం ఏఐటీయూసీ చందంపేట ఉమ్మడి మండల మహాసభ నాగిళ్ల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఉప్పునూతల వెంకటయ్యలు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఏఐటీయూసీ ఆవిర్భించిందని, నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యల పై నిరంతరం పోరాటాలు నడుపుతుందని, కనీస వేతనాల చట్టం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, ఏఐటీయూసీ పోరాటాల వల్లే వచ్చిందని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడి దారులు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. ఈసమావేశంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్‌రాములు, మల్లయ్య, శ్రీను, చంద్రయ్య, వెంకటయ్య, శ్రీను, అంజమ్మ, సుగుణమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యాసంస్థల బంద్ : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/చింతపల్లి :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రి పదవి కేటాయించపోవడం దుర్మార్గమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి 27వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేల పాఠశాలలకు తగ్గిస్తామని చెప్పడం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగమేనన్నారు. ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి, పుస్తకాలు, యునిఫామ్‌లు విక్రయిస్తూ దోచుకుంటున్నారని, వీటిని నియంత్రించకపోతే ఆయా పాఠశాలలపై దాడులు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. రేపు నిర్వహించే బంద్‌కు విద్యా సంస్థలు సహకరించాలని మురళీకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్‌కె శంశొద్ధిన్, మహేష్, చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## సర్వోత్తమ్‌ను కలిసిన సహకార సంఘ కార్యవర్గం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నూతనంగా ఎన్నికైన చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ కార్యవర్గం బుధవారం ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పట్టణంలోని వైట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లను సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షులు గందూరి రమేష్, ఉపాధ్యక్షులు చిలివేరు నరసింహారావు, కార్యదర్శి భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముషం హరిప్రసాద్, డైరెక్టర్లు ముషం యాదమ్మ, విడం నీరజ, పెద్ది శ్రీనివాస్, యలగందుల లక్ష్మయ్య, యలగందుల సాయినేతలను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాలని సర్వోత్తమ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడారి బిక్షం, బాల్నె మల్లయ్య, యలగందుల సుదర్శన్, దూలం నగేష్, రాములు పాల్గొన్నారు.

## పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్‌లు, గ్రామసచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృ జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింక్ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగునీటి సరఫరా ర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్ధేశం చేశారు.దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సమగర ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకెళితే పల్లెలన్ని సంపూర్ణ ప్రగతితో వికసిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సర్పంచ్‌లు, గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'సర్' ప్రక్రియ

అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



ప్రజాపక్షం/కుంటాల : ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆదేశించారు.మండలంలోని అందకూర్ ,అంబకంటి గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజలు ఎన్యుమరేషన్ పత్రాలను తప్పులు లేకుండా పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓ లకు నిర్ణీత గడువు ఈ నెల 24 లోపు అందజేయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో ఉన్న అప్పటి వివరాలు మాత్రమే ఎన్యుమరేషన్ పత్రాలలో పూరించాలని సూచించారు.2002 లో ఓటు హక్కు లేనివారు తమ తల్లి,తండ్రి,తాత ,అమ్మమ్మ,నానమ్మల వివరాలతో రాయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కమల్ సింగ్ ,డీటీ కార్తీక్ రెడ్డి ,పంచాయతీ కార్యదర్శులు సుమన్ ,భోజన్న,తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల రీ సర్వేను ఆపాలి

ప్రజా పక్షం/పెంబి : అటవీ శాఖ అధికారులు పోడు భూముల రీ సర్వేఋ ఆపాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తెలంగాణ రైతు కుల సంఘం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ లక్ష్మణులకు వినతి పత్రం అందజేశారు.ఇప్పటికే ఆదివాసులు సాగు చేస్తున్న కొన్ని పోడు భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇచ్చిందన్నారు.ఆ భూములలో అటవీశాఖ అధికారులు రీ సర్వే చేపట్టి పొరకలు పొదలు పెరిగిన భూములకు హద్దులు పెట్టి ఆ భూములను గుంజుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఈ సర్వేను ఆపాలని కోరారు.ఆదివాసులకు పట్టాలు రాని భూములను సర్వే చేసి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రజా సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ దుర్గం నూతన్‌కుమార్ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడ సం శంభు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఠాకూర్, గిరిజన సంఘం నాయకులు నిర్మలబాయి ,ఉపసర్పంచ్ కొమరం ,తగ్గు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగుల నర్సాగౌడ్ ,గిరిజనులు పెంద్రం దత్తు ,కేంద్రం జంగు చాకటి, జంగు బాపు ,కార్లే భీమ్రావు, పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలను నిషేధించాలి



ప్రజాపక్షం/మంచిర్యాల : రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను నిషేధించాలనే డిమాండ్‌తో ఈ నెల 10న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాలలో బంద్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఎస్ఆర్, శ్రీ చైతన్య, నారాయణ, అల్ఫోర్స్ లాంటి సంస్థలు ఫీజుల రూపంలో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ, విద్యాహక్కు చట్టాలను అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, ఆదిత్య, విఘ్నేష్, మణి తేజ్, జామీర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సవరణలో నిర్లక్ష్యం తగదు

వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్

ప్రజాపక్షం/మెదక్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నింపాలని మెదక మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆజంపుర ప్రాంతంలోని 9,26వ వార్డుల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని ఆయన పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉంటే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సరిచేయాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే సంబంధిత బీఎల్‌ఓలను లేదు ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాహెర్,కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఫాజిల్, మహ్మద్ అంజద్, సయ్యద్ ఒమర్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/జన్నారం: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను జన్నారం మండల తహసిల్దార్ బక్కయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పొనకల్ గ్రామంలోని భవిత వనరుల కేంద్రం, మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.కవ్వాల్ గ్రా మంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఎంపి గొడం నగేష్

ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణం కాపువాడలో రూ.50 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కే హరిత, సిర్పూర్ శాసనసభ్యుడు పాల్వాయి హరీష్ బాబు, శాసనమండలి సభ్యుడు దండే విఠల్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కామ్డే అనిల్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాల ద్వారా సమాజంలో మార్పు తీసు కురావచ్చని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయో గపడ తాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ విషయాలతో పాటు ప్రాచీన భారతీయ చరిత్ర పుస్తకాలు ఇక్కడ లభిస్తాయని పేర్కొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. స్థానిక అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఓటరూ 'సర్'లోపాల్గొనాలి

ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎస్ఐఆర్ లో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అ న్నారు. బు టధవారం పట్టణంలోని బోధన్ రోడ్డులోని ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన సర్ అవగాహన సదస్సులో తెలంగాణ షబ్బీర్‌అలీ, తాహెర్‌బిన్ హందాన్, మౌలానా జాఫర్ పాషా, మౌలానా షౌజమాలు రహమాన్ ము ఖ్యఅతిథిగా హాజరు కాగా షబ్బీర్ అలీ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్క రూ తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో వెంటనే పరిశీలించి అవసరమైతే నమోదు, సవరణ, ధృవీకర ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును కాపాడుకోవటంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమేనన్నారు.నగర మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ ఫహీమ్, పాప, ముజాహిద్‌ఖాన్, హరూన్‌ఖాన్, కరీం, మహ్మద్ భారీ, రత్నాకర్, జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

బాలికలపై లైంగిక నేరాలకు శిక్షలు తప్పవు,ఎస్పి డా.జి.జానకి షర్మిల, ఐపిఎస్



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : 2022 సంవత్సరంలో కుబీర్ మండలం నిగ్వ గ్రామానికి చెందిన బనెల్లి విఠల్ అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన 09 ఏళ్ల బాలికకి చాక్లెట్ల ఆశ చూపి,ఆ బాలిక తో అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘోర ఘటనపై కుబీర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తరువాత, ఈరోజు నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు – ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో గౌరవ న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి,నిందితుడికి 20 సంవత్సరాల జైలుశిక్ష విధించడంతో పాటు రూ. 10,000/జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరని ఎస్పీ తెలిపారు.నిర్మల్ పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుం టూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టటానికి నిర్మల్ పోలీసులు కృషి చేస్తున్నారు.నిందితుడి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి, విచారణ అధికారులు సాయి కిరణ్,ఐపీఎస్, ఎస్ఐ షరీఫ్,కోర్టు డ్యూటీ ఆఫీసర్ అయిన శ్రీనివాస్,లైజెనింగ్ ఆఫీసర్స్ అయిన రమేష్ ఎస్ఐ,ప్రభాకర్ HC,లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కుటుంబ సభ్యుల చేతిలో హత్యకు గురైన హరి

జిల్లాలో దారుణం

ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్య కొడుకు చేతిలో హత్యకు గురయ్యారు ఓ వ్యక్తి. న్యాల్‌కల్ ఘటన మరువక ముందే అదే మండలంలో మంగళవారం రాత్రి హత్య జరగటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మోపాల్ మండలంలోని అ మ్రాబాద్ జీపీ పరిధిలోని కోక్యానాయక్ తండాకు చెందిన బానోత్ హరి (50) నిత్యం మద్యం తాగి కుటుంబ సభ్యులను వేధించే వాడు. మంగళవారం రాత్రి ఇదే విషయంలో గొడవ జరగగా కుటుంబ సభ్యులు భార్య, కొడుకు కలిసి గొంతు పిసికి హత్య చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు సిఐ సురేష్‌కుమార్ తెలిపారు.

# 'శ్రీనిధి నిధులపై ముసురుకున్న మిస్టరీ' రూ.25 లక్షల డ్వాక్రా సొమ్ము స్వాహా?

ఆర్‌పి చేతిలో మోసపోయామంటూ కలెక్టర్‌కు మహిళల ఫిర్యాదు

ప్రజా పక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో డ్వాక్రా మహిళా సంఘాలకు సంబంధించిన శ్రీనిధి నిధుల వ్యవహారం రోజురోజుకూ తీవ్ర దుమారం రేపుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ నిధుల చుట్టూ ఇప్పుడు పెను మిస్టరీ ముసురుకుంది. నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి కాలనీకి చెందిన 'సరస్వతి డ్వాక్రా గ్రూప్' నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నమ్మకంగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) కవితనే తమను నిలువునా ముంచేసిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలిసి బాధితులు కన్నీరుమున్నీరవుతూ వినతిపత్రం అందజేశారు. సంతకాలు ఫోర్జరీ చేసి రూ.25 లక్షలు డ్రా..! బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సరస్వతి డ్వాక్రా గ్రూప్‌నకు శ్రీనిధి ఆర్పీగా పనిచేస్తున్న కవిత, గ్రూప్ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వారి సంతకాలను ఫోర్జరీ చేసి విడతల వారీగా దాదాపు రూ. 25 లక్షల నిధులను డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడింది. తాము తీసుకున్న రుణాల సొమ్మును సక్రమంగానే చెల్లిస్తున్నామని భావించిన మహిళలకు, ఇటీవల బ్యాంకు అధికారుల నుంచి రికవరీ నోటీసులు రావడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ నోటీసుల ఆధారంగా రికార్డులను పరిశీలించగా, తమకు తెలియకుండానే ఇంత పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పట్టినట్లు వెలుగు చూసింది. మానసిక ఆందోళనకు గురవుతున్నామని వారు కలెక్టర్ ఎదుట వాపోయారు.గతంలో ఇలాంటి ఆర్థిక అవకతవకలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేవలం కార్యాలయాల ఫైళ్లకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నా యి.




## ఆదర్శ టూరిజం సర్క్యూట్‌గా మెదక్

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలోని చారిత్రాత్మక, వారసత్వ ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర డీపీఆర్ రూపొందించలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో టూరిజం, పురావస్తు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయ అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక శాఖ మంజూరు చేసిన రూ.7 కోట్లతో కాటేజీల నిర్మాణం, టెంపుల్ మాస్టర్ ప్లాన్ ను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు.పురావస్తు, పర్యాటక శాకల సమన్వయంతో మౌలిక వసతులు కల్పించి, మెదక్ ను రాష్ట్రంలోనే ఆదర్శటూరిజం సర్క్యూట్ గా తీర్చిదిద్దేందుకు పటిష్ట కార్యాచరణ చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్, టూరిజం ప్రతినిధులు రామకృష్ణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ శ్రీశైలం, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

## ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్లు నిర్మించి ప్రాణాలు కాపాడాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలోని జాతీయ రహదారి 44 పై రామాయంపేట సమీపంలోని ఆద్య హోటల్ జంక్షన్, దామర చెరువు బైపాస్ వద్ద ఫ్లైవర్లు, అండర్ పాస్ నిర్మించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రడ్డి డిమాండ్ చేశారు. గత ఐదు నెలల్లో ఈ ప్రాంతంలోని 45 రోడ్డు ప్రమాదాలు జరిగి 35 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారని తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు వెంటనే సాంకేతిక సర్వే నిర్వహించి ఫ్లైఓవర్ లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు పార్టీ నేతలతో కలిసి వినతిపత్రం అందజేసి,ఈ సమస్యలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించకపోతే స్థానిక ప్రజలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, జుబేర్ అహ్మద్ తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టం వల్ల రైతులకు అద్భుత ప్రయోజనాలు

ప్రజాపక్షం/మెదక్ : భూభారతి చట్టం వల్ల రైతులకు అద్భుత ప్రయోజనాలు కలవని ఈ ప్రక్రియ మెదక్ జిల్లాలో అత్యంత పారదర్శకంగా జరగాలని భూభారతి సభ్యుడు సునీల్ కుమార్ స్పష్టతనిచ్చారు. మెదక్ జిల్లాలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ సంబంధిత ఆర్డీఓలు, తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దారులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లకు భూభారతి చట్టంపై సుదీర్ఘంగా భూభారతి సభ్యుడు సునీల్ కుమార్ అవగాహన కల్పించారు. భూవివాదాలకు చెక్ పెట్టేందుకు, రైతులకు పారదర్శక సేవలు అం దించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ప్ర క్రియపై రెవెన్యూ యంత్రాంగం సుదీర్ఘ అవగాహ న అవసరమని స్పష్టం చేశారు. రైతుల భాగస్వామ్యంతో రీసర్వే సమయంలో రైతులు తమ భూ ములను చూపించి, హద్దురాళ్ళు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో భూ తగాదాలు రా కుం డా నివారించవచ్చు అని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో (రోవర్స్) ప్రతి భూమి యొక్క సరిహద్దులను పక్కాగా నమోదు చేసి డిజిటల్ మ్యాపింగ్ చేస్తున్నట్లు వివరించారు. పేర్ల తప్పులు, విస్తీర్ణం తేడాలు, వివాదాలను పరిష్కరించి, భూమి రికార్డులను పారదర్శకంగా భూభారతి పోర్టర్ లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, సర్వే ప్రాముఖ్యత గురించి చట్టాలపై సుదీర్ఘ వివరాణతో జిల్లాలో రీ సర్వే ప్రక్రియ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# నేడు జాన్కంపేట్ నూతన గూడ్స్ ప్రారంభం

జాతికి అంకితం చేయనున్న ఎంసి అరవింద్

ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ నగర ప్రజలకు, రైల్వే ప్రయాణికులకు దశాబ్దాలుగా వేదిస్తున్న ట్రాఫిక్, వాయు కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి గూడ్స్ రవాణాను పూర్తిగా జాన్కంపేట్ గూడ్స్ షెడ్డుకు తరలించేందుకు ఎంపీ అరవింద్ ధర్మపురి చేసిన కృషి ఫలితంగా నూతన గూడ్స్ షెడ్ నిర్మాణం పూర్తయింది. ఈ అత్యాధునిక గూడ్స్ షెడ్డును నేడు ఎంపీ అరవింద్ ధర్మపురి జాతికి అంతిం చేయనున్నారు. ఈ శుభపరిణామంతో ఇకపై గూడ్స్ లోడింగ్, అన్‌లోడింగ్ పనులన్నీ జాన్కంపేట్ నుంచే జరగనున్నాయి. ఇంత వరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లోని నాలుగో ట్రాక్ మీదుగా గూడ్స్ రైళ్ల ద్వారా సరుకుల రవాణా జరుగుతూ ఉండేది. దీనివల్ల నిత్యం వందలాది భారీ లారీలు నగరంలోకి రావడం, పోవడం వల్ల తీవ్ర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడేవి. అంతేగాకుండా విపరీతమైన వాయు, ధూళి కాలుష్యం కారణంగా చుట్టు పక్కల కాలనీల ప్రజలు, రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన ఎంపీ అరవింద్ ధర్మపురి.. దక్షిణ మధ్య రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి, గూడ్స్ షెడ్డును జాన్కంపేట్‌కు మార్చాలని కోరారు. ఆయన పట్టుదల ఫలితంగా ఈ నూతన షెడ్ రూపుదిద్దుకుంది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు జాన్కంపేట్ వద్ద ప్రత్యేకంగా కొత్త ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రెండు నెలల క్రితమే ఇక్కడ నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది.ఇకపై నిజామాబాద్ జిల్లాకు ఇతర రా ష్ట్రాల నుంచి వచ్చే, అలాగే ఇక్కడి నుంచే వెళ్లే యూరియా, బియ్యం, మక్కలు వంటి ఇతర వస్తువుల లోడింగ్, అన్‌లోడింగ్ పక్రియ అంతా జాన్కంపేట్ స్టేషన్ నుంచే సాగనుంది. గూడ్స్ రైళ్లు పూర్తిగా జాన్కంపేట్‌కు మళ్లడం వల్ల నిజామాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల రైళ్ల రాకపోక ల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా సమయపాలన పాటించే వీలుంటుందని, భారీ లారీల రాక నిలిచిపోవడంతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు, కాలుష్యం పూర్తిగా తగ్గుముఖం పట్టనున్నాయని పలువురు పేర్కొంటున్నారు. నేడు ఎంపీ అరవింద్ ధర్మపురి చేతుల మీదుగా జరగనున్న ఎమ్మెల్సీలు మహేష్ కుమా ర్ గౌడ్, అంజిరెడ్డి, కొమరయ్య, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో పాటు రైల్వే ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.




## సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో అవగాహన

జిల్లా ఎస్‌పి డి వి. శ్రీనివాసరావు



ప్రజాపక్షం/కొల్చారం : కొల్చారం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు బుధవా రం సందర్శించారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్, బీట్ వ్యవస్థ, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్ల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి గ్రామంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, రౌడీ షీటర్లు, అనుమానితులపై నిరంతర నిఘా కొనసాగించలని ఆదేశించారు.అలాగే బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కనాటి, కిట్ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా కానిస్టేబుల్ శ్రీలేఖను రివార్డుతో అభినందించారు.డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
09-07-2026
www.prajapaksham.in

"వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న చిత్రం రెగ్యులర్ గా షూటింగ్ జరుపుకుంటోంది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి."

రీల్



## కోర్ట్ డ్రామా 'డ్యూడేట్' షూటింగ్ షురూ

జర్నలిస్ట్‌గా తెలుగు సినీ పరిశ్రమలో అందరికీ సుపరిచితుడైన ఏలూరు శ్రీను నిర్మాతగా మారుతూ, మరో నిర్మాత పవన్ తరిగోపులతో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'డ్యూ డేట్' చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు బుధవారం హైదరాబాద్‌లో పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగాయి. వర్షిష్ స్టూడియోస్ పతాకంపై నంద్.కె. దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా హీరో లోమేష్ పూడి పెద్ది, హీరోయిన్ జయశ్రీ, తో పాటు కీలక పాత్రల్లో కనిపించబోతున్న ప్రణీత పట్నాయక్, చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు మారుతి క్లాప్ నివ్వగా, సక్సెస్ఫుల్ నిర్మాత బన్నీ వాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఇటీవల సక్సెస్‌లకు కేరాఫ్ అడ్రస్‌లకు మారిన నిర్మాతలు ఎస్కేఎన్, ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటిలు చిత్ర దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు, దర్శకుడు విజయ్ కనకమేడల, విఐ ఆనంద్లతో పాటు పలువురు దర్శకులు, నిర్మాతలు పాల్గొన్నారు. ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుందని, షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాతలు తెలిపారు. లోమేష్ పూడిపెద్ది, జయశ్రీ, ప్రణీత పట్నాయక్, , చందు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీఓపీ: చెంచు జింక, నిర్మాతలు పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను, దర్శకత్వం: ఆనంద్.కె.

## తెలంగాణ విలేజ్ స్టోరీ 'మారెమ్మ'

### సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో మాధవ్



రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆరట్స్ బ్యాన్ప ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి ప్రశాంత్ ఆర్ విహారి మ్యూజిక్ అందిస్తున్నారు. తాజాగా మేకర్స్ మారి సాంగ్ ని లాంచ్ చేశారు.ఈ పాటకు మిట్టపల్లి సురేందర్ అందించిన సాహిత్యం ఆకట్టుకుంది. మంగ్లీ వోకల్స్ మరో ఆకర్షణగా నిలిచింది.సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో మాధవ్ మాట్లాడుతూ సినిమా మొత్తం రెడీ అయిపోయింది. ఈ నెలాఖరులో విడుదల చేయాలని అనుకుంటున్నాం. త్వరలోనే ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం. సినిమా చాలా బాగా వచ్చింది. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను అన్నారు. నిర్మాత మయూర్ రెడ్డి బండారు మాట్లాడుతూ ఈ సినిమా తెలంగాణ నేటి తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కింది. నాగరాజు ఈ కథ చెప్పగానే మా ఊరి నేపథ్యం మొత్తం నాకు గుర్తొచ్చింది. ఈ సినిమాలోని ప్రతి పాత్ర కూడా ఎవరో ఒకరిని గుర్తు చేసింది. మొన్న జాతరకు వెళ్లినప్పుడు మా సినిమాలో ఉన్న చాలా సన్నివేశాలు అక్కడ కళ్లకు కట్టినట్టు కనిపించాయి. ఈ సినిమాలో ఒక నిజమైన తెలంగాణ పల్లెటూరిని, అక్కడి మనుషులను, వారి జీవన విధానాన్ని చూస్తారు. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఇందులో వచ్చే పాటలన్నీ కథలో భాగంగానే ఉంటాయి. ప్రశాంత్ ఆర్ విహారి అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. ఈ సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. విడుదలకు సిద్ధంగా ఉన్నాం. తెలుగులో ఇది చాలా కొత్త స్క్రీన్‌ప్లే ఉండే సినిమా. 'మారి' పాటలో తమోగ్న, సర్కార్ ఇద్దరూ చాలా బ్యూటిఫుల్గా చేశారు. మంగ్లీ కూడా అద్భుతంగా పాడారు. అలాగే మిట్టపల్లి సురేందర్ చెప్పారు. హీరోయిన్ దీపా బాలు, ఎడిటర్ సాయిబాబు, సినిమాటోగ్రాఫర్ ప్రశాంత్ అంకిరెడ్డి , చైల్ ఆర్టిస్ట్ తమోఙ్ఞ, చైల్ ఆర్టిస్ట్ సర్కార్ పాల్గొన్నారు.



## అనిల్ షూటింగ్‌లో వెంకటేష్ బిజీబిజీ

వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న చిత్రం రెగ్యులర్ గా షూటింగ్ జరుపుకుంటోంది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కల్యాణ్ రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఒక పాట షూటింగ్ను చిత్ర బృందం ఇటీవల పూర్తి చేసింది. ఈ సినిమా మొదటి షెడ్యూల్లో కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ షూటింగ్ సెట్లో చేరారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంతో కూడిన కీలక సన్నివేశాలను భారీ సెట్లో చిత్రీకరిస్తున్నారు. వెంకటేష్, కీర్తి సురేష్, కృతి శెట్టిలతో కలిసి కల్యాణ్ రామ్ కూడా ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారు. వెంకటేష్, కల్యాణ్ రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి ఆకట్టుకునే ఆన్‌స్క్రీన్ అనుబంధం, అనిల్ రావిపూడి మార్కు వినోదానికి చక్కగా సరిపోతుంది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్గా వ్యవహరిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా పని చేస్తున్నారు.

## 'మేము కూడా సినిమా తీసినామురో' సాంగ్ లాంచ్



సినిమా పట్టణంలోనే కాదు పల్లెపల్లెనా ఉంటుందని నిరూపిస్తూ కొత్త దర్శకుడు అజర్ లోకల్ టాలెంట్ తో స్థానికంగా రూపొందించిన సినిమా 'కొత్త సినిమా'. ఈ సినిమాతో వంద మంది న్యూ టాలెంట్ టాలీవుడ్ కు పరిచయం కావడం విశేషం. సురేశ్, రాకేష్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఈ చిత్రానికి అజర్ స్టోరీ స్క్రీన్ ప్లే డైరెక్షన్ తో పాటు డైలాగ్స్, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహమ్మద్ వాసిమ్ అక్రమ్, సాగి సుధీర్ రావు, యడండ్ల సతీష్ యాదవ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా కోసం చరణ్ అర్జున్ లిరిక్స్ రాసి కంపోజ్ చేసిన 'మేము కూడా సినిమా తీసినామురో..' పాటను ఈ రోజు హైదరాబాద్ లో ఘనంగా లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, దర్శక నిర్మాత మశ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయిలు కంపాటి, నటుడు సాగర్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు సురేశ్ మాట్లాడుతూ మాది గోదావరిఖని దగ్గర మార్కండేయ కాలనీ. నేనొక కిరణా షాప్ నడుపుకుంటూ ఉంటాను. నాకు సినిమాల మీద ఇష్టం ఉండేది. అజర్ గారు ఆడిషన్స్ కోసం మా గోదావరిఖని వచ్చినప్పుడు నేనూ వెళ్లాను. వెనక నిలబడే చిన్న పాత్ర దక్కితే చాలు అనుకున్నాను. కానీ ఈ సినిమాలో నాకు లీడ్ రోల్ ఇచ్చారు. అన్నారు. ప్రొడ్యూసర్ మహమ్మద్ వాసిమ్ అక్రమ్ మాట్లాడుతూ టైటిల్ కు తగినట్లే మా సినిమా నిజంగా కొత్తగా ఉంటుంది. మీరంతా థియేటర్స్ లో చూసి ఆదరించాలని కోరుతున్నా అన్నారు.ప్రొడ్యూసర్ యడండ్ల సతీష్ యాదవ్ మాట్లాడుతూ మా కొత్త సినిమా సాంగ్ లాంచ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మా సినిమాను ఒక సరి కొత్త కంటెంట్ తో లోకల్ టాలెంట్ అజర్ అందరికీ నచ్చేలా రూపొందించాడు. త్వరలోనే మా సినిమాను రిలీజ్ కు తీసుకొస్తాం. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ .తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' 'హృదయం మురళి' చిత్రం రిలీజ్



అథర్వా, ప్రీతి ముకుందన్, కయదూ ప్రధాన పాత్రల్లో ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హృదయం మురళి. ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషించారు. థమన్ ఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందించడంతో పాటు కీలక పాత్రలో నటించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం జూలై 10న తెలుగులో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్లో హీరో అథర్వా మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు చూపించే ఆదరణ చాలా అద్భుతం. నా గత చిత్రాలకు ఎంతో ప్రేమను అందించారు. 'హృదయం మురళి' స్పెషల్ సినిమా. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడి పనిచేశాం. ఈ సినిమా అందరూ రిలేట్ అయ్యే సినిమా. వన్సైడ్ లవర్స్ ఈ సినిమాతో చాలా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. ప్రతి ఒక్కరి మనసుకు దగ్గరగా ఉండే సినిమా ఇది. జూలై 10న సినిమా విడుదల అవుతోంది అని అన్నారు. ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ ఇందులో చాలా నాస్టాల్జిక్ మూమెంట్స్ ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని మేము నమ్ముతున్నాం అని చెప్పారు. కయాదుతో మేము గతంలో 'డ్రాగన్' సినిమా చేశాం. అది బ్లాక్‌బస్టర్ అయింది. ఇప్పుడు ఈ సినిమా విజయం సాధిస్తుంది. అలాగే తమన్ గారు సంగీతం అందించడంతో పాటు ఇందులో నటించడం కూడా ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణ. కచ్చితంగా ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం.

## రామ్ చిత్రానికి సామ్ మ్యూజిక్



రామ్ హీరోగా నటిస్తూ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది.ఈ సినిమా షూటింగ్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఖైదీ, పుష్ప 2, మహా అవతార్ నరసింహ వంటి చిత్రాలకు అదిరిపోయే సౌండ్ ట్రాక్స్ అందించిన సామ్ సిఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ కథను స్వయంగా రామ్ పోతినేని రాశారు. నియోనోయర్ బ్యాక్డ్రాప్లో సాగే సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్గా దీనిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని విభిన్న అంశాలను, ఈ చిత్రం ఉండబోతోంది.దర్శకత్వం, కథతో పాటు కథానాయకుడిగానూ నటిస్తున్న ఈ చిత్రంలో రామ్ కెరీర్లోనే అత్యంత సవాల్తో కూడిన పాత్రను పోషించబోతున్నారు.ఈ చిత్రంలోని కీలక పాత్రల కోసం పలువురు ప్రముఖ నటీనటులను ఎంపిక చేస్తున్నారు.జాతీయ అవార్డు గ్రహీత తిరునావుకరసు (తిరు) సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హైన్ యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు.

## జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు 10 లోపు దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు2026' కు సంబంధించి రాష్ట్రం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అందిన స్వీయ నామినేషన్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని పాఠశాల విద్యాశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అర్హత గల ఉపాధ్యాయులు ఈ నెల 10వ తేదీ లోపు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాల పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారు తమ పూర్తి వివరాలతో కూడిన తుది దరఖాస్తులను ఈనెల 13వ తేదీ లోపు తప్పనిసరిగా సమర్పించాలని విద్యా శాఖ సూచించింది. అర్హులైన ఉపాధ్యాయులు వెంటనే స్పందించి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జూలై 13వ తేదీ తర్వాత అవార్డుల పోర్టల్‌ను మూసివేస్తారని విద్యాశాఖ తెలిపింది. ఈ పురస్కారాలకు సంబంధించిన అర్హత ప్రమాణాలు, పూర్తి షెడ్యూల్, ఇతర వివరాలను http://national award stoteachers .education.gov.in పోర్టల్‌లో చూడవచ్చని తెలిపింది.



## విద్యార్థి మృతి

(మొదటి పేజీ తరువాయి)

జలపాతానికి వెళ్ళారు. అక్కడి నుండి తిరుగు ప్రయాణంలో మాసాలోద్ది జలపాతానికి చేరుకున్నారు. జలపాతం వద్ద ఫోటోలు దిగుతున్న సమయంలో వైభవ్ కుమార్ కాలుజారి లోతైన నీటిలో పడిపోయాడు. గమనించిన స్నేహితులు, స్థానిక యువకులు వెంటనే గాలింపు చేపట్టి సుమారు అర గంట తర్వాత నీటిలో నుండి బయటకు తీశారు. క్షతగాత్రుడిని తొలుత వాజేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్య సిబ్బంది అత్యవసరంగా సిపిఆర్ నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంకటాపురం సిఐ ముత్యం రమేష్, ఎస్ఐ జక్కుల సతీష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైభవ్ కుమార్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు శోభస ంద్రంలో మునిగిపోయారు. వర్షాకాలంలో జలపాతాలకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రక్షణ సిబ్బందిని నియమించడం, లోతైన ప్రాంతాల్లోకి పర్యాటకులను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం–భద్రతపై అప్రమత్తం

### పారదర్శక అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్, టిజిటిడబ్ల్యూ ఆర్ఈఐఎస్‌విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కే టాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చా రు.పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరి యా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరగనున్న నేపథ్యంలో ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మ ంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు .ప్రతి గురుకులంలో వర్షాకాల ఏరా ్పట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ఆహార నాణ్యతపై వారానికోసారి నివేదికలు తీసుకోవాలని, లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దాలని సూచి ంచారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షే మ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ ,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి నటరాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో అరాచకం

(మొదటి పేజీ తరువాయి)

మాకు కోర్టు అనుమతి ఉంది. అయినప్పటికీ, వారు మా మహిళలపై దాడి చేశారు. మా కార్యకర్తలు చాలా మంది తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్నారు, వారిని రక్షించడానికి నేను ఇంటి బయటకు రావాల్సి వచ్చింది. ఉదయం నా నివాసం దగ్గర వారు బైక్ ర్యాలీ తీసి నన్ను బెదిరించారు. ర్యాలీ మార్గం పొడవునా వారు డిజెలు మోగిస్తూనే ఉన్నారు, కోర్టు అనుమతి ఉన్న మా చేతి మైక్‌లను కూడా లాక్కున్నారు' అని ఆమె ధ్వజమెత్తారు. పోలీసులు బిజెపి కార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారు అని చెప్పడానికి చింతిస్తున్నానన్నారు. ర్యాలీపై గందరగోళం సృష్టించేందుకు కాషాయ పార్టీ అనాగరిక శక్తులను నియమించుకుందని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. బెంగాల్ ప్రజలు కోరుకుంటున్న మార్పు ఇది కాదని ఆమె స్పష్టం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 14 మందికి పైగా మహిళలు అత్యాచారానికి, చిత్రహింసలకు గురై హత్య చేయబడ్డారని ఆమె ఆరోపించారు.

హత్యాచార నిందితుడు ఎన్‌కౌంటర్‌లో మృతి

పశ్చిమ బెంగాల్‌లోని బరుయిపూర్‌లో 11 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో ప్రధాన నిందితులలో ఒకడు, క్రైం రీక్రియేషన్ సందర్భంగా పోలీసు అధికారి చేతిలో నుంచి తుపాకీ లాక్కొని కస్టడీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడని ఒక సీనియర్ అధికారి తెలిపారు. మే నెలలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొట్టమొదటి పోలీసు చర్య ఈ ఎన్‌కౌంటర్. ఈ నేరంపై ప్రజాగ్రహం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటన హింసాత్మక నిరసనలకు దారితీసి, పోలీసులపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. ఈ కేసులో మొదటగా అరెస్టు అయిన వ్యక్తి ప్రభాస్ మండల్. బాలిక అదృశ్యమవడానికి కొద్దిసేపటి ముందు అతను ఆమెతో ఉన్నట్లు సిసిటివి ఫుటేజ్‌లో కనిపించడంతో, ఇతడిని ప్రధాన అనుమానితులలో ఒకరిగా పరిగణిస్తున్నారు. ఒక సీనియర్ పోలీసు అధికారి ప్రకారం, మోండల్ విచారణను తప్పుదోవ పట్టిస్తున్నాడని, పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇస్తున్నాడని ఆరోపించిన తరువాత, జరిగిన సంఘటనల క్రమాన్ని పునర్నిర్మించే ప్రయత్నంలో భాగంగా అతడిని తెల్లవారుజామున 12.45 గంటల ప్రాంతంలో దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సూర్యపూర్‌కు తీసుకువెళ్లారు. ఈ ప్రక్రియ జరుగుతున్నప్పుడు, అతను అకస్మాత్తుగా ఒక పోలీసు అధికారి చేతిలో ఉన్న సర్వీస్ తుపాకీని లాక్కొని పారిపోవడానికి ప్రయత్నించాడు. అతను పోలీసు బృందంపై ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడు. పోలీసులు ఆత్మరక్షణలో భాగంగా ఎదురు కాల్పులు జరపగా, అందులో అతనికి బుల్లెట్ గాయాలయ్యాయని ఆ అధికారి తెలిపారు. మోండల్‌ను బరుయిపూర్ సబ్‌డివిజనల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ వైద్యులు అతను మరణించినట్లు ప్రకటించారు. అతని తల్లి సంధ్యా మోండల్, తన కుమారుడు చేసిన పనులకు తగిన పరిణామాలను ఎదుర్కొన్నాడని చెబుతూ, మృతదేహాన్ని స్వీకరించడానికి నిరాకరించారు.

## ఎరువులకు ఇబ్బందులు రానీయెద్దు

### ఏప్రిల్–జూన్ సరఫరా లోటును అదనపు కేటాయింపులతో భర్తీ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాన కాలం పంటలు (ఖరీఫ్–2026) సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే అదనపు ఎరువులు కేటాయించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు లేఖ రాశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రాష్ట్రానికి రావాల్సి ఎరువుల సరఫరా లోటును జూలై నెలలో అదనపు కేటాయింపుల ద్వారా భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం 55.52 లక్షల ఎకరాల్లో విత్తనాలు పూర్తయ్యాయని, గత ఏడాది ఇదే సమయానికి 52.04 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. సాగు విస్తీర్ణం పెరగడంతో ఎరువుల అవసరం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఖరీఫ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే జిల్లాల వారీగా ఎరువుల నిల్వలు ఏర్పాటు చేసినప్పటికీ, కేంద్రం ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సరఫరాలు జరగలేదని తెలిపారు.ప్రత్యేకంగా డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాలో తీవ్ర లోటు ఏర్పడటంతో బఫర్ స్టాక్‌లు తగ్గిపోయాయని, రైతులకు సరఫరాపై ఒత్తిడి పెరిగిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్–జూన్ కాలంలో 0.45 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 1.04 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 2.53 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల కొరత ఏర్పడిందని వివరించారు. ప్రారంభ దశలో పంటలకు డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అత్యంత కీలకమని, ఈ లోటు రైతులను ఇబ్బందులకు గురిచేసే అవకాశముందని పేర్కొన్నారు.అలాగే రాష్ట్రంలోని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ లో ఉత్పత్తి అయ్యే యూరియాలో 90 శాతానికి పైగా తెలంగాణకే కేటాయించాలని మరోసారి కేంద్రాన్ని కోరారు.

రాష్ట్రంలో డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో స్థానికంగా ఉత్పత్తి అయ్యే యూరియాను రాష్ట్ర అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్–జూన్ నెలల సరఫరా లోటును అదనపు కేటాయింపులతో భర్తీ చేయడం, ఆమోదించిన నెలవారీ ప్రణాళిక ప్రకారం ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాలు కొనసాగించేలా ఆదేశించడం, రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ యూరియాలో 90 శాతానికి పైగా తెలంగాణకు కేటాయించడం, రైతులకు సకాలంలో ఎరువుల రవాణా, నిల్వలు జరిగేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు విజ్ఞప్తి చేశారు.

## జాతి నిర్మూలన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

విజయం సాధించింది. అమెరికా అణచివేత చర్యలకుగాను ఒకనాడు తోటి కరీబియన్ దేశాలు, యూరప్ దేశాల నుండి లభించిన దౌత్యపరమైన మద్దతు కూడా దొరక్కుండా అమెరికా ఏ విధంగా తమ దేశాన్ని క్షీణింపజేసిందో కూడా సమావేశం ముందుకు తెచ్చిన క్యూబా,దౌత్యపరమైన విజయం సాధించింది. ఐనప్పటికీ జనరల్ అసెంబ్లీలో ముఖ్యమైన దేశాల మద్దతు తగ్గిపోయింది. అమెరికాతో తమ సంబంధాలు దెబ్బతినకుండా ఉండేందుకే ఆ దేశాలు మద్దతు ఇవ్వడంలేదని జనరల్ అసెంబ్లీలో క్యూబా ప్రతినిధి స్పష్టం చేశారు.

తమపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ చర్చ నిమిత్తం ఏటా ఈ సమావేశానికి క్యూబా విజ్ఞప్తి చేస్తుంది. ఈసారి ఒకేసారి సెషన్‌లో రెండుసార్లు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంకోసం క్యూడా ప్రతి ఏటా చాలా వనరులను ఖర్చు చేస్తోంది. చాలా తక్కువ ఓట్లతో ఈ తీర్మానం ఆమోదం పొందుతుంది. సాధారణంగా అమెరికా,ఇజ్రాయెల్ నుండే వ్యతిరేక ఓట్లు వస్తాయి. ఈసారి ఎక్కువ మంది మద్దతు కూడగట్టేందుకు క్యూబా విశేష కృషి చేసింది. కారికామ్ అని పిలిచే 15 దేశాల కరేబియన్ దేశాల కూటమి మద్దతు కోరినప్పటికీ అమెరికా ఒత్తిడివల్ల ఈసారి ఓటింగ్‌కు 19 దూరంగా ఉండటమో, వ్యతిరేకంగా ఓటు వేయడమో చేశాయి.క్యూబాకు అత్యంత సన్నిహితమైన గ్రెనడా,ట్రినిడా,టొబాగో దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గయానా,ఆంటిగ్వా–బార్బుడా దేశాలు ఓటింగ్‌ను దాటవేశాయి.

క్యూబా విమర్శలు, వాస్తవాలను తట్టుకోలేక అమెరికా ప్రతినిధులు సమావేశంలో తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేశారు. కరీబియన్, ఇతర దేశాలు క్యూబాకు వ్యతిరేకంగా ఓటు వేయడం లేదా ఓటింగ్‌లో పాల్గొనకుండా ఉండటం లేదా పూర్తిగా ఓటింగ్‌కు దూరంగా ఉండేట్లు చేసిందని అమెరికాపై విమర్శలు చేశారు. అమెరికా అమలు చేస్తున్న ఆంక్షలకు అదనంగా ట్రంప్ ప్రభుత్వం నౌకాదళ దిగ్బంధనానికి సమానమైన,యుద్ధ చర్యతో సమానమైన ఇంధన దిగ్బంధన చర్యలు కూడా అమలు చేస్తోందని విమర్శించారు.

అమెరికా ఇంధన ఆంక్షలతో నలిగిపోతున్న కమ్యూనిస్టు దేశం క్యూబాలో విద్యుత్–ఇంధన సమస్యలు పతాకస్థాయికి చేరాయి. ప్రజలు అనేక నెలలుగా విద్యుత్ సరఫరా లేకుండా జీవితాలు సాగిస్తున్నారు. దీంతో వారు ప్రత్యామ్నాయ ఇంధన వనరులవైపు ఎక్కువగా దృష్టిసారించారు.

**ట్రంప్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం**

అమెరికాతో చర్చలకు తమ దేశం సిద్ధంగా ఉందని క్యూబా మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో మనుమడు గుల్లెర్మో రోడ్రిగ్జ్ కాస్ట్రో ప్రకటించారు. 'యుఎస్ఎ టుడే' ఆమన ఇంటర్వ్యూను సోమవారం ప్రచురించింది. తాము నేరుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ట్రంప్ నియమించిన మధ్యవర్తుకలు ఎవరైనాగానీ వారితో మాట్లాడేందుకు కూడా సుముఖంగా ఉన్నామని స్పష్టం చేశారు. న్యాయబద్ధమైన షరతులకు క్యూబా అంగీకరిస్తుందన్నారు. అమెరికాలో ఉన్న రాజకీయ ఖైదీలను ట్రంప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com